అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 29-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 250
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

స్వతంత్ర మీడియాపై అక్కసు
విమర్శలను జీర్ణించుకోలేకపోతున్న ప్రభుత్వాలు
ఆర్థిక నేరాల ఆరోపణలతో వేధింపులు



న్యూఢిల్లీ : స్వతంత్ర మీడియా, పాత్రికేయుల గొంతు నొక్కేందుకు ప్రపంచ దేశాలు 'ఆర్థిక నేరాల' అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయని ప్రచురణకర్తల అంతర్జాతీయ సంస్థ వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ న్యూస్ పబ్లిషర్స్ (డబ్ల్యూఏఎన్-ఐఎఫ్ఆర్ఏ) ...11లో

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల నిరసన
జేపీసీ సమావేశం నుంచి వాకౌట్
వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదిత సవరణలు రద్దు చేయండి: ఢిల్లీ సీఎం అతిశి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సమావేశాన్ని వాకౌట్ చేశాయి. జేపీసీ చైర్మెన్, బీజేపీ ఎంపీ ...11లో

ఇరు దేశాల మైత్రికి కొత్త శక్తి



భారత్‌లో స్పెయిన్ ప్రధాని 11లో..
పెడ్రో సాంచేజ్ పర్యటనపై మోడీ
గుజరాత్‌లో రెండు దేశాల పీఎంల రోడ్‌షో
పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నేతలు

కులగణనలేకుండానే...
వచ్చే ఏడాది జనగణన ?
2028లో నియోజకవర్గాల పునర్విభజన

న్యూఢిల్లీ : సుదీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న జనగణనను వచ్చే సంవత్సరం ప్రారంభించాలని ఎన్డీఏ ప్రభుత్వం భావిస్తోంది. దీనిని



2026లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఆ తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కూడా 2028లో పూర్తిచేయబోతోంది. జనాభా లెక్కల ...11లో

WED 6 నవంబర్ నుంచి

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే
ప్రభుత్వ నిర్ణయం | 54 అంశాలతో ఫార్మాట్

- ఆస్తులు.. అప్పులు.. - తినే తిండి, వాడే వాహనాలు... - పదవులు, వ్యాధులు కూడా

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేగా నామకరణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
వచ్చే నెల ఆరు నుంచి రాష్ట్రంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఆస్తుల నుంచి మొదలుకుని అప్పుల వరకూ, తినే తిండి దగ్గర్నుంచి వాడే వాహనాల దాకా, వ్యక్తులు అనుభవించే పదవులు, హోదాల వరకూ అన్నింటినీ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల ఆరోగ్య సమస్యలు, వారికున్న సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులను సైతం అందులో విధిగా పొందుపరచాలని సూచించింది. ఆ మేరకు మొత్తం 54 అంశాలతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనను సర్కార్ చేపట్టబోతోంది. సంబంధిత ఫార్మాట్‌ను రాష్ట్ర ప్రణాళికా శాఖ ఇప్పటికే రూపొందించింది. మొత్తం 54 ప్రశ్నలతో కూడిన ఏడు పేజీలను నమూనాగా ప్రచురించింది. ఈ ఫార్మాట్‌లో ఆస్తులతోపాటు రిజర్వేషన్ల ద్వారా పొందిన ఉద్యోగాలు, పదవులు, ఇతర హోదాలను కూడా పొందుపరచాలని అధికారులకు దిశా నిర్దేశం చేసింది. తద్వారా పౌరులు, వారి కుటుంబాల సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆదేశించింది. ఇంటి నంబర్ల కోసం ప్రత్యేక కోడ్‌ను కేటాయించింది. గత బీఆర్ఎస్ సర్కార్... 2014లో సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిన సంగతి విదితమే. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఒక్కరోజులో ఆ సర్వేను పూర్తి చేశారు. అయితే



అందులోని విషయాలను మాత్రం పదేండ్లపాటు బయటపెట్టకపోవటం గమనార్హం. ఈ నేపథ్యంలో తాము మరోసారి సమగ్ర కుటుంబ సర్వేను, తద్వారా కుల గణనను చేపడతామంటూ ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించారు. ఆయన సూచనల మేరకు ఈసారి ఎలాంటి వివాదాలు లేకుండా, ఆరోపణలు రాకుండా గణన చేపట్టాలని ప్రభుత్వం భావించింది. తద్వారా సర్వేలో పారదర్శకతకు పెద్ద పీట వేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సామాజికవేత్తలు, యూనివర్సిటీల ...10లో

కుల గణనపై నేడు కలెక్టర్లతో కాన్ఫరెన్స్
మేం ప్రజాభిప్రాయానికి పట్టంగడతాం : సామాజికవేత్తలు, మేధావులతో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో చేపట్టనున్న కుల గణన (సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, కుల సర్వే) దేశవ్యాప్తంగా ఒక మోడల్‌గా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సర్వే సందర్భంగా తాము ప్రజాభిప్రాయానికే పట్టంగడతామని ఆయన తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో సమావేశమైన డిప్యూటీ సీఎం... కుల గణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచనలు చేశారు. వచ్చే నెల ఆరు నుంచి చేపట్టబోయే ఈ గణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికతోపాటు దిశా నిర్దేశం చేయడానికి వీలుగా మంగళవారం... కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజల నుంచి సమాచారం తీసుకునేందుకు ఇంకా ఎలాంటి ...10లో



టారిఫ్ పెంపు లేదు
ఫిక్స్‌డ్ చార్జీల బాదుడు
800 యూనిట్లు దాటితే వడ్డింపులు
ప్రభుత్వ సబ్సిడీ రూ.11,499.52 కోట్లు
సర్కారు శాఖల బకాయిలు రూ.25వేల కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
విద్యుత్ చార్జీల టారిఫ్ పెరగలేదు. వ్యాపార, వాణిజ్య కేటగిరిల్లో ఫిక్స్‌డ్ చార్జీలను మాత్రం పెంచారు. 800 యూనిట్లు దాటిన వినియోగదారుల టారిఫ్‌ను స్వల్పంగా పెంచారు. నవంబర్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకే (ఐదు నెలలు) పెరిగిన చార్జీలు వర్తిస్తాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంస్థ (టీజీఈఆర్సీ) ప్రకటించింది. కొత్తగా పెంచిన ఫిక్స్‌డ్ చార్జీల వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) కేవలం రూ.30 కోట్ల ఆదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.11,499.52 కోట్లు సబ్సిడీ చెల్లించేందుకు అంగీకరించింది. దీనిలో గృహజ్యోతి పథకంతో పాటు డొమెస్టిక్ కేటగిరిలోని ఉచిత విద్యుత్ స్కీంలకు సంబంధించి రూ.1,699.45 కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఎల్‌టీ-5 కేటగిరిలో వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు రూ.9800.07 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీనివల్ల కరెంటు చార్జీల ...11లో

సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా ఎస్.హరీశ్
రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఎస్.హరీశ్ నియమితులయ్యారు. ఐ అండ్ పీఆర్‌కు ప్రస్తుతం ప్రత్యేక కమిషనర్‌గా ఉన్న ఎం.హనుమంతరావును యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా నియమించడంతో ఆ స్థానంలోకి రెవెన్యూశాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న హరీశ్‌ను బదిలీ చేశారు. పురపాలకశాఖ డైరెక్టర్ అండ్ ...11లో

రాష్ట్రంలో డిప్యూటీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు 11లో..

కేటీఆర్ బావమరిదికి నోటీసులు
అందుబాటులో లేకపోవడంతో
ఇంటి గేటుకు అతికించిన పోలీసులు

నవతెలంగాణ-మియాపూర్/శంకర్‌పల్లి



జన్వాడ ఫామ్ హౌస్ యజమాని కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. 35(3) సెక్షన్ ప్రకారం ఆయనకు నోటీసులు జారీ చేసినట్టు మోకిల పోలీసులు తెలిపారు. రాజ్‌పాకాల.. పోలీసులకు అందుబాటులోకి రాకపోవడంతో నగరంలోని రాయదుర్గంలో ఓరియన్ విల్లాస్‌లోని ఆయన నివాసానికి నోటీసును అతికించినట్టు పోలీసులు తెలిపారు.



రేవంత్‌వి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్
హామీల అమలు చేతగాకే ఇదంతా
ఆయన మెదడులో విషం తప్ప విజన్ లేదు
పాలనపై అవగాహన లేక రాష్ట్రాన్ని దివాళా తీయించారు : సీఎంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

వివరాలు 11లో

కలెక్టర్ గారూ..ఇదేం తీరు !
ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తే
దూరంగా ఉండాలంటూ జిల్లా మెజిస్ట్రేట్ వివక్ష
కలెక్టరేట్ డోర్‌కు వినతిపత్రం అందజేసి సీపీఐ(ఎం) వినూత్న నిరసన

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కించపరిచినట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా.. మెట్ల మీద నుంచి కిందకు దింపి దూరంగా ఉండి మాట్లాడాలని, దగ్గరికి రావద్దు అంటూ కలెక్టర్ అవమానకరంగా మాట్లాడి కించపరిచారని అన్నారు. దానికి నిరసనగా కలెక్టరేట్ డోర్‌కి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో పెరుగుతున్న లింగనిర్ధారణ పరీక్షలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్ వెళ్లిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిత్యకృత్యం అయ్యాయని, ఇప్పటికే ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటున్నామని చెప్తూనే మళ్లీ ఆస్పత్రులు రీ ఓపెన్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఆస్పత్రికి అండగా అధికారులు పని చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయమై కలెక్టర్‌కు వినతి పత్రం ఇద్దామని



వెళ్తే "దగ్గరికి రావద్దు దూరం ఉండే మాట్లాడండి" అని వివక్ష చూపినట్టు ఆయన వ్యవహరించడం ప్రజావాణి కొచ్చే ప్రజల పట్ల ఆయన నిబద్ధతను, చిత్తశుద్ధిని ఎత్తి చూపుతోందని అన్నారు. ప్రజల పట్ల కలెక్టర్ ప్రవర్తనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వెంటనే లింగ నిర్ధారణా పరీక్షలు చేస్తున్న అన్ని ఆస్పత్రులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకొని వారి లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యదర్శితో పాటు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట గౌడ్ తదితరులున్నారు.



బొలీవియా మాజీ అధ్యక్షుడు మొరేల్స్‌పై హత్యాయత్నం

లాపాజ్ : తనపై హత్యాయత్నం జరిగిందని బొలీవియా మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్ వెల్లడించారు. తన కారుపై గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం కాల్పులు జరిపారని తెలిపారు. ఈ దాడిలో ఆయన గాయపడలేదు. ఈ పరిస్థితికి అధ్యక్షుడు లూయిస్ అరెస్ ప్రభుత్వమే కారణమని మొరేల్స్ విమర్శించారు. రాజకీయాల నుండి తనను పక్కకు తప్పించాలన్నది ప్రభుత్వ కుట్రగా వుందని, అందుకే వారు ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ అధ్యక్షుడిపై హత్యా యత్నాలకు వెనుకాడబోని ఫాసిస్ట్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం మనమున్నామనడానికి స్పష్టమైన ఆధారాలున్నాయని మొరేల్స్‌కి చెందిన ఎంఎఎస్ చీలిక గ్రూపు ఒక ప్రకటనలో ...2లో

కీలక ఆధారాలు దొరికినట్టేనా ?
కమిషన్‌కు కాళేశ్వరం ఫైళ్లు
జస్టిస్ ఘోష్‌కు మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు అందజేత

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్
కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్‌కు కీలకమైన ఆధారాలు దొరికనట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జలసౌధలో ఈ తరహా చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. సోమవారం రామగుండం మాజీ ఈఎన్సీ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక బాధ్యతలు నిర్వహించిన నల్లా వెంకటేశ్వర్లు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్యమైన ఫైళ్లను న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్‌కు అందజేశారు. ఇందులో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అధికారిక వ్యవహారాలు, ప్లానింగ్, డిజైనింగ్, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి అన్ని విషయాలు ఉన్నట్టు తెలిసింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) అంశాలు కూడా కమిషన్‌కు అందుబాటులోకి వచ్చినట్టు సమాచారం. రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును జస్టిస్ పీసీ ఘోష్ మూడోసారి క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ఈ సందర్భంగా పలు ముఖ్యమైన అంశాలు కమిషన్ దృష్టికి తీసుకురావడంతోపాటు ఫైళ్లను కమిషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ ఘోష్ డీపీఆర్‌ను ఎవరు ఆమోదించారని నల్లా వెంకటేశ్వర్లును ప్రశ్నించగా అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆమోదించారని చెప్పారు. అలాగే



కాళేశ్వరం డిజైన్లనూ ఫైనల్ చేయాలని కేసీఆర్ చెప్పినట్టు వెంకటేశ్వర్లు తెలిపారు. పలు సమావేశాలు, మినిట్స్‌కు సంబంధించిన ఫైళ్లు, మూడు బ్యారేజీల వివరాలను కమిషన్‌కు అందించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా ? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్టు సమాచారం. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశాలు ఇచ్చారని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. ఈనేపథ్యంలో కమిషన్‌కు చేతికి కీలక ఆధారాలు చిక్కినట్టేనని జలసౌధలో అధికారుల మధ్య చర్చలు సాగుతున్నాయి. నల్లా వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫైళ్ల నేపథ్యంలో ఉన్నతాధికారులు, కాళేశ్వరం బాధ్యతలు చూసిన సీఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఏఈలు ఒకింత భయపడుతున్నట్టు తెలిసింది. మేడిగడ్డ, ...11లో



పేదల జోలికెళ్లం..
అనుమతులున్న ఇండ్లను కూల్చం

- అవి అపార్టుమెంట్లయినా సరే..
- సుపరిపాలన వైపే హైడ్రా అడుగులు
- మూసీ కూల్చివేతలతో హైడ్రాకు సంబంధం లేదు
- ప్రస్తుతం ఉన్న చెరువులు, పార్కులు, నాలాల పరిరక్షణే లక్ష్యం
- ప్రభుత్వ స్థలాలు, పార్కులు కబ్జా చేస్తే కఠిన చర్యలు
- కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములు కాపాడుతాం
- త్వరలో ల్యాండ్ గ్రాబర్ చట్టం
- హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోలేదు : నవతెలంగాణ హైదరాబాద్ రిజియన్ వర్క్‌షాపులో హైడ్రా కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో
"మంచి సుపరిపాలన వైపు తీసుకెళ్లడంలో హైడ్రా దోహదపడుతుంది.. చెరువులు, నాలాల వద్ద స్థలాల కొనుగోలు విషయంలో ప్రజల్లో అవగాహన పెరిగింది.. ఇక నుంచి అధికారులు ఇష్టానుసారంగా పర్మిషన్ ఇచ్చే పరిస్థితి లేదు.. ఒక సర్వే నెంబర్‌లో.. మరొక సర్వే నెంబర్.. ఒకచోట బిల్డింగ్ పర్మిషన్ తో.. మరో చోట చేపట్టే నిర్మాణాల అడ్డుకట్టకు బలమైన వ్యవస్థ ఏర్పాటు చేయడమే హైడ్రా లక్ష్యాల్లో భాగం.." అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్, ఐజీ రంగనాథ్ స్పష్టం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకేలో 'నవతెలంగాణ దినపత్రిక' హైదరాబాద్ రీజియన్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. హైడ్రా తరహా వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. దీని గురించి ఇప్పుడు దేశమంతటా చర్చ జరుగుతోందన్నారు. బెంగళూరు, చెన్నయ్, ఢిల్లీ రాష్ట్రాల వారు హైడ్రా గురించి అడుగుతున్నారని, అక్కడి సమావేశాలకు రావాలని ఆహ్వానిస్తున్నారని చెప్పారు. బెంగళూర్, చెన్నయ్‌లో వరదలను చూశామని, అక్కడ చెరువులు, నాలాలు కబ్జాకు గురికావడంతోనే భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ఆయా రాష్ట్రాల్లోనూ హైడ్రా లాంటి సంస్థ రావాలని స్థానికుల నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. తమ వద్దకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయన్నారు.ఇక్కడ మూసీ కూల్చివేతలకు హైడ్రాకు ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనుమతి లేని వాటిని లేదా ఇంతకు ముందే పర్మిషన్ రద్దయిన వాటిని మాత్రమే హైడ్రా కూల్చివేసిందన్నారు. కొందరు హైడ్రా కూల్చివేతలను, మూసీ కూల్చివేతలను ఒకటిగా చేసి బూచీగా చూపిస్తున్నారని తెలిపారు. వేర్వేరు సంఘటనలను తీసుకొచ్చి ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళన కు గురిచేస్తున్నారని అభిప్రాయ పడ్డారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్నారు. ప్రభుత్వ స్థలాలు, పార్కుల కబ్జాలతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా నిర్మించిన వాటిపైనే చర్యలు తీసుకున్నామన్నారు. పేదలు, సామాన్యులు నివాసముంటున్న వాటిని, అనుమతులున్న వాటి జోలికి వెళ్లబోమన్నారు. ప్రభుత్వం ఒక కటాఫ్ డేట్‌ను నిర్ణయిస్తే ఆ తేదీ తర్వాత ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామన్నారు.చెరువుల సామర్థ్యాన్ని బట్టి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను నిర్ధారిస్తామన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత ప్రజలు అన్ని పత్రాలతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను పరిశీలించి ఫ్లాట్స్, ఇండ్లను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. లేఅవుట్‌లో ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలపై దృష్టిపెట్టామని, కబ్జా అయిన వాటిని విడిపించి కాలనీ వారికి అప్పగిస్తామన్నారు. ఇక ముందు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే బిల్డర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, త్వరలో ల్యాండ్ గ్రాబర్ చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోలేదన్నారు. కేవలం చెరువుల పరిధుల్లోనే కొనుగోళ్లు ఆగాయని చెప్పారు. మిగతా చోట్ల జరగకపోవడానికి వేరే కారణాలు ఉండొచ్చన్నారు. రాష్ట్రంలో మిగతా చోట్ల జరిగే కూల్చివేతలతో హైడ్రాకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన ప్రాంతం వరకే హైడ్రా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడుతామన్నారు.

సైలెంట్ కాలేదు..
హైడ్రా సైలెంట్ కాలేదని..సాంకేతికపరంగా మరింత బలోపేతం అవుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. సాంకేతికత ఆధారంగా ఒడిశాలో ప్రభుత్వ స్థలాలను కాపాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోనూ సాంకేతికత పరంగా మరింత బలోపేతం చేసుకుని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా, కబ్జా చేసినా అలర్ట్ వచ్చేలా వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఐడియాలజీ ఉన్న పత్రిక
'నవతెలంగాణ' ప్రజల పక్షాన నిలబడే పత్రికని, ఒక ఐడియాలజీ ఉన్న ...11లో

మరో డీఎస్సీ వేసేదెలా?

ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వం | సర్కారు బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థులు

- ఇప్పటికే అదనంగా ఉపాధ్యాయులు
- విద్యాశాఖ అధికారుల్లో అంతర్మథనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'మరో డీఎస్సీ వేసేదెలా?, ఉపాధ్యాయ పోస్టుల్లేకుండా కొత్త నోటిఫికేషన్ ఎలా జారీ చేయాలి' అని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. వచ్చే నెలలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. వచ్చే ఏడాది జనవరిలో టెట్ రాతపరీక్షలను నిర్వహిస్తుంది. ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను ఫిబ్రవరిలో జారీ చేస్తామని జాబ్‌క్యాలెండర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ వేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 29న విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈనెల తొమ్మిదిన ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా 10,006 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు నియామకపత్రాలను అందుకున్నారు. ఈనెల 10,11 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో వారు రిపోర్టు చేశారు. 16న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయిస్తూ డీఈవోలు ఉత్తర్వులిచ్చారు. కొత్త టీచర్లు విధుల్లో చేరి పాఠాలను బోధిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పది వేల మంది ఉపాధ్యాయులు అదనంగా ఉన్నారని విద్యాశాఖ అధికారులు లెక్క తీశారు. ఇంకోవైపు డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే సుమారు 1,500 మందికి ఉద్యోగాలను కల్పించనుంది. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిశీలిస్తే టీచర్ల సంఖ్య ఎక్కువవున్నది. ఒకవేళ రిటైర్మెంట్ అయ్యే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అవుతాయి. అయితే అవి తక్కువ పోస్టులుంటాయి. ఈ నేపథ్యంలో మరో డీఎస్సీ ఎలా వేస్తారన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తు తున్నది. పట్టణీకరణ పెరుగు తున్నది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వస్తు న్నారు. దీంతో పట్టణాల్లో కొత్త ప్రభుత్వ పాఠశాలలు నెలకొల్పాల్సిన అవసరముందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఇంకోవైపు విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి రాష్ట్రంలో తక్కువగానే ఉన్నప్పటికీ తరగతి గదికొక టీచర్ ఉండాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచిస్తే ఉపాధ్యాయ పోస్టులను సృష్టించి మరో డీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి అవకాశముంటుందన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

ప్రయివేటు బడులకు విద్యార్థులు

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతున్నది. 2021-22 విద్యాసంవత్సరంలో 30,723 సర్కారు బడుల్లో 33,94,300 (49.08 శాతం) మంది విద్యార్థులు చదివారు. 2022-23 విద్యాసంవత్సరంలో 29,536 ప్రభుత్వ పాఠశాలల్లో 28,06,173 (47.57 శాతం) మంది విద్యనభ్యసించారు. అంటే 2021-22 విద్యాసంవత్సరం కంటే 2022-23 విద్యాసంవత్సరంలో 5,88,127 మంది విద్యార్థులు తగ్గారు. 2023-24 విద్యా సంవత్సరంలో 29,509 సర్కారు బడుల్లో 25,68,551 (42.51 శాతం) మంది చదివారు. 2022-23 విద్యాసంవత్సరం కంటే 2023-24 విద్యాసంవత్సరంలో 2,37,622 విద్యార్థులు తగ్గారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 29,541 ప్రభుత్వ పాఠశాలల్లో 23,91,813 (40.76 శాతం) మంది విద్యార్థులు చదువుతున్నారు. గత విద్యాసంవత్సరం కంటే ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 1,76,738 మంది విద్యార్థులు తగ్గారు. 2021-22 విద్యాసంవత్సరంలో చదివిన విద్యార్థులను ప్రస్తుత విద్యా సంవత్సరానికి పోల్చితే 10,02,487 (8.32 శాతం) మంది తగ్గుముఖం పట్టారు.

వారంతా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చేరుతున్నారు. 2021-22 విద్యాసంవత్సరంలో 12,360 ప్రయివేటు బడుల్లో 35,20,941 (50.92 శాతం) మంది విద్యార్థులు చదివారు. 2022-23 విద్యాసంవత్సరంలో 11,120 ప్రయివేటు స్కూళ్లలో 30,92,513 (52.43 శాతం) మంది విద్యనభ్యసించారు. కరోనా నేపథ్యంలో ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. 2023-24 విద్యాసంవ త్సరంలో 11,466 ప్రయివేటు స్కూళ్లలో 34,73,509 (57.49 శాతం) మంది విద్యా ర్థులు చదివారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో 11,890 ప్రయివేటు పాఠశాలల్లో 34,75,781 (59.24 శాతం) మంది చదువుతున్నారు. 2021-22తో ప్రస్తుత విద్యాసంవత్సరాన్ని పోల్చితే ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 50.92 శాతం నుంచి 59.24 శాతానికి పెరిగింది.

విద్యార్థుల నమోదు వివరాలు

విద్యాసంవత్సరం	పభుత్వ స్కూళ్లు	విద్యార్థుల సంఖ్య	ప్రయివేటు స్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
2021-22	30,723	33,94,300 (49.09 శాతం)	12,360	35,20,941 (50.92 శాతం)
2022-23	29,536	28,06,173 (47.57 శాతం)	11,120	30,92,513 (52.43 శాతం)
2023-24	29,509	25,68,551 (42.51 శాతం)	11,466	34,73,509 (57.49 శాతం)
2024-25	29,541	23,91,813 (40.76 శాతం)	11,890	34,75,781 (59.24 శాతం)



పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్/మహబూబాబాద్

పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ముట్టడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణాల్లో ర్యాలీ నిర్వహించి అనంతరం క్యాంపు కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్, మహబూబాబాద్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు మాట్లాడారు. గడచిన ఆరేండ్ల నుంచి ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.8000 కోట్లకు పైగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్ ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మోసగించిందని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంకు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా రంగానికి అధిక శాతం నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గుమాస నరేష్, భూపాలపల్లి జిల్లా కమిటీ సభ్యులు అవినాష్, గాంధీ, రామ్‌చరణ్, ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కో కన్వీనర్లు సూర్య ప్రకాశ్, జ్యోతిబసు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలి

- కౌలు రైతులను ఆదుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి



నవతెలంగాణ-చిట్యాల

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పంటకు మద్దతు ధర కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో రైతులు నిల్వ చేసిన పత్తిని సోమవారం మల్లు లక్ష్మి, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర లేక.. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పంటలో తేమ శాతం ఎక్కువగా ఉన్నదని, నల్ల మచ్చలు ఉన్నాయనే సాకులతో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొనకపోవడం వల్ల దళారీలను ప్రోత్సహించినట్టుగా ఉందన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కూడా క్వింటాకు రూ.7521 ధర కల్పిస్తున్నారని, అలా కాకుండా కనీసం క్వింటాకు రూ.10వేలు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో కాటన్ కంపెనీల యాజమాన్యం, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, సకాలంలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తలేరని రైతులు వాపోతున్నారని, కలెక్టర్ స్పందించి రైతులకు సహకరించాలని కోరారు.సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. పత్తి సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా రాక కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, మాజీ జెడ్పీటీసీ పామనుగుళ్ల అచ్చాలు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, నాయకులు అరూరి శ్రీను, మండల అధ్యక్షులు లడే రాములు తదితరులు పాల్గొన్నారు.

మోమోస్ తిని మహిళ మృతి

- మరో 20 మందికి అస్వస్థత
- దుకాణాన్ని సీజ్ చేసిన అధికారులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

మోమోస్ తిని ఓ మహిళ ప్రాణం కోల్పోయింది. మరో 20 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన హైదరాబాద్ బంజారాహిల్స్ నందినగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న (శుక్రవారం) బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందినగర్, సింగాడి బస్తి, గౌరీ శంకర్ కాలనీలలో వారాంతపు మార్కెట్ ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌లో కూరగాయలతో పాటు మోమోస్ లాంటి స్ట్రీట్ ఫుడ్ కూడా విక్రయిస్తుంటారు. ఈ క్రమం లోనే సింగాడికుంటకు చెందిన రేష్మ బేగం(31) అక్కడ మోమోస్ తిన్నది. ఆ తర్వాత ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. దాంతో ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించటంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతిచెందింది.

మోమోస్ తినటం వల్లే రేష్మకు ఫుడ్ పాయిజన్ అయినట్టు వైద్యులు చెబుతున్నారు.అలాగే, ఆ మార్కె ట్‌లో ఆయా బస్తీలకు చెందిన చాలా మంది మోమోస్ తిన్నట్టు సమాచారం. దాంతో 20 మందికి వాంతులు, విరేచనాలయ్యాయని తెలిసింది. దాంతో బాధితులంతా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై బాధి తుల కుటుంబసభ్యులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆ మోమోస్ తయారు చేసిన ప్రేమ్‌నగర్‌లోని షాపును జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు.

తప్పు చేయకుంటే రాజ్ పాకాల పారిపోవడమెందుకు?


- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏ తప్పు చేయకుంటే కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఎందుకు పారిపోయారని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. మంత్రిగా చేసిన కేటీఆర్ చట్టాలు తెలియకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వేడుకలో మద్యం సర్వ్ చేసేందుకు అనుమతి ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. రేవ్ పార్టీ అని ఏ అధికారి చెప్పలేదని స్పష్టం చేశారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి ప్రమేయం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ స్కాంలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుండంతో ఆందోళనతో దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

సదాశివపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన మరో లారీ
- డ్రైవర్, క్లీనర్ మృతి



నవతెలంగాణ-సదాశివపేట

సంగారెడ్డి జిల్లా సదాశివపేట వద్ద నేషనల్ హైవే 65 పై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైవే పక్కన లారీని నిలిపి పంక్చర్ వేస్తుండగా.. మరో లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పంక్చర్ వేస్తున్న లారీ డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ సైతం క్యాబిన్‌లో ఇరుక్కుపోగా.. పోలీసులు అరగంట పాటు శ్రమించి బయటికి తీశారు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి నిద్రమత్తే కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారు

మోడీ ప్రభుత్వంపై ప్రియాంక మండిపాటు



వాయనాడ్ : కేరళలోని వాయనాడ్‌లో రెండో విడత ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అభ్యర్థి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సోమవారం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్డీఏ పాలనలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారని ఆరోపించారు. మీనాన్‌గడీలో జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ మణిపూర్ హింసను ప్రస్తావించారు. దేశంలోని మైనారిటీలపై ఓ పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయని చెప్పారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలలో భయాన్ని, ఆగ్రహాన్ని, ఆవేదనను వ్యాపింపజేస్తున్న విషయం మీకు తెలుసు. మైనారిటీలపై జరిగిన దాడులను మీరు చూశారు. మణిపూర్‌లో జరిగిన హింసను చూశారు. ఓ పథకం ప్రకారం విద్వేషాన్ని వ్యాప్తి చేశారు. మైనారిటీలలో భయాన్ని రేకెత్తించారు' అని ప్రియాంక అన్నారు. సామాన్య ప్రజలకు బదులుగా నరేంద్ర మోడీ స్నేహితుల కోసం ప్రభుత్వం అనేక విధానాలు రూపొందించిందని ధ్వజమెత్తారు. రాత్రింవళ్లు కష్టించి పనిచేసే రైతులపై ఈ ప్రభుత్వానికి కనికరం లేదని, గిరిజనుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని అంటూ వారి భూములను సంపన్నులు ఆక్రమిస్తున్నారని చెప్పారు. వాయనాడ్ స్థానానికి రాజీనామా చేసినప్పుడు తన సోదరుడు రాహుల్ గాంధీ ఎంత ఆవేదన చెందాడో తనకు తెలుసునని అన్నారు. 'ఇవాళ మేము పెద్ద పోరాటం చేస్తున్నాము. దానికి రాహుల్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ దేశం ఏ విలువలపై నిర్మితమైనదో వాటి కోసం మేమంతా పోరాడుతున్నాము. రాజ్యాంగ విలువల కోసం పోరాడుతున్నాము. మన ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నాము. సమానత్వం కోసం పోరాడుతున్నాము. మీలో ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో ఓ సైనికుడే' అని ప్రియాంక చెప్పారు. కాగా నియోజకవర్గంలో జరిగిన మరో రెండు సభలలో కూడా ఆమె ప్రసంగించారు. వాయనాడ్‌లో ఎల్డీఎఫ్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరీతో ప్రియాంక తలపడుతున్నారు. అక్కడ బీజేపీ అభ్యర్థిగా నవ్య హరిదాస్ పోటీ చేస్తున్నారు.

సెట్విన్ అభివృద్ధికి అండగా ప్రభుత్వం

ఇతర ప్రాంతాలకు మినీ బస్సుల విస్తరణ : రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ - ధూల్‌పేట్

నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ పురానాహవేలీలో ఉన్న సెట్విన్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అధునాతన వసతులతో రూపొందించిన సంస్థ చైర్మెన్ కార్యాలయాన్ని చైర్మెన్ ఎన్.గిరిధర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి పురోగతి ఇతర అంశాలను మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు, చైర్మెన్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సంస్థ నిర్వహిస్తున్న శిక్షణ, ట్రాన్స్‌పోర్ట్, ట్రేడింగ్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చే విధంగా తన వంతు సహకారం తప్పక ఉంటుందన్నారు. జంట నగరాల్లోని నిరుద్యోగులకు శిక్షణ అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1978లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సెట్విన్ సంస్థను స్థాపించినట్టు గుర్తు చేశారు. గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేయడం అభినందనీయమన్నారు. సెట్విన్ మినీ బస్సు సర్వీసులను జంట నగరాలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే కార్యక్రమానికి తమ శాఖాపరంగా సహకారం ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్ ఈ ఆటో సేవలను సెట్విన్ ద్వారా అందించడంతోపాటు మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనకు సహకరిస్తామని చెప్పారు. సెట్విన్ చైర్మెన్ ఎన్.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సెట్విన్ సేవలను అన్ని జిల్లాలకు విస్తరింపజేసే సందర్భంలో త్వరలోనే జహీరాబాద్, జడ్చర్ల, హుస్నాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. రాబోయే రెండు సంవత్సరాల్లో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ప్రతి ఏటా కనీసం 25 వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ అందించి, వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, మేనేజర్ అబ్దుల్ మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై సమీక్ష

మూడు నెల్లకోసారి లైజన్ ఆఫీసర్లతో నిర్వహించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య
- 12న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ ప్రారంభం : సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మూడు నెల్లకోసారి లైజన్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలనీ, ప్రమోషన్లు, పోస్టింగులలో ఈ వర్గాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కమిషన్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డి ఎన్.బలరామ్, కమిషన్ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు, ఉద్యోగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ అధికారులకు ప్రమోషన్లు కల్పించే కమిటీ, రక్షణ కమిటీల్లోనూ ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి కనీసం ఇద్దరిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాలను ప్రతీ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేయాలనీ, అవసరమైతే ఈ విషయంలో ప్రభుత్వం తరపున మాట్లాడి సహకరిస్తామని వివరించారు. కమిషన్ దృష్టికొచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు. బలరామ్ మాట్లాడుతూ కమిషన్ చైర్మెన్ సూచించిన విధంగా మూడు నెల్లకోసారి సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ సమస్యను నిబంధనలు మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ కార్యాలయాన్ని కొత్తగూడెం హెడ్ ఆఫీస్‌లో ఏర్పాటు చేశామనీ, వచ్చే నెల 12న దాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్‌తో పాటు సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

బొలీవియా మాజీ అధ్యక్షుడు మొరేల్స్‌పై హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించింది. నల్ల దుస్తులు ధరించి, భారీగా ఆయుధాలు కలిగిన వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి మొరేల్స్ కాన్వాయ్‌పై పొంచి వుండి దాడి జరిపారని ఆ ప్రకటన పేర్కొంది. మొరేల్స్ తలకు కొద్ది సెంటీమీటర్ల దూరం నుండి బుల్లెట్లు వెళ్లాయని, తృటిలో ప్రాణాపాయం తప్పిందని తెలిపింది. ఇందుకు సంబంధించి వీడియో విడుదల చేసింది. ఈ సంఘటన జరిగినప్పుడు గగనతలంలో హెలికాప్టర్ల రొద కూడా వీడియోలో వినిపిస్తోంది. ఈ దాడిని అధ్యక్షుడు ఆరెస్ ఖండించారు. తక్షణమే దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. వ్యక్తులను చంపడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పాలక పార్టీ మూవ్‌మెంట్ టూవర్డ్స్ సోషలిజం (ఎంఎఎస్) ఉన్నత స్థాయి వర్గాల్లో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పార్టీకి ఎవరు నేతృత్వం వహించాలనే విషయంలో మొరేల్స్, ఆరెస్‌ల మధ్య ఘర్షణ జరుగుతోంది. మొరేల్స్ ప్రభుత్వ హయాంలో ఆరెస్ ఆర్థిక మంత్రిగా చేశారు.

సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

- ఎకో పార్క్ శంకుస్థాపనలో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-రామగిరి

సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లాలో సింగరేణి సంస్థ రామగుండం-3 ఏరియా జీఎం కార్యాలయ సమీపంలో 9 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు రూ.3 కోట్లా 56 లక్షలతో నిర్మించనున్న ఎకో పార్క్‌కు సోమవారం మంత్రి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కూడా సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంస్థకు వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికులను కూడా భాగస్వాములను చేశామన్నారు. గోదావరిఖని సింగరేణి మెడికల్ కళాశాలలో 7 శాతం సీట్లు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు వచ్చేవిధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎకోపార్క్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్‌రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి రావు, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మెన్ బి.జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటరమణ, రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఎస్‌వోటు జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్వాడ్, ధూలే నియోజకవర్గాల్లో సీతక్క ప్రచారం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా నాసిక్ జిల్లాలోని చంద్వాడ్ నియోజకవర్గంలో తెలంగాణ మంత్రి, ఉత్తర మహారాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) పర్యటించారు. చంద్వాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి శిరీష్ కొత్వాల్‌తో కలిసి ద్రాక్ష, ఉల్లి రైతులతో ఆమె ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఉల్లి, ద్రాక్ష పంటలను నష్టపోయినా మహారాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోలేదనీ, గిట్టుబాటు ధర దక్కడం లేదని స్థానిక రైతులు వాపోయారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..రైతు వ్యతిరేక బీజేపీ-షిండే ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించలేని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే కాంగ్రెస్ అభ్యర్థి శిరీష్ కొత్వాల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధూలే పట్టణంలో ఎంవీఏ కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ రోడ్డు షోను సీతక్క నిర్వహించారు. ధూలే వీధులు జనసంద్రం అయ్యాయి.

హరీశ్ రావు క్షమాపణ చెప్పు

- లేకపోతే అసెంబ్లీలో అడుగుపెట్టనివ్వం : మెట్టు సాయికుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డిని అవమానించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు క్షమాపణ చెప్పాలని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లేకపోతే అసెంబ్లీ అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. ప్రజల కోసం బయటికి రాని కేసీఆర్ కుటుంబ పరువు పోతుందని డీజీపీ కాల్ చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి అంటే విశ్వసనీయతకు మారుపేరని కొనియాడారు. పోలీసులు వెంటనే హరీశ్ రావును అరెస్టు చేయాలని కోరారు.

కేసీఆర్ కుటుంబ సభ్యుల ఆస్తులపై విచారణ జరపాలి : షబ్బీర్ అలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హవాయి చెప్పులు వేసుకున్న మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు 50 మంది ఆస్తులపై విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్, ఆయన బావమరిది నార్కోటెస్ట్ చేయించుకుంటే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ అనగానే కేటీఆర్ ఎందుకు ఉలికిపడుతున్నారని ప్రశ్నించారు. రాజ్ పాకాల ప్రతివారం ఫామ్‌హౌజ్‌లోనే రేవ్ పార్టీ నిర్వహిస్తారని ఆరోపించారు. పక్కా సమాచారంతోనే పోలీసులు దాడి చేశారనీ, త్వరలో వాస్తవాలు ప్రజల ముందు పెడతామని తెలిపారు.

ప్రజాస్వామ్యంపై దాడి సహించం

ప్రజా పోరాటాలకు ఎర్రజెండా నాయకత్వం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



భూములు.. భూ అక్రమార్కులు, భూస్వాముల కబ్జాల్లో ఉన్నాయి : జి. నాగయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యంపై దాడి సహించేది లేదని, హైదరాబాద్‌లో 144 సెక్షన్ విధించడంతో పాటు నిరసనలు, ధర్నాలు, రాస్తారో కోలు, ఆందోళనలు చేయొద్దని పోలీస్ కమిషనర్ ఆనంద్ పేరుతో ఇచ్చిన ఆదేశాలు అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా పెరు మాండ్ల జగన్నాథం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోలీస్ కమిషనర్ ఆదేశాలు హైదరాబాద్ వరకే పరిమితం అని ప్రకటించినా, గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా అమలు అవుతున్నాయని తెలిపారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికుల తదితరుల ఆందోళనలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటికీ, వారు హైదరాబాద్ వెళ్లకుండా జిల్లాల్లో ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారని చెప్పారు. ధర్నా చౌక్ అనేది ఫంక్షన్ హాల్‌గా మారిందని, ఉదయం ఒక ధర్నా, మధ్యాహ్నం ఒక ధర్నా సాయంత్రం ఇంకో ధర్నా నిర్వహించుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పాలన కూడా బీఆర్ఎస్ పాలనలా ఉందని వ్యాఖ్యానించారు. లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని అన్నారు. గ్రూప్-1 విద్యార్థుల పాలిట జీవో 29 దుర్మార్గంగా మారిందని, దాన్ని వ్యతిరేకించినందుకు విద్యార్థులపై లాఠీ ఉపయోగించి అరెస్టు చేసి కేసులు పెట్టడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు.. రాత్రి, పగలు పనిచేయాలని వ్యవసాయం చేయాలని, పండ్లతోటల్లో పనిచేయాలని ఇచ్చిన జీవో.. బానిసత్వాన్ని ప్రోత్సహించే విధంగా ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో ఎనిమిదేండ్లుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు నేటికీ పట్టాలు ఇవ్వలేదని విమర్శించారు. మహబూబాబాద్‌లో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం 19సార్లు దాడి చేసి వారి ఇండ్లను ధ్వంసం చేసి కేసులు పెట్టిందన్నారు. 10మంది మహిళలను చిత్రహింసలు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూడుసార్లు దాడి చేసి కేసులు పెట్టి జైలుకు పంపిందని చెప్పారు. ఎన్నికల ముందు ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు చేస్తోంది ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరసన తెలిపే హక్కు లేదంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. హైడ్రాను హైదరాబాద్ వరకే అన్నారని, కానీ రాష్ట్రవ్యాప్తంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయని అన్నారు. మానుకోటలో పేద గుడిసె వాసులకు నోటీసులు ఇచ్చారని, రేపోమాపో కూలుస్తామని భయభ్రాంతుల గురిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఆందోళనకు వ్యతిరేకంగా ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ భూములు సర్వే చేసి వెలికి తీయాలి : జి. నాగయ్య

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే చేసి ఆక్రమణలో ఉన్న భూములను వెలికి తీసి పేదలకు పంచాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాలు లేని పేదలు 31 లక్షల మంది ఉన్నారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ పేరుతో ఒక్కో నియోజకవర్గానికి ఇస్తామన్న 3500 గృహాల లెక్కన 119 నియోజకవర్గాల్లో 4,16,500 ఇండ్లు మాత్రమే వస్తాయని, మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాగార్జున ఎన్-కన్వెన్షన్ కూల్చి వేస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, బంజరాయ, సీలింగ్ భూములు.. భూ అక్రమార్కులు, భూస్వాముల కబ్జాల్లో ఉన్నాయని, వాటన్నింటినీ వెలికితీయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితులు, గిరిజనులకు భూ పంపిణీ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు గడిపిందని, నేడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అలాగే ఉందని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, శెట్టి వెంకన్న, కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రపంచానికి మార్క్సిజమే ప్రత్యామ్నాయం

బీజేపీ మతోన్మాదాన్ని అడ్డుకునేది కమ్యూనిస్టులే

తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-కొణిజర్ల

రాబోయే రోజుల్లో సామ్రాజ్యవాద విధానాలకు స్వస్తి పలికి ప్రపంచానికి మార్క్సిజమే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నమునగాలలో ఇల్లందుల వెంకటేశ్వర్లునగర్, ప్రతాపనేని లక్ష్మయ్య, లింగాల భూషణం ప్రాంగణంలో నిర్వహించిన పార్టీ మండల మహాసభలో తమ్మినేని మాట్లాడారు. మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆగడాలను అడ్డుకునేది కమ్యూనిస్టులు మాత్రమేనని, వారు లేకుంటే ఈ దేశానికి భవిష్యత్ ఉండదని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి దేశంలో ఇండియా కూటమి ఏర్పాటు చేశాయని, దాంతో బీజేపీ చావుతప్పి కన్నులొట్ట పోయేలా చేసి ఇండియా కూటమి సత్తా చాటిందని తెలిపారు. దాన్ని నడిపించడంలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్, ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య జరుగుతున్న విధ్వంసకర యుద్ధాల వెనుక సామ్రాజ్యవాద అమెరికా హస్తం ఉందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతే ప్రధాన కారణమని తెలిపారు. కేసీఆర్ అహంకారంతోనే అధికారం కోల్పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కి పట్టిన గతే పడుతుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. హైడ్రా, మూసీనది ప్రక్షాళన, దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణాలపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం) ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చిన్నచిన్నగా ప్రజావ్యతిరేకత మొదలైందని, సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లిథుయేనియా ఎన్నికల్లో

సెంటర్ లెఫ్ట్ సంకీర్ణం విజయం

విల్నియస్ : లిథుయేనియా సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షమైన మధ్యేమార్గ వామపక్ష పార్టీలు విజయం సాధించాయి. ఆదివారం జరిగిన జాతీయ ఎన్నికల తుది రౌండ్‌లో మితవాద పాలక సంకీర్ణంపై సెంటర్ లెఫ్ట్ ప్రతిపక్ష పార్టీలు పై చేయి సాధించాయి. 141 సీట్లు గల పార్లమెంట్‌లో సోషల్ డెమోక్రాట్లు 52సీట్లు గెలిచారు. దీంతో మితవాద ప్రధాని ఇంగ్రిడా సిమొనైట్ నేతృత్వంలో నాలుగేళ్ల పాలన ముగియనుంది. మరో రెండు చిన్న పార్టీలైన డెమోక్రటిక్ యూనియన్, యూనియన్ ఆఫ్ పెజంట్స్ అండ్ గ్రీన్స్ వరుసగా 14, 8 సీట్లను గెలుచుకున్నాయి. వీటితో కలిసి సోషల్ డెమోక్రాట్లు మెజారిటీ కేబినెట్‌ను ఏర్పాటు చేయడంపై చర్చలు జరపనున్నారు. ఈ సంకీర్ణానికి 74 స్థానాలు లభిస్తాయి. రెండు రౌండ్లుగా జరిగిన ఈ ఎన్నికలో పాలక సంకీర్ణం 28సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. ప్రజలు మార్పును కోరుకున్నారని, పూర్తి భిన్నమైన ప్రభుత్వం కావాలని అనుకున్నారని ఈ ఫలితాలతో వెల్లడైందని సోషల్ డెమోక్రాట్ నేత విలిజా బ్లింకెవిసిటె వ్యాఖ్యానించారు.



సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక

కార్యదర్శిగా రమేశ్‌బాబు ఏకగ్రీవం

మహాసభలు విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు : సీపీఐ(ఎం) జిల్లా కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా రమేశ్‌బాబు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 26, 27వ తేదీల్లో నిర్వహించిన పార్టీ జిల్లా 23వ మహాసభలు విజయవంతంగా ముగిసినట్టు రమేశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పార్టీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా



ఏ. రమేష్‌బాబు, కార్యదర్శి వర్గ సభ్యులుగా పెద్ది వెంకట్రాములు, నూర్జ హాన్, శంకర్‌గౌడ్, వెంకటేష్, నాగన్నను ఎన్నుకోగా, జిల్లా కమిటీ సభ్యులుగా ఏషాల గంగాధర్, నన్నేసాబ్, జంగం గంగాధర్, సుజాత, కొండ గంగాధర్, విగ్నేష్, సురేష్, రామ్మో హన్‌రావును ఎన్నుకున్నట్టు తెలిపారు. జిల్లా మహాసభలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మొదటిరోజు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించగా, రెండో రోజు ఎంపిక చేసిన ప్రతినిధులతో మహాసభ కొనసాగింది. ప్రతినిధుల సభలో మూడేండ్ల కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. రంగాలు, ప్రాంతాలవారీగా ప్రతినిధులు చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేసినట్టు తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి | పార్టీ నిర్మల్ జిల్లా మహాసభ ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా 3వ మహాసభ సోమవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి టీఎన్జీవో భవనం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.



పార్టీ జెండాను సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఆకుల సుదర్శన్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అధ్యక్షత జరిగిన బహిరంగ సభలో జ్యోతి మాట్లాడారు. ఒక్క ఉచిత బస్ ప్రయాణం తప్ప మిగతా హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ హామీ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. కౌలు రైతులకు రూ.15వేలు, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. జీవో నెం.29 విడుదల చేసి నిరుద్యోగులకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. ప్రజలు కాయకష్టం చేసి కట్టుకున్న ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తున్న ప్రభుత్వం, అనుమతి ఇచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల డిక్లరేషన్ అమలు గురించి ఎందుకు ఆలోచించడం లేదని నిలదీశారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతు భరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, బి.సుజాత, దాదారావు, జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, తిరుపతి, ఇప్ప లక్ష్మణ్, పి.గంగామణి, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘవులు, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి తదితరులు పాల్గొన్నారు.

జపాన్ ప్రతినిధుల సభకు

రికార్డు సంఖ్యలో మహిళలు

టోక్యో : జపాన్ ప్రతినిధుల సభకు రికార్డు సంఖ్యలో మహిళలు ఎన్నికయ్యారు. అయినా కూడా వీరి సంఖ్య 16శాతం కన్నా తక్కువే ఉంది. పార్లమెంటు దిగువ సభలోని మొత్తం 465 స్థానాలకు గాను మహిళలు 73 స్థానాలను గెలుచుకున్నారని ప్రభుత్వ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె పేర్కొంది. 2021లో జరిగిన ఎన్నికల్లో 45మంది మహిళలు మాత్రమే ఎన్నికయ్యారు. జపాన్‌లో వ్యాపార, రాజకీయ రంగాల్లో మహిళా నేతలు ఇప్పటికీ అరుదనే చెప్పాలి. ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వేదిక వెలువరించిన అంతర్జాతీయ లింగ నిష్పత్తిపై నివేదిక ప్రకారం 146 దేశాల జాబితాలో జపాన్ 118వ స్థానంలో వుంది. ప్రస్తుత కేబినెట్‌లో ఇద్దరు మహిళలు మాత్రమే వున్నారు. జపాన్‌లో రాజకీయ పార్టీలన్నీ పురుషాధిక్యతతోనే వుంటాయని, అరమరికలు లేని రీతిలో పనిచేయవని, అందువల్ల మహిళా అభ్యర్థులు వుండడం కష్టమవుతుందని 'నో యూత్ నో జపాన్' అధ్యక్షురాలు మొమొకొ నొజో గత నెలలో పాలక పార్టీ నాయకత్వ ఎన్నికల ముందు వ్యాఖ్యానించారు. 2021లో కేబినెట్ ఆఫీస్ నిర్వహించిన సర్వే ప్రకారం, జపాన్‌లో మహిళా అభ్యర్థుల్లో ప్రతి నలుగురిలో ఒకరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జిజి ప్రెస్ పేర్కొంది.

నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం

- కళాశాల ఆడిటోరియంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం

నాలుగున్నర దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకటయ్యారు. ఇంతకాలం తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఖమ్మం నగరంలోని ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1979- 82 మధ్యకాలంలో బీఎస్సి (బిజెడ్సి) ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఆదివారం కళాశాల ఆడిటోరియంలో కలుసుకున్నారు. నాటి అనుబంధాలను అధ్యాపకులతో కలిసి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ గడ్డం రాజశేఖర్, పూర్వ విద్యార్థులు సామినేని నాగేశ్వరరావు, రామానుజ రావు, సతీష్, భవాని శేఖర్ రాజు, ఖాదర్ పాల్గొన్నారు.

తాగిన మైకంలో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో వెంకటాపురం గ్రామానికి చెందిన దూదిపాళ్ళ మహేష్(30) మద్యం మత్తులో సోమవారం ఉరి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం మృతుడు మహేష్ మంగళ షాప్ నిర్వహిస్తూ గత కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ ఉన్నాడు. ఆదివారం రాత్రి మహేష్ మద్యం తాగి తన తల్లితో గొడవపడగా ఆమె భయంతో వేరే ఇంట్లో నిద్రించింది. మహేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఉదయం తల్లి తలుపు ఇంటికి రాగా గడియపెట్టి ఉంది. చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా మహేష్ ఉరివేసుకుని చనిపోయాడు. మృతుడు బావ మాధవరపు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ ఓ మురళి తెలిపారు.

మహిళలు న్యాయవాదులుగా రాణించాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సుధ
- న్యాయవాదుల పక్షాన నిత్యం పనిచేస్తున్న ఐలూ
- కొల్లి సత్యనారాయణ
- కన్వీనింగ్ కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర తృతీయ మహిళా కన్వెన్షన్ సందర్భంగా ఖమ్మం బైపాస్ రోడ్డులోని సప్తపది ఫంక్షన్ హాల్ లో "రాజ్యాగ పరిరక్షణలో మహిళల పాత్ర "అంశంపై సెమినార్ నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సుధ ఈ సెమినార్ లో ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఆమె ప్రసంగిస్తూ సమాజంలో సగభాగంగా వున్న మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అదే విధంగా మహిళలు న్యాయవాదులుగా రాణించాలని కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజగోపాల్ ప్రసంగిస్తూ రాజ్యాంగంలో మహిళలకు వున్న హక్కులు, రక్షణ గురించి ప్రసంగించారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఐలు న్యాయవాదుల పక్షాన నిత్యం పనిచేస్తున్నదని, మహిళా న్యాయవాదులు కోర్టులలో ఎదుర్కొంటున్న సమస్యలను మహిళా న్యాయమూర్తి దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. సెమినార్‌కు ఐలూ మహిళా కన్వీనర్ చందాల శైలజ అధ్యక్షత వహించారు. రెండో రోజు జరిగిన మహాసభలో రాష్ట్రంలో మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు చర్చించారు. చివరగా కొత్త కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా చందాల శైలజ, కో కన్వీనర్లుగా మోతుకూరి వనజ, ఎల్లావుల మంజులత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాలలో ఐలు నేషనల్ కౌన్సిల్ మెంబర్లు ఏడునూతల శ్రీనివాస రావు, జలసూత్రం శివరాం ప్రసాద్, ఐలు రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మందడపు శ్రీనివాస రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పోనుగోటి కిషన్ రావు,రిసెప్షన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నల్లమల నవీన్ చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు, ఐలు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలు ఖమ్మం పట్టణ కమిటీ కార్యదర్శి బీ. కిషోర్ పాల్గొన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ కో కన్వీనర్లుగా కే.రామలక్ష్మి, పి.శ్రీలక్ష్మిలను ఎన్నుకున్నారు.

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం: యూనిట్ నెం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నెం.71ఎ, పొవాయ్, పస్‌పోలి, ముంబయి-400087.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, దిగువ పేర్కొన్న సంతకందారు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని (54 ఆఫ్ 2002) సెక్షన్ 13(12) మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని బకాయిలను తిరిగి చెల్లించాలని కోరుతూ రుణగ్రహీత, తనఖాపెట్టినవారు, సహ-రుణగ్రహీత(లు) అయినటువంటి 1) మెసర్స్ జిఎంఆర్ మార్కెటింగ్, దీన్ని రిప్రజెంట్ చేస్తున్న యజమాని జి.కృష్ణ మోహన్ (రుణగ్రహీత), 2. శ్రీ గురిజాల కృష్ణ మోహన్, తండ్రి: మాధవరావు గురిజాలా (సహ-రుణగ్రహీత) 3. శ్రీమతి గురిజాల స్వాతి, భర్త: గురిజాల కృష్ణ మోహన్ (సహ-రుణగ్రహీత) వారు బకాయి ఉన్న మరియు నోటీసులో పేర్కొన్న విధంగా తేది:03-07-2024 నాటికి బకాయి ఉన్న రూ.21,00,490/- (రూపాయలు ఇరవై ఒకటి లక్షల తొంభై వందల నల్లై మాత్రమే) మొత్తాన్ని కాంట్రాక్చువల్ వడ్డీ రేటుపై భవిష్య వడ్డీ, కాస్ట్, ఛార్జీలు మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు తదితరమైనవి కలుపుకొని డిమాండ్ నోటీసు ముట్టిన తేదీ నుంచి 60రోజుల్లోపు తిరిగి చెల్లించాలని కోరుతూ 3,జూలై, 2024 తేదీన డిమాండ్ నోటీసు పంపడం జరిగింది మరియు దీని తదనంతరం పేపర్ ప్రకటనను 5,జూలై, 2024 తేదీన ప్రచురించడమైనది.

రుణగ్రహీత, తనఖాపెట్టినవారు మరియు సహ-రుణగ్రహీత/లు నిర్ణీత కాలపరిమితిలో బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు, తనఖాపెట్టినవారికి & సహ-రుణగ్రహీత(లు)కు ప్రత్యేకించి మరియు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న అధీకృత సంతకందారు దిగువ పేర్కొన్న ఆస్తిని సర్ఫేసి యాక్ట్‌లోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) ద్వారా మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002లోని రూల్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని 26,అక్టోబర్, 2024 తేదీన లాంఛనప్రాయంగా తమ స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది.

ఇందుమూలంగా రుణగ్రహీత, తనఖాపెట్టినవారు, సహ-రుణగ్రహీత/లు మరియు హామీదారుకు ప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా సదరు ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు. ఎలాంటి లావాదేవీలు నిర్వహించినా ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఛార్జీకు లోబడి మరియు తేది:03-07-2024 నాటికి బకాయి ఉన్న రూ.21,00,490/- (రూపాయలు ఇరవై ఒకటి లక్షల తొంభై వందల నల్లై మాత్రమే) మొత్తాన్ని కాంట్రాక్చువల్ వడ్డీ రేటుపై భవిష్య వడ్డీ, కాస్ట్,ఛార్జీలు మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు తదితరమైనవి కలుపుకొని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

రుణగ్రహీతకు తెలియజేయునది ఏమనగా సదరు యాక్ట్‌లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ 8 ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి విడిపించుకునేందుకు లభ్యమయ్యే కాలపరిమితి, తదితర వివరాలను పొందవచ్చును.

షెడ్యూల్-ఎ: ఆస్తి యొక్క వివరాలు ... రెసిడెన్షియల్ స్థలంతో కూడిన నివాసం మరియు భవనం యొక్క విస్తీర్ణం, ఎల్‌బినగర్-బి ఇంటి నెం.1-90-208 [illegible]

ప్రదేశం: నల్లగొండ జిల్లా | సం/- అధీకృత అధికారి
తేది:26-10-2024 | ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

FEDBANK FINANCIAL SERVICES LIMITED

ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం: యూనిట్ నెం.1101, 11వ అంతస్తు, సిగ్నస్, ప్లాట్ నెం.71ఎ, పోవాయి, పాస్‌పోలీ, ముంబయి-400087.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("ది యాక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్")లోని నిబంధనలకు అనుగుణంగా

దిగువ సంతకందారులు ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఫెడ్‌ఫినా) యొక్క అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి రూల్ 3తో చదవగల చట్టంలోని 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో మరియు చట్టం క్రింద సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు సంబంధిత నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని కోరుతున్నారు. రుణగ్రహీత(లు) డిమాండు నోటీసు(లు) సేవలను తిరస్కరిస్తున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకందారు సహేతుకంగా విశ్వసిస్తారు, కాబట్టి నిబంధనల ప్రకారం అఫిక్స్ చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండు నోటీసు(ల)లోని విషయాలు దిగువ పేర్కొనబడినవి:

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల యొక్క ఆస్తి హోల్డర్ల పేరు	సెక్యూర్డు అసెట్స్/ తనఖాపెట్టిన ఆస్తి వివరణ	సెక్షన్ 13(2)క్రింద డిమాండ్ నోటీసు తేది & బాకీపడిన మొత్తం
1	రుణ ఖాతా నెం. FEDSRYSTL0500680 1)అక్షిత్‌నాయక్ టిన్ని రైస్ మిల్లు (రుణగ్రహీత), దీన్ని రిప్రెజెంట్ చేస్తున్న యజమాని:కె.నాగనాయక్, మెయిన్ రోడ్డు, వీర్లపాలెం, మిర్యాలగూడ, నల్లగొండ, తెలంగాణ-508355. 2)శ్రీ నాగనాయక్ కొడావత్, తండ్రి: సూర్య (సహ-రుణగ్రహీత), డోర్ నెం.3-45/ఎ1, వీర్లపాలెం, దామరచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ, తెలంగాణ-508355. 3)శ్రీమతి ముదావత్ మంజుభాయ్, భర్త: నాగనాయక్ కొడావత్ (సహ-రుణగ్రహీత),డోర్ నెం.3-45/ఎ1, వీర్లపాలెం, దామరచర్ల, మిర్యాలగూడ, నల్లగొండ, తెలంగాణ-508355.	ఆస్తికి సంబంధించి ఇంటి నెం.3-45/ఎ1, విస్తీర్ణం 363.00 చ.గ. లేదా 480చ.మీ. నిర్మించబడిన నిర్మాణం యొక్క ప్లింత్ ఏరియా చ.అ. గ్రౌండ్ ఫ్లోర్‌తో కూడిన నిర్మాణం, ఆర్సీసీ పైకప్పుతో కూడిన నిర్మాణం, మిర్యాలగూడ రెవెన్యూ గ్రామం, గ్రామ పంచాయతీ బోర్డు, వీర్లపాలెం మండల పరిషత్, దామరచర్ల, నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, జిల్లా రిజిస్ట్రార్ నల్లగొండ జ్యూరిస్డిక్షన్ మరియు సబ్ రిజిస్ట్రార్: మిర్యాలగూడ, దీని యొక్క హద్దులు: ఉత్తరం: కొడావత్ సైదా యొక్క నివాసం, దక్షిణం: పానుగోతు బాబు యొక్క నివాసం, తూర్పు: గ్రామ పంచాయతీ రోడ్డు,ద పడమర: గుగులోతు సైదా యొక్క నివాసం. ఆస్తి హక్కుదారు పేరు: శ్రీ నాగ నాయక్ కొడావత్	తేది: 28.10.2024 నాటికి 26-10-2024 నాటికి రూ.21,81,028/- (రూపాయలు ఇరవై ఒకటి లక్షల ఎనభై ఒకటి వేల ఇరవై ఎనిమిది మాత్రమే) ఎన్‌పిఎ తేది: 04-10-2024

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు(ల)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లింపు రియలైజేషన్ తేదీ వరకు ఖర్చులు, వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చు మరియు దానితో పాటు పైన పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లించాలని దీని ద్వారా సూచించబడ్డారు. ఫెడ్‌ఫినా సెక్యూర్డు క్రెడిటార్ అని మరియు రుణగ్రహీత తనఖాగా ఉంచిన స్థిరాస్తి / ఆస్తులకు వ్యతిరేకంగా రుణగ్రహీత(లు) పొందే రుణ సదుపాయం సురక్షిత రుణం అనిరుణగ్రహీత(లు) గమనించవచ్చు. రుణగ్రహీత(ల) నిర్ణీత గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, ఫెడ్‌ఫినాకు సెక్యూర్డు అస్తుల స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13(4) కింద అన్ని హక్కులను వినియోగించుకునే హక్కు ఉంటుంది. విక్రయం ద్వారా లేదా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు చెల్లింపును గ్రహించడం ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. ఫెడ్‌ఫినాకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షిత ఆస్తులు(ల)ను అటాచ్ చేయడానికి మరియు/లేదా సీల్ చేయడానికి కూడా అధికారం ఉంది. ఫెడ్‌ఫినాకు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన అస్తుల విలువ సరిపోకపోతే, సెక్యూర్డు అస్తుల విక్రయం తర్వాత, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బ్యాలెన్స్ బకాయిలను తిరిగిపొందడానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం ఫెడ్‌ఫినాకు అందుబాటులోఉన్న అన్ని ఇతర నివారణల నుండి స్వతంత్రంగా ఉంటుంది. అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సెక్యూర్డు అస్తుల విమోచనం చేయడానికి చట్టంలోని సెక్షన్ 13(8)కి రుణగ్రహీత(ల) దృష్టిని ఆహ్వానిస్తారు మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి, రుణగ్రహీత(లు) ఫెడ్‌ఫినా వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, సెక్యూర్డు అస్తుల డిస్పోజల్ లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సెక్యూర్డు అస్తుల ద్వారా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది /నిషేధించబడింది మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ దిగువ సంతకందదారుని వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత(లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ పని వేళల్లో ఏదైనా పని రోజున దిగువ సంతకందారు నుండి దానిని సేకరించవచ్చు.

ప్రదేశం: నల్లగొండ | సం/- అధీకృత అధికారి
తేది:29-10-2024 | ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

సంపాదకీయం

మోడీ 'మంత్రోపాసన'



ఇన్నాళ్లు డిజిటల్ ఇండియా అంటూ జపం చేసిన ఇదే ప్రధాని నేడు 'మన్‌కీ బాత్'లో డిజిటల్ మోసాల గురించి మాట్లాడటం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రధానమంత్రి చాప కింద నీరులా సమాజాన్ని కబళిస్తున్న ప్రమాదాన్ని గుర్తించడం సంతోషమే. అయినా, వాటిని అరికట్టడానికి తమ సర్కార్ ప్రణాళికలను గురించి మాత్రం ఆయన ప్రస్తావించలేదు. కేవలం కంటి తుడుపు చర్యగా రాష్ట్రాల సహకారంతో దర్యాప్తు సంస్థలు ఈ బెడద నిర్మూలనకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. 'క్షణమాగండి. ఆలోచించండి. ఆ తర్వాతే స్పందించండి'.. అనే మంత్రోపదేశమొకటి చేశారు. నేటి డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఎంతో పురోగతిని చూస్తున్నాం. ఇదే సమయంలో సైబర్ నేరగాళ్ల వ్యూహాలూ మారిపోతున్నాయి. రోజుకో కొత్త విధానంతో మోసాలకు తెగబడుతున్నారు. పెరిగిపోతున్న ఈ డిజిటల్ మోసాలపై స్వయంగా ప్రధానమంత్రే ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్‌కీ బాత్'లో సైబర్ నేరాల తీవ్రత గురించి ప్రస్తావించారు. వాటిపై ఆందోళన వద్దని, అప్రమత్తతతో ఉంటే చాలని ముక్తాయించారు. అదే సందర్భంలో ప్రధానిగా తమ ప్రభుత్వం ఇలాంటి నేరాల కట్టడికి ఎలాంటి చట్టాలు చేయనుందో ఆయన చెప్పలేదు.

దేశంలో వచ్చే ఏడాదికి అంతర్జాల వినియోగదారులు 90కోట్లకు చేరనుండగా ఇప్పటికే మొబైల్ కనెక్షన్ల సంఖ్య 116కోట్లకు పైబడింది. వినియోగ విస్ఫోటానికి దీటుగా ప్రభుత్వం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకవపోవడంతో తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వాటిల్లో పొరుగునున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని కేంద్ర హోం మంత్రిత్వశాఖే వెల్లడించింది. డిజిటల్ భద్రత బీటలు వారకుండా ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలో, ఆన్‌లైన్ మోసానికి గురైతే తక్షణం ఎవరిని ఎలా ఆశ్రయించాలో పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

నేడు దాదాపు అన్నిరకాల విక్రయ కేంద్రాల్లో, మారుమూల పల్లెల్లో సైతం క్యూఆర్ స్కానర్లు దర్శనమిస్తున్నాయి. సరికొత్తగా భారత్, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్‌ల శీఘ్రతర చెల్లింపు వ్యవస్థల అనుసంధాన ప్రతిపాదనను ఆర్‌బీఐ వెల్లడించింది. ఇదంతా నాణానికి ఒకవైపు. రెండో పార్శ్వం ఆందోళనకర స్థితిగతుల్ని కళ్లకు కడుతోంది. కేంద్రహోం మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ లెక్కప్రకారం, గత ఐదేండ్లలలో నమోదైన దగాకోరు బాగోతాలు ఎకాయెకీ 5లక్షల పైనే. దేశంలో సగటున రోజుకు ఆరువేలకుపైగా సైబర్ నేరాలపై ఫిర్యాదులు అందుతున్నాయంటున్న ఐ4సీ (ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్) ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 7.4లక్షల కేసులు నమోదైనట్టు ధ్రువీకరిస్తోంది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46 శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ నాలుగు నెలల్లోనే సైబర్ నేరగాళ్లు రూ.1770కోట్ల దాకా కొల్లగొట్టారు. షేర్ ట్రేడింగ్‌లో విపరీత లాభాలొస్తాయంటూ 23 రాష్ట్రాల్లో 168మందికి రూ.22కోట్లకుపైగా టోపీ పెట్టిన గాజియాబాద్ గ్యాంగ్ చేతివాటం తాజాగా బట్టబయలైంది. జార్ఖండ్, రాజస్థాన్, హర్యానా, యూపీలలో తిష్టవేసిన సైబర్ ముఠాలే 80శాతం నేరాలకు పాల్పడుతున్నట్టు ఐఐటీ కాన్పూర్ అధ్యయనం ఇటీవలే నిగ్గుతేల్చింది. రోజూ వేలల్లో ఫిర్యాదులు వస్తున్నా విచారణరేటు స్వల్పంగానే ఉందన్న జాతీయ సైబర్ భద్రతా సమన్వయకర్త, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ రాజేశ్ పంత్ వ్యాఖ్యలు సైబర్ ముష్కరుల కట్టడిలో వ్యవస్థాగత వైఫల్యాన్నే ఎత్తిచూపుతున్నాయి.

దేశంలో వచ్చే ఏడాదికి అంతర్జాల వినియోగదారులు 90కోట్లకు చేరనుండగా ఇప్పటికే మొబైల్ కనెక్షన్ల సంఖ్య 116కోట్లకు పైబడింది. వినియోగ విస్ఫోటానికి దీటుగా ప్రభుత్వం కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకపోవడంతో తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వాటిల్లో పొరుగునున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని కేంద్ర హోం మంత్రిత్వశాఖే వెల్లడించింది. డిజిటల్ భద్రత బీటలు వారకుండా ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోవాలో, ఆన్‌లైన్ మోసానికి గురైతే తక్షణం ఎవరిని ఎలా ఆశ్రయించాలో పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

నేరగాళ్లు ఎక్కడున్నా సాంకేతిక నిఘా, ఉమ్మడి కార్యాచరణతో ఆన్‌లైన్ నేరగాళ్లకు ఉచ్చు బిగించడం ఎలాగన్న దానిపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి. ఇటీవల 61 దేశాలకు చెందిన పోలీస్ దళాలు 'ఆపరేషన్ ఫస్ట్ లైట్ 2024' పేరిట చేపట్టిన ఏకోన్ముఖ దాడిలో నాలుగు వేలమంది వరకు మోసగాళ్లు పట్టుబడ్డారు. ఆస్ట్రేలియా, జింబాబ్వే వంటి దేశాలు సైబర్ భద్రతకై ప్రత్యేక మంత్రిత్వశాఖనే ఏర్పాటుచేశాయి. ఆయా దేశాల అనుభవాల నుంచి సైబరాసురుల పీచమణచే వ్యూహాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదునుపెట్టాలి. సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వాలు కలిసికట్టుగా ఉక్కుపాదం మోపితేనే, దేశంలో డిజిటల్ చెల్లింపులు సురక్షితమవుతాయి. అంతే కానీ, ప్రధాని చెప్పినట్టు 'ఆగి...ఆలోచించి... ఆ తర్వాత నిర్ణయించండి..' అనే "మంత్రోపాసన" వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.

మెయిల్ @ నవతెలంగాణ

రైల్వేలో జనరల్ భోగీలను పెంచాలి

దేశంలోని రవాణా వ్యవస్థల్లో సగటు భారతీయునికి తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం కలిగించేది రైల్వే వ్యవస్థ. కానీ ఇటీవల జరుగుతున్న తరచూ ప్రమాదాలు, కేంద్రం అమలు చేస్తున్న అసాధారణ నిర్ణయాల వలన రైల్వేల పట్ల నిర్లిప్తత వ్యక్తమవుతున్నది. ఇప్పటికే అనేక ప్రమాదాల్లో అమాయకులు చనిపోయారు. ఇటీవల జరిగిన రైల్వే ప్రమాదాల్లో దాదాపు 350 మంది మరణించినట్లు, 970 మంది ప్రమాదాల బారిన పడినట్లు సమాచారం. 2020 ఏడాదిలో ంజాకవచ్ ప్రవేశపెట్టిన తర్వాత కూడా దాదాపు రెండు వందల ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తున్నది. ప్రయాణికుల రక్షణకు ఏ చర్యలు తీసుకుంటు న్నారు? అసలు రైల్వే వ్యవస్థలో ఉన్న ఖాళీలెన్ని, వాటిని భర్తీ చేసే ఆలోచన కేంద్రానికి ఉందా లేదా? ప్రజల రక్షణకు బదులు ఆధునికమైన నవీకరణకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ గొప్పకు పోతు న్నారే తప్ప, మౌలిక సదుపా యాల కల్పన పట్ల చిత్తశుద్ధి లేదే! కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ నివేదిక కూడా ముఖ్యంగా సిగ్నల్ వైఫల్యాల, పట్టాల పగుళ్ల కొనసాగడం గురించి తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే రైల్వే వ్యవస్థలో 50వేల ఖాళీ పోస్టులు ఉన్నట్టు, వాటిని భర్తీచేయకపోగా ఉన్నవారిపై పనిభారం పెరిగి, మానసిక ఒత్తిడితో కొన్ని మానవ తప్పిదాలు జరుగుతున్నట్టు కూడా ఈ నివేదిక పేర్కొంది. ఇప్పటికైనా రైల్వేలో మౌలిక సదుపాయాల ఆధునీ కరణతో పాటు కవాచ్ వంటి సాంకేతిక రక్షణ భద్రత అమర్చడం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. పేరు ప్రఖ్యాతులకు పోయి, అత్యంత విలాసవంతమైన సౌకర్యాల కోసం, వందేభారత్ రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు చెప్పే పాలకులు అవి ఎవరికి ఉపయోగం? ధనవంతులకా, సామాన్యులకా? ముందు సామా న్యులు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి. ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలు తగ్గించాలి.

- డి.రాంచందర్ రావు,
9849592958

అప్పుడే ప్రజా సమస్యల్ని విస్మరించారా?



ఎస్.వీరయ్య

తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మీద కూడా అసంతృప్తి ప్రారంభమైంది. పది మాసాల్లోనే ప్రజలు ప్రశ్నించక తప్పడం లేదు. వాగ్దానాలు చేసినంత వేగం అమలులో లేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మరేదీ అంత సంతృప్తికరంగా అమలు కాలేదు. ఇతర వాగ్దానాల ఊసు లేదు. ఆగస్టు 15కల్లా రుణమాఫీ చేసి తీరుతామని ప్రతి జిల్లాలో ప్రమాణం చేసిన పాలకులు నేటికీ పూర్తిగా అమలు చేయలేదు. రైతు భరోసా అడ్రస్ లేదు. ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, వైద్య ఆరోగ్యశాఖలో నర్సింగ్ సిబ్బంది పోరుబాట పట్టక తప్పలేదు. గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా వేలాది గురుకుల విద్యార్థులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వోద్యోగులూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి నోరు విప్పకపోవటం ఆశ్చర్యకరం. ఒకవైపు ముఖ్యమంత్రి, మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావు, ఇంకోవైపు ఈటెల రాజేందర్, బండి సంజయ్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో వార్తలు నిండిపోతున్నాయి. కానీ వీరెవరూ పై సమస్యల గురించి మాట్లాడటం లేదు. మూసీ పునరుజ్జీవం, 'హైడ్రా' తప్ప ఇతర సమస్యలేవీ వీరికి కనిపించవు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అడుగు జారిన బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునేందుకు తిప్పలు పడుతోంది. బీజేపీ మాత్రం ఇల్లు తగలబడుతుంటే బొగ్గులేరుకుంటున్నట్టు వ్యవహరిస్తున్నది. సమస్యల పరిష్కారం కోసం ఆందోళనతో ఎదురుచూస్తున్న ప్రజల దృష్టిని మత విద్వేషాల వైపు మరల్చే ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణలో పాగా వేసేందుకు కుయుక్తులు పన్నుతున్నది. లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాత్రం పరస్పరం కాలుదువ్వుకోవడమే తప్ప కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతపరమైన విద్వేషాలు సృష్టించే బీజేపీ ప్రయత్నాలకు వ్యతిరేకంగా స్పందించటం లేదు. రాష్ట్రంలో ఏ మేరకు బీజేపీ బలపడ్డా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకత్వాల అవకాశవాదమే కారణమవుతుంది. వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టవలసిన శ్రామికులు మాత్రం మతపరమైన చిచ్చుబెట్టే ప్రయత్నాలను ఎదుర్కోవాలి. తమ మధ్య అనైక్యత సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి. సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలి.

ఏండ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గ్రూప్ 1 అభ్యర్థులు జీవో నెం.29కి వ్యతిరేకంగా రాత్రీపగలూ రోడ్డున పడవలసి వచ్చింది. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన గందరగోళం ఫలితమిది. కోటిమంది కార్మికులకు సంబంధిం చిన కనీస వేతనాల సమస్యను పరిష్కరించకపోగా ఇరవై ఏండ్ల నాటి వేతనాలనే ఇప్పుడు కనీస వేతనాలుగా ముసాయిదా ప్రకటించడం యజమానుల కొమ్ముగాయటమే. 20 జిల్లాలు, 69 కేంద్రాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదల పట్టాల సమస్యను పట్టించుకోలేదు. గుడిసెవాసుల మీద కేసులైనా రద్దుచేయకపోగా వీరు కూడా మరింత కఠినమైన కేసులు పెట్టారు. ధరణి లోపాలను సవరించడం పక్కనపెట్టి భూమాత గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వం పిఆర్‌సి విడుదల చేసినప్పుడల్లా రాష్ట్రంలో ప్రయివేటు ఇంజనీరింగ్ స్టాఫ్‌కు కూడా వర్తించడం ఆనవాయితీ. కానీ ఇప్పుడు అది అమలు జరగటం లేదు. ప్రభుత్వ పథకాలను పార్టీ సొత్తులాగా వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిష్పాక్షికంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని చెప్పిన పాలకులు ఇప్పుడు తమ పార్టీ అనుయాయులతోనే ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమిస్తున్నారు. దీనివల్ల అర్హులకు కాకుండా తమ అనుయాయులకు కేటాయింపులు చేసే ప్రమాదం ఉంది. పాత్రికేయులకు ఇండ్ల స్థలాల సమస్య దశాబ్దాలుగా పరిష్కా రం కాలేదు. కొత్త ప్రభుత్వం రాగానే ఒక సొసైటీలో ఉన్న పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు ప్రకటించింది. మంచిదే. కానీ ఇంకా ఇతర సొసైటీలు కూడా ఉన్నాయి. సీనియర్లను విస్మ రించిందన్న అపవాదును మూటగట్టుకుంటున్నది.



మూసీ ప్రక్షాళన, పరిరక్షణ, పర్యావరణం, సాగు నీరు, తాగునీటి సమస్యలను పక్కనబెట్టి మూసీ పునరుజ్జీవం, పర్యాటక కేంద్రం పేరుతో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చుతున్నారు. బడాబాబుల వ్యాపారాల కోసం పన్నెండు వేల కుటుంబాలను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కన్నా రియలెస్టేట్ ప్రాజెక్టులే పాలకులకు ముఖ్యమవుతున్నాయి. పర్సెంటేజీలు కాజేయడానికి గత పాలకులకు కాళేశ్వరం ఉపయోగపడ్డట్టే నేటి పాలకులకు మూసీ ప్రాజెక్టు పాడిఆవు కానున్నదన్న చర్చ కూడా మొదలైంది. గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో చెరువులు, కుంటల పరిరక్షణ పేరుతో కట్టడాలను కూల్చుతున్నారు. దీనికోసం హైడ్రా పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటలను ఆక్రమించి వ్యాపార సామ్రాజ్యాలను నెలకొల్పిన బడాబాబుల భవనాలను కూల్చటం తప్పుకాదు. మెల్లగా పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజల ఇండ్లు కూల్చేవైపు అడుగులు వేస్తున్నారు. అమీన్‌పూర్‌లోనూ, కూకట్‌పల్లిలోనూ జరిగింది ఇదే. మధ్యతరగతి కాలనీలు, అపార్టుమెంట్లలో నివసిస్తున్న మధ్యతరగతి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకప్పుడు చెరువులు, కుంటల కింద వ్యవసాయం జరిగింది. ఇప్పుడు హైద్రాబాద్ నగర విస్తరణతో వ్యవసాయం లేదు. మారిన పరిస్థితుల్లో ఈ చెరువులు, కుంటల పరిధిని ఎంతవరకు కాపాడాలో ప్రభుత్వానికి స్పష్టత లేదు. అందుకవసరమైన సర్వే నిర్వహించలేదు. అనేక ఏండ్లుగా ఈ స్థలాలను రియలెస్టేట్ కబ్జాదారులు ఆక్రమిస్తుంటే పాలకులు కండ్లు మూసుకున్నారు. భవనాల నిర్మాణానికి అధికారులు అమ్యామ్యాలతో అనుమతులిచ్చారు. కొనుగోలు చేసిన మధ్యతరగతి లక్షల రూపాయలు ఇ.ఎమ్.ఐల రూపంలో బ్యాంకులకు చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి హైడ్రా పేరుతో వీరి భవనాలను కూల్చితే బజారున పడేయటమే కదా! పాలకుల వైఫల్యాలకు, అవినీతి చర్యలకు ప్రజలు బలి కావాలా? కనీసం ఇలాంటి స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులిచ్చిన ఉన్నతాధికారుల మీద మాత్రం చర్యల్లేవు. పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొన్న తర్వాతనే అనుమతులున్న భవనాలను కూల్చబోమని హైడ్రా ప్రకటించింది. హైడ్రా స్ఫూర్తితోనేమో, మహబూబ్‌నగర్‌లో రెవిన్యూ అధికారులు పన్నెండేండ్ల కింద ప్రభుత్వమే కేటాయించిన వికలాంగుల ఇండ్లు కూల్చి జబ్బలు చరుచుకున్నారు. గత బీఆర్ఎస్ పాలకులు చెరువులు, కుంటల్లో ఉన్న భవనాలను కూల్చుతామని బెదిరించి తెరవెనుక లావాదేవీలు నడిపారన్న అపవాదును మూటగట్టుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు కూడా హైడ్రా పేరుతో చేస్తున్న హడావుడి అంతా తెరవెనుక చెల్లింపుల కోసమేనని చర్చ జరుగుతున్నది.

తెలంగాణకు మణిహారం సింగరేణి బొగ్గుగనులు. బొగ్గు బ్లాకుల వేలంపాటకు కేంద్ర బీజేపీ సర్కారు నిర్ణయిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయిచేయీ కలిపి సహకరిస్తున్నది. వికారాబాద్‌లో రాడార్ ఏర్పాటుకు కేంద్రంతో భుజం కలిపింది. కనీసం ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యతను కూడా మరిచింది. హైద్రాబాద్ మహానగరంలో స్కిల్ యూనివర్సిటీ ప్రారంభి స్తున్నట్టు గొప్పగా చెపుతున్నది. రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శిస్తున్న అదానీ ఈ స్కిల్ యూని వర్సిటీకి 100 కోట్ల రూపాయల విరాళం ప్రకటిం చారు. 'ఊరక రారు మహాను భావులు' అని నానుడి. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యూనివర్సిటీలన్నీ స్కిల్ యూనివర్సిటీలుగా మార్చాలి కదా! వాటిల్లో తగిన సిబ్బంది, సౌకర్యాలు లేక మూలుగుతున్నాయి. అవన్నీ వదిలి కొత్తగా స్కిల్ యూనివర్సిటీ ప్రకటించారు. అదనంగా మరో యూనివర్సిటీ వస్తే అభ్యంతరమేమీ లేదు. అదొక్కటే స్కిల్ యూనివర్సిటీ కావడమే అభ్యంతరం. అంతేకాదు, అది కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిర్ణయించిన నూతన విద్యావిధానానికి మారుపేరు కావడమే అసలు సిసలైన వాస్తవం. మండల కేంద్రాలలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని అంటున్నారు ముఖ్యమంత్రి. ఉన్న పాఠశాలల్లో తగిన సిబ్బంది, సౌకర్యాలు కల్పిస్తే ప్రతి పాఠశాల ఒక నాణ్యమైన విద్యాసంస్థగా వృద్ధి చెందుతాయి. ఆ విషయం పక్కనబెట్టి మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం పట్ల మోజు ఎందుకు? అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రోలియం ధరలు తగ్గినా, మోడీ ప్రభుత్వం ధరల భారం మోపింది. అయినా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రశ్నించవు. రాష్ట్రానికి కేటాయింపులు తగ్గినా, విభజన హామీలు అమలు జరగకపోయినా రాష్ట్ర ప్రభుత్వం 'కేంద్రంతో సహకారం' అనే పల్లవి ఎత్తుకున్నది. సహకారం అంటే కేంద్రానికి రాష్ట్రాలదే కాదు, రాష్ట్రాలకు కేంద్రం సహకారం కూడా. ఇది పరస్పరం ఇచ్చిపుచ్చుకోవలసిన బాధ్యత. కేంద్రం పెత్తనంలో సహకారం వెతకడం 'నేతి బీరకాయలో నెయ్యి వెతకడం' లాంటిదే. రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం చేసే విషయంలో బీజేపీ కన్నా ముందు కాంగ్రెస్ చేసింది కూడా అదే. అందుకే ఇప్పుడు కేంద్రంతో పోరాడటంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం అశక్తురాలయింది. లౌకిక విలువల విషయంలో మాత్రమే

ఏండ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గ్రూప్ 1 అభ్యర్థులు జీవో నెం.29కి వ్యతిరేకంగా రాత్రీపగలూ రోడ్డున పడవలసి వచ్చింది. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన గందరగోళం ఫలితమిది. కోటిమంది కార్మికులకు సంబంధిం చిన కనీస వేతనాల సమస్యను పరిష్కరించకపోగా ఇరవై ఏండ్ల నాటి వేతనాలనే ఇప్పుడు కనీస వేతనాలుగా ముసాయిదా ప్రకటించడం యజమానుల కొమ్ముగాయటమే. 20 జిల్లాలు, 69 కేంద్రాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదల పట్టాల సమస్యను పట్టించుకోలేదు. గుడిసెవాసుల మీద కేసులైనా రద్దుచేయకపోగా వీరు కూడా మరింత కఠినమైన కేసులు పెట్టారు. ధరణి లోపాలను సవరించడం పక్కనపెట్టి భూమాత గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వం పిఆర్‌సి విడుదల చేసినప్పుడల్లా రాష్ట్రంలో ప్రయివేటు ఇంజనీరింగ్ స్టాఫ్‌కు కూడా వర్తించడం ఆనవాయితీ. కానీ ఇప్పుడు అది అమలు జరగటం లేదు. ప్రభుత్వ పథకాలను పార్టీ సొత్తులాగా వ్యవహరిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బీజేపీతో విభేదిస్తున్నాయి. అదే సమయంలో, అదే మోతాదులో అవకాశవాదం కూడా ప్రదర్శిస్తున్నాయి. అందుకే సెప్టెంబర్ 17, తెలంగాణ విలీన సందర్భాన్ని బీజేపీ వక్రీకరించినా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకత్వాలు మెతకగా వ్యవహరించాయి. వామపక్షాలు మాత్రమే వాస్తవాలు చెప్పాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలే తప్ప కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలన్న స్పృహ లేదు. లౌకిక భావాలను పాదుకొల్పి ప్రజలను ఐక్యంగా నడపాలన్న సోయి లేదు. బీజేపీ కుయుక్తులను ప్రశ్నించే తీరిక లేదు వీరికి. బహుశా కేంద్రాన్నీ, బీజేపీని ప్రశ్నిస్తే ఈడీ దాడులు జరుగుతాయని భయపడుతున్నారేమో!

రేపోమాపో విద్యుత్తు ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీల పెంపుదలకు రంగం సిద్ధమవుతున్నది. ప్రజల మీద భారాలు మరింత పెరగనున్నాయి. మరోవైపు ప్రజల అసంతృప్తిని స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి బీజేపీ నాయ కత్వం సిద్ధంగా ఉన్నది. ఇప్పటికే బక్రీద్ సందర్భంగా మెదక్ పట్టణంలో బీజేపీ-బజరంగదళ్ నేతల ప్రత్యక్ష నాయకత్వంలో మైనారిటీల ఆస్తులు ధ్వంసం చేశారు. మరో నాలుగు జిల్లాలో ఇలాంటి ఘటనలే జరిగాయి. సమ్మక్క, సారక్క జాతరలో ఎప్పుడూ లేని విధంగా హలాల్ చేసిన మాంసం అనే పేరుతో వివాదం సృష్టించారు. జైనూరులో ఆటో డ్రైవర్ ఒక మహిళ మీద చేసిన లైంగిక దాడిని మత ఘర్షణగా మార్చారు. ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఉట్నూరులో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణను కూడా మతాల మధ్య ఘర్షణలుగా చిత్రీకరించారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.

మరోవైపు మైనారిటీలలో కొందరు మతోన్మాదులు కూడా వీరికి తోడ్పడుతున్నారు. హైద్రాబాద్ ఉప్పుగూడలో దుర్గాభవాని ఆలయం మీద దాడిగానీ, సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో విగ్రహం చోరీ గానీ ఇలాంటివే. మతోన్మాదానికి హిందువులా, ముస్లింలా అన్న తేడా లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం సాధారణ ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడమే వీరి ధ్యేయం. బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు ఒక పథకం ప్రకారం ప్రజల మధ్య మతపరమైన విభజన సృష్టిస్తున్నాయి. శ్రామికులను చీల్చుతున్నాయి. సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటానికి ఇలాంటి మతపరమైన చిచ్చు తీవ్ర విఘాతం కలిగిస్తుంది. శ్రామిక ప్రజలు ఇలాంటి ప్రయత్నాలను సమైక్యంగా తిప్పికొట్టాలి. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి. ■

తెలంగాణకు మణిహారం సింగరేణి బొగ్గుగనులు. బొగ్గు బ్లాకుల వేలంపాటకు కేంద్ర బీజేపీ సర్కారు నిర్ణయిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా చేయిచేయీ కలిపి సహకరిస్తున్నది. వికారాబాద్‌లో రాడార్ ఏర్పాటుకు కేంద్రంతో భుజం కలిపింది. కనీసం ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యతను కూడా మరిచింది. హైద్రాబాద్ మహానగరంలో స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తున్నట్టు గొప్పగా చెపుతున్నది. రాహుల్‌గాంధీ తీవ్రంగా విమర్శిస్తున్న అదానీ ఈ స్కిల్ యూనివర్సిటీకి 100 కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. 'ఊరక రారు మహానుభావులు' అని నానుడి. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యూనివర్సిటీలన్నీ స్కిల్ యూనివర్సిటీలుగా మార్చాలి కదా! వాటిల్లో తగిన సిబ్బంది, సౌకర్యాలు లేక మూలుగుతున్నాయి. అవన్నీ వదిలి కొత్తగా స్కిల్ యూనివర్సిటీ ప్రకటించారు. అదనంగా మరో యూనివర్సిటీ వస్తే అభ్యంతరమేమీ లేదు. అదొక్కటే స్కిల్ యూనివర్సిటీ కావడమే అభ్యంతరం.

పోరాట స్ఫూర్తినిచ్చిన 'ఐద్వా' రాష్ట్ర మహాసభలు



మల్లు లక్ష్మి
9848481099

భద్రాద్రి కొత్తగూడెం. ఈ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది ఆదివాసీలు, గిరిజనులు. ఎన్నో ఏండ్లుగా తమ హక్కుల కోసం, ఉపాధి కోసం ఎర్రజెండా నీడలో పోరాడిన వీరులు. ఎన్నో నిర్బంధాలు, మరెన్నో ఉక్కుపాదాలు, నిర్దాక్షిణ్యమైన అణచివేతల్ని లెక్కచేయని ధీరులు. నెత్తుటి గాయాల నుంచి వచ్చిన శ్వాసనే ఆశయంగా మలుచుకున్న యోధులు. అందుకే ఈ జిల్లా పోరాటాల ఖిల్లా. గిరిజన, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆ జిల్లా అంతా ఎర్రజెండా పోరాటాలు బొగ్గుగనుల్లో అగ్గిరవ్వలా ఎగిసాయి. పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. వామపక్షాలకి ఘన చరిత్ర కలిగి, అలాంటి పోరాట నేపథ్యం ఉన్నచోట అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభలు జరగడం ప్రత్యేకతను సంతరించు కున్నది. మల్లు స్వరాజ్యం నగర్, కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణంగా నామకరణం చేసి కొత్తగూడెం క్లబ్‌లో ఈ నెల 21-23 వరకు నిర్వహించిన ఐద్వా సభలు ఎంతో ఉత్తేజాన్ని నింపాయి. రాష్ట్రంలో నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు తమ పోరాటాలు, అనుభవాలు పంచుకోవడమే కాదు, భవిష్యత్తు కార్యచరణకు నడుం బిగించారు. తొలిరోజు బహిరంగసభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ హాజరై ప్రసంగించడం వేలాదిమంది మహిళల్లో స్ఫూర్తి నింపింది.

పారిశ్రామిక ప్రాంతానికి, గిరిజన సంస్కృతికి, అభ్యుదయ భావాలకు అనేక సమరశీల రైతు పోరాటాలకు నిలయమైన జిల్లా కొత్తగూడెం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి, బొగ్గు కార్మికుల ఉద్యమానికి భద్రా చలం కేంద్రంగా ఆదివాసీ పోరాటాలకు ఈ జిల్లా నిలయం. మహిళలను, గ్రామీణ పేదలను, ఆదివాసీలను సమీకరించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన యోధులు ప్రాణాలర్పించి ఈ జిల్లాను త్యాగాలతో పునీతం చేసి, చరిత్ర కలిగినటువంటి జిల్లాలో నాలుగో రాష్ట్ర మహాసభలు జరగటం అభినందనీయం. కొండపల్లి దుర్గాదేవి, రాజేశ్వరమ్మ, హైమావతి వంటి అనేకమంది మహిళా నాయకులను తయారు చేసిన గడ్డ ఇది. దేశానికి తెలంగాణ తలమానికంగా ఉన్న సింగరేణికి పుట్టినిల్లు. కల్మషం ఎరగని ఆదివాసి సంస్కృతి దోపిడీని సహించలేని పోరాటపటిమ కలిగిన వారసత్వం భద్రాద్రి కొత్తగూడానిది. ఇక్కడి నుంచే రాష్ట్ర నాయకత్వం అనేక మహిళా ఉద్యమాలకు ప్రారంభించి విజయవంతం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం. అలాంటి జిల్లాకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవ్వడం మంచి పరిణామం.

ఉత్తేజం నింపిన మహాసభలు

నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నప్పటికీ సమాజంలో చులకన భావమే నెలకొన్నది. మనువాదం, మత రాజకీయాలతో ముడిపడిన ప్రస్తుత రాజకీయం స్త్రీలను వస్తువుగా, వంటింట్లో కుందేలుగానే చూస్తున్నది. పురుషాధిక్య సమాజంలో వారి విలువలు తరుగుతున్న సందర్భంలో 'ఐద్వా' అనేక సమస్యలపై ఉద్యమిస్తున్నది. దేశంలో రోజు రోజుకూ పెరుగుతున్న హింస పట్ల నూతన పోరాటాలను ఆవిష్కరిస్తున్నది. అందులో భాగమే తమ కర్తవ్యాల్ని గుర్తుచేస్తూ, బాధ్యతల్ని నెమరువేసుకుంటూ భవిష్యత్తు కార్యచరణలో భాగంగా మహిళల్ని ఐక్యం చేసేందుకు కొత్తగూడెంలో నిర్వహించిన ఈ మహాసభలు ఎంతగానో తోడ్పడ్డాయి. సభ ప్రారంభమైన మొదటిరోజున ఒక చేతిలో పిడికిళ్లు, మరోవైపు ఎర్రజెండాలు, ఇంకో వైపు ప్రత్యేక చీరలు ధరించిన ఐద్వా కార్యకర్తలు, డోల్ కొయ్యల కళాకారులు, డప్పు దళాల కళాకారులు, మహిళల కోలాటాలు, గిరిజన రేలా దళంతో పాత డిపో నుంచి సూర్యాప్యాలెస్ బహిరంగ సభ ప్రాంగణం వరకు ప్రదర్శన నిర్వహించారు. ' ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి వర్ధిల్లాలి', ' హింస, మద్యం, మాదకద్రవ్యాలు లేని సమాజం కోసం పోరాడదాం' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. మహిళలు స్వేచ్ఛగా జీవించే హక్కు కావాలని, వారి భద్ర తకు తీసుకొచ్చిన చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని, ఆ చట్టాల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం మహసభల ప్రారంభ సూచికంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి జెండా ఆవిష్కరించారు. ఆ తర్వాత అమరవీరుల స్థూపం వద్ద అఖిల భారత నాయకులు, ప్రతినిధులు నివాళు లర్పించారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ మీడియం బాబురావు సభనుద్దేశించి మాట్లాడారు. ముందుతరం నాయకుల పోరాట పటిమ, త్యాగనిరతి, క్రమశిక్షణ, ఉక్కు సంకల్పం స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభోపన్యాసం చేశారు. జాతీ అధ్యక్షురాలు శ్రీమతి, ఉపాధ్యక్షురాలు పుణ్యవతి కూడా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలతో మహిళలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. భారతదేశంలో కోట్లాది మందికి రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు అందరికి సమానంగా వర్తిస్తున్నాయా అనేది పశ్నించు కోవాలని, సమాన హక్కుల కోసం పోరా డాలని ప్రతి నిధులకు మంచి సందేశాన్నిచ్చారు. నిజాం పాలనలో తెలంగాణ రైతాం గ సాయుధ పోరాట చరిత్ర కీలకమైనది, అందులో చిన్నతనంలో బంధూకు పట్టి పోరాడిన మల్లు స్వరాజ్యం భవిష్యత్తు తరం నేతలకు ఆదర్శమన్నారు.

పోరాటాలు..పరిష్కారాలు

మహాసభల్లో వక్తల ఉపన్యాసాలు కార్యకర్తల్లో ఎంతో పోరాటాన్ని, ధైర్యాన్ని నింపాయి. ఈ అసమానతల సమాజంలో, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన బాధ్యత ఎంతైనా ఉన్నదని మహాసభల ఆవశ్యక్త నొక్కి చెప్పింది. ధరల పెరుగుదల, నిత్యావసర సమస్యలన్నింటి మూలమేంటి? నిరుద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు సమస్యలు ఏమిటి? ప్రభుత్వాలు ప్రజలపై ఎలాంటి భారాలు మోపుతున్నాయి? ప్రజాబాహుళ్యంలో ఉన్న సంఘంగా మహిళల ముందున్న సవాళ్లు ఏమిటో పరిశీలించాలని వక్తలు మహాసభల్లో ప్రతినిధులకు సూచించారు. బ్యాంకు ఉద్యోగాల నియామక సమయంలో గర్భంతో ఉన్న మహిళలను పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వరంగ బ్యాంకులు జారీచేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఐద్వా పోరాటం చేయటం వల్ల ఆ ఉతర్వులు రద్దయ్యాయని, అలాంటి పోరాటాలు భవిష్యత్తులో మరిన్ని కూడా చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మోడీ ప్రధాని అయ్యాక స్త్రీలు తిరోగమణ దిశలో పయనిస్తు న్నారని, అందుకే మహిళలను అభ్యుదయ భావాల వైపు మళ్లించే విధంగా విస్తృతంగా ప్రచారం అనివార్యమని, ఐద్వా విధానాలు మహిళలకు చేరువయ్యేలా ఉండాలని కోరారు. తెలంగాణలో కులదురహంకార హత్యలు, మహిళల్లో పెరుగుతున్న మూఢ నమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అంశాల పట్ల రాష్ట్ర మహాసభ తీసుకునే నిర్ణయాలు, కర్తవ్యాల అమలుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు.

కార్యదర్శి నివేదిక..సంతాప తీర్మానం

రాష్ట్రంలో మహిళల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, చేయాల్సిన పోరాటాలు, చేస్తున్న ఉద్యమాల పట్ల ప్రజల్లో స్పందన గురించి ఐద్వారాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ నివేదిక ప్రవేశపెట్టారు.



29 జిల్లాల నుండి వచ్చిన 400మంది ప్రతినిధులు పాల్గొని నివేదిక మీద మాట్లాడారు. వారు చేసిన పోరాటాలు, సాధించిన విజయాల్ని గుర్తుచేశారు. అమరవీరుల సంతాప తీర్మానాన్ని ఐద్వా సహాయ కార్యదర్శి నాగలక్ష్మి ప్రవేశపెట్టారు. మహాసభ ప్రాంగణంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, కొండపల్లి దుర్గాదేవి చిత్రపటానికి ఐద్వా అధ్యక్షురాలు పీకే. శ్రీమతి, ఎస్.ఎస్. లక్ష్మి దేవమ్మ చిత్రపటానికి ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, కుంజా కృష్ణకుమారి చిత్రపటానికి ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధాసుందర రామన్ పులమాల వేసి నివాళులర్పించారు. గత మహాసభ నుంచి నేటి వరకు మూడేండ్ల కాలంలో వివిధ కారణాల వలన చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి నాయకులను, అతిథులను భద్రాద్రి కొత్తగూడెం ప్రధాన కార్యదర్శి జ్యోతి వేదికపైకి ఆహ్వానించారు.

తీర్మానాలు

నేడు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కొన్ని తీర్మానాలు ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఆమోదం తెలిపారు. మహిళా సాధికారత కల్పించాలి.చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి. మహిళలు - ఉపాధి సమస్యలు, ఆహార భద్రత, అర్హత కలిగిన అందరికీ డబుల్ బెడ్రూంలు, పేదలందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయంమహిళలపై వివిధ రూపాల్లో పెరుగుతున్న హింసను అరికట్టడం, రాష్ట్రంలో మహిళల పరిస్థితి - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీర్మానాలు పెట్టి భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకున్నారు.అలాగే నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శు లుగా ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, కోశాధికారిగా మాచర్ల భారతి ఎన్నికవ్వగా ఆఫీస్ బేరర్స్ 19, రాష్ట్ర కమిటీ 71 మందితో ఎన్నుకోబడింది. కొత్తగూడెంలో నిర్వహించిన ఐద్వా మహాసభలు విజయవంతం కావడంతో ఐద్వా కార్యకర్తలు, ప్రతినిధులు ఎంతో ఉత్సాహంతో ఉన్నారు. భవిష్యత్తు కార్యచరణకు సన్నద్ధమవ్వడమే కాకుండా మహిళల్ని ఐక్య ఉద్యమాల్లో పాల్గొనేలా చేస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు. ■

నాగేశ్వరరావుని అతి దుర్మార్గంగా హత్య చేశారు

- ఏచూరి లేకుంటే ఇండియా కూటమి లేదు
- కాంగ్రెస్ ఉడత ఊపులకు భయపడేది లేదు
- ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- గ్రామంలో సీపీఐ(ఎం) శ్రేణులు భారీ ర్యాలీ



నవతెలంగాణ - బోనకల్

ఎర్రబోయిన నాగేశ్వరరావుని కాంగ్రెస్ గూండాలు అతి కిరాతకంగా హత్య చేశారని, సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి లేకపోతే దేశంలో ఇండియా కూటమి ఏర్పడేది కాదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకొని ప్రవర్తించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో సిపిఎం యువ నాయకుడు, అమరజీవి ఎర్రబోయిన నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ గోవిందాపురం ఎల్ గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు ఏడునూతల లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. తొలుత ఎర్రబోయిన నాగేశ్వరరావు చిత్రపటానికి, స్థూపానికి తమ్మినేని వీరభద్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో నాగేశ్వరరావు వర్ధంతి సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేకపోతే ఆంధ్రాలో ఐపీఎస్ అధికారులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కొంతమంది పోలీసుల తీరును తాము సహించబోమని, ఒకవేళ అంత ప్రేమ ఉంటే పోలీస్ చొక్కా తీసివేసి మూడు రంగుల కాంగ్రెస్ జెండా కప్పుకొని పని చేసుకోవాలని సూచించారు. లేదా తామే ఆ చొక్కాలని విప్పిస్తామని స్పష్టం చేశారు. ఎర్రబోయిన నాగేశ్వరరావుని కమ్యూనిస్టులు ఉన్నంతకాలం గుర్తుంచుకుంటారన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన మంచి కార్యకర్త నాగేశ్వరరావు అని కొనియాడారు. నాగేశ్వరరావు త్యాగాలు వృథా కావని, ఆయన ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొంతమంది కష్టాలను తట్టుకోలేక పార్టీ మారుతున్నారని, అటువంటి పరిస్థితుల్లో కూడా నాగేశ్వరరావు తన ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డాడే తప్ప పార్టీ మారలేదన్నారు. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు వెకిలి వేషాలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ఉడతా ఊపులకు కమ్యూనిస్టులు భయపడరని, ఈ విషయం తెలుసుకోవడం మంచిదన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తమతో మాట్లాడారని అందుకోసమే ఎన్నికలలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. తమకు అధికారం ఉందని, తమ ఇష్టం వచ్చినట్టు చేస్తామని అంటే మాత్రం తాము ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఇచ్చిన గడువు ముగిసిపోయిందని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రోడ్లు ఎక్కుతామని హెచ్చరించారు. రైతుల రుణమాఫీ కోసం 31 వేల కోట్లు చెల్లించవలసి ఉండగా 18 వేల కోట్లు మాత్రమే చెల్లించి రైతుల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి ప్రకటించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ ఆరు క్షల కోట్లు అప్పు చేస్తే కాంగ్రెస్ 85 వేల కోట్లు అప్పు చేసిందని కేటీఆర్ అంటున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇల్లును కూల్చితే చూస్తూ ఊరుకోబామని, గ్రూప్ వన్ పరీక్షలలో అభ్యర్థుల ఆందోళనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

చైన్, గేదెల దొంగలు జాగ్రత్త

చైన్, గేదెల దొంగలు జాగ్రత్తగా ఉండాలంటూ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సీపీఐ(ఎం)కు పదవులు లేకపోవచ్చు కానీ దేశస్థాయిలో ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని అందుకు ఉదాహరణ సీతారాం ఏచూరి మరణిస్తే మృతదేహాన్ని జేఎన్‌యుకు తీసుకెళ్లి విద్యార్థులు, మేధావులు నివాళులర్పించారన్నారు. అదేవిధంగా చికిత్స పొందిన ఎయిమ్స్ ఆసుపత్రిలో వైద్య బృందం మొత్తం సీతారాం ఏచూరికి తల వంచి నివాళులర్పించింది అన్నారు. అంతటి మహానుభావుడు సీతారాం ఏచూరి అన్నారు. ఈ అద్భుతమైన సంఘటన దేశంలో ఏ నాయకుడికీ దక్కలేదన్నారు. అంత ప్రాధాన్యత కమ్యూనిస్టు నాయకులకు మాత్రమే దక్కిందన్నారు. వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, బివికె ట్రస్ట్ చైర్మన్ ఎనిగళ్ళ శ్రీనివాసరావు, ఐలు రాష్ట్ర నాయకులు ఏడునూతల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ, నాయకులు కారంగుల చంద్రయ్య, మాదినేని వీరభద్రరావు, జొన్నలగడ్డ సునీత, నల్లమోతు వాణి, తమ్మారపు లక్ష్మణ్, పొన్నం రాంబాబు, కోట కాటయ్య, పసుపులేటి నరేష్, పలువురు మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనికి ఘన స్వాగతం

ఎర్రబోయిన నాగేశ్వరరావు వర్ధంతి సభలో పాల్గొనడానికి వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు గ్రామ శివారులో పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గ్రామ పొలిమేరలో పూల వర్షంతో స్వాగతం పలుకుతూ నాగేశ్వరావు ఇంటి వద్దకు భారీ ర్యాలీగా వెళ్లారు. అక్కడ నుంచి నాగేశ్వరరావు స్తూపం వరకు ర్యాలీగా వెళ్లారు.

ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే రోడ్డెక్కుతాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం

నవతెలంగాణ - బోనకల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతుందని, అయినా ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపటం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే తాము ప్రజలతో కలిసి రోడ్లు ఎక్కుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం దొప్ప కొరివి వీరభద్రం అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక వాగ్దానాలను చేసిందని, కానీ కేవలం ఒకే ఒక వాగ్దానం మాత్రమే అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని వారి డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేస్తుందని, దీని వలన కాంగ్రెస్‌కే నష్టం జరుగుతుందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇల్లును కూల్చుతుందన్నారు. మూసీ నది ప్రక్షాళన మంచిదే అయినప్పటికీ అక్కడ నివాసం ఉంటున్న వారికి ముందుగానే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా వారిని అక్కడ నుంచి వెళ్ళగొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించే ఏ ప్రభుత్వంపైన అయినా తాము ప్రజా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకులు కొంగర వెంకటనారాయణ, నాయకులు జొన్నలగడ్డ సునీత, గుడ్డురి ఉమ, కందికొండ శ్రీనివాసరావు, కిలారి సురేష్, మర్రి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు 'అవార్డుల' పంట

- అభినందనలు తెలిపిన ఎంపీ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలంలోని సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు అవార్డుల పంట వరించింది. ఇండియా ఎలైట్ ఎడ్యుకేషన్ అండ్ ఇనిస్టిట్యూషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ అండ్ కాన్ఫరెన్స్ -2024 వారి సౌజన్యంతో బెంగళూరులో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సాయిస్ఫూర్తి కళాశాలకు ఎక్సలెన్స్ అడ్మినిస్ట్రేషన్, క్వాలిటీ ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్ -2024 తదితర అంశాలపై బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కళాశాల తరపున ప్రిన్సిపాల్ ఊటుకూరు శేషారత్నకుమారి అవార్డులు అందుకున్నారు. కళాశాల గర్వించదగిన అవార్డులు రావడానికి కృషిచేసిన కళాశాల పాలకవర్గంతో పాటు ప్రిన్సిపాల్, వివిధ విభాగాలకు చెందిన అధిపతులు, భోదన, భోదనేతర సిబ్బందిని రాజ్యసభ సభ్యులు హెటిరో అధినేత, కళాశాల చైర్మెన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్ రియాలిటీ సిస్టం (వీఆర్ఎస్) ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా తమ కళాశాల ప్రిన్సిపాల్‌కు భారత సేవారత్న అవార్డు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి మాట్లాడుతూ సమాజం పట్ల తమ కళాశాల నిర్వహించిన బాధ్యతలకు గుర్తింపుగా ఈ అవార్డులు రావడంతో తమ కళాశాలకు మరింతగా బాధ్యత పెరిగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా అత్యున్నతంగా భావిస్తున్న ఈ అవార్డులు రావడానికి అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలకు అవార్డులు వచ్చిన నేపథ్యంలో కళాశాలతో పాటు ప్రిన్సిపాల్ శేషారత్నకుమారికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



పేదలకు, రైతులకు న్యాయం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ - బోనకల్

అర్హులైన పేదలకు, రైతులకు న్యాయం చేయటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ యువనేత బిపి నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక నందు నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలు సమస్యలపై అధికారులతో బీపీ నాయక్ చర్చించారు. పంట పరిహారంపై శాస్త్రీయ పద్ధతిలో సమగ్ర సర్వే నిర్వహించి బాధితులను ఆదుకోవాలని, విద్యుత్ సమస్యలు, పాఠశాల మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ప్రధానంగా ఇటీవల పంట పరిహారంపై ఏర్పడిన సమస్యలపై వ్యవసాయ అధికారి వడితియా నాగేశ్వరరావుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలపై, భూ రిజిస్ట్రేషన్ సమస్యలపై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని త్వరితగతిన వాటిని పరిష్కరించాలని తహసిల్దార్ అనిశెట్టి పున్నమి చందర్, గిర్దావర్లు గుగులోతు లక్ష్మణ్, చీరల రమాదేవిలను కోరారు. విద్యుత్ సమస్యల, పాఠశాల మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజల తరపున కోరారు. సమస్యలకు పరిష్కారం చూపుతామని అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



శాంతి నిలయంలో పొంగులేటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలో గల శాంతి నిలయంలో మానసిక వికలాంగులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఉమ్మినేని కృష్ణ అధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మానసిక వికలాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం శాంతి నిలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తోటకూర వెంకటేశ్వరరావు, భుక్య సైదానాయక్, బండి వెంకటేశ్వర్లు, బాగం నాగేశ్వరరావు, భాగం పాపారావు, సాధినేని రాంబాబు, బోయినపల్లి మురళి, చిలక వెంకటేశ్వర్లు, కన్నేటి సురేష్, బీరెల్లి వాసు, నారాయణ పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్పొరేటర్ మలీద్ జగన్ మృతి

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మూడో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ మోహన్ రావు సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఉదయం విపరీతమైన ఛాతి నొప్పితో జగన్మోహన్రావు తన నివాసంలో కుప్పకూలిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ముందుగా స్థానిక ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. కార్పొరేటర్ మలీదు జగన్ భౌతిక కాయాన్ని సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి నివాళులు అర్పించారు.

పదవీవిరమణ ప్రయోజనాలను వెంటనే అందించాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ- నేలకొండపల్లి

పదవీ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే అందించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణం నందు మూడు దశాబ్దాల పాటు విద్యారంగంలో వివిధ పాఠశాలల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన అయినాల గోవిందరావు సన్మాన సభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవిందరావు దంపతులను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మందడపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గోవిందరావు వేలాది మంది విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దారని, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని, ఆయన సేవలు శ్లాఘనీయమని ప్రశంసించారు. గోవిందరావును ఆదర్శంగా తీసుకుని విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల పదవీ విరమణ ప్రయోజనాలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంచడం సరికాదని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని, ఆరోగ్యకార్డుల ద్వారా అపరిమితమైన వైద్యం అందించాలని కోరారు. స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను స్వంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, మాజీ నాయకులు నెల్లూరి వీరబాబు, రాజశేఖర్, జిల్లా నాయకులు పి.సురేష్, అరవింద్ కుమార్, నవాబ్ సాహెబ్, గురవయ్య, రాధాకృష్ణ, పురుషోత్తం, రవీందర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే

పోరాటాలే శరణ్యం

- నర్వనేని పుల్లయ్య స్మారక భవనం ప్రారంభోత్సవంలో నున్నా



నవతెలంగాణ- కల్లూరు

పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యవేదిక పోరాటాలే శరణ్యమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో నిర్మించిన నర్వనేని పుల్లయ్య స్మారక భవనంను నున్నా నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరితో పాటు ఇటీవల అమరులైన వారికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) గ్రామ శాఖా కార్యదర్శులు రాజులపాటి రాజారావు, సోబత్తిని కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నున్నా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో సిపిఎం ప్రధాన శక్తిగా ఎదిగిందని, అనివార్య కారణాల వల్ల పార్టీ కొంత దెబ్బతిన్నందన్నారు. మళ్లీ పార్టీకి పూర్వ వైభవం రావాలంటే క్షేత్రస్థాయిలో ప్రజాబలం పెంచుకోవాలన్నారు. ప్రస్తుత పాలకులు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు జరగలేదని, వాటిని అమలు జరిపేందుకు కలిసొచ్చే పార్టీలతో ఐక్యవేదిక ఏర్పాటు చేసి పోరాటాలు చేసి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి అన్నారు. అందుకు గ్రామస్థాయిలోనే పునాది ఏర్పడాలన్నారు. పార్టీ కార్యాలయాలు పార్టీతో పాటు గ్రామంలోని ప్రజలకు విజ్ఞాన వేదికలుగా మారాలన్నారు. అప్పుడే సమాజంలో మార్పు జరగాలన్నా... పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నా.. ప్రజల్లో చైతన్య అవసరం అన్నారు. ఈ ప్రాంతంలో కట్టా వెంకట నరసయ్య, చింతలపూడి జగ్గయ్య, నర్వనేని పుల్లయ్యలు సీపీఐ(ఎం) బలోపేతానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. వారిచ్చిన స్ఫూర్తి వారి ఆశయాలను కొనసాగించాలంటే వారి వారసులుగా పోరాటం చేసినప్పుడే వారికి మనమిచ్చే ఘన నివాళి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారంటీలో ఏది పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అరకొరతోనే సరిపెడుతుంది అన్నారు. మహిళలకు బస్సు ఉచిత ప్రయాణం తప్ప, ఏది పూర్తిస్థాయిలో అమలు జరగలేదు అన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు జరిపి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయాలన్నారు. అందుకోసం సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేయటానికి సంసిద్ధమవుతుందని స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయానికి స్థలం భవన నిర్మాణానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్ మాట్లాడుతూ తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో సిపిఎం ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండేదని, కట్ట వెంకట నరసయ్య, నర్వనేని పుల్లయ్య, జాను, శ్యామ్ సోను తదితరులు పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. కొన్ని కారణాలవల్ల పార్టీ నుంచి బయటికి రావాల్సి వచ్చిందని అయినా పార్టీకి వ్యతిరేకంగా ఏనాడూ పని చేయలేదని, ఇప్పటికీ తమ వంతు సహకారం అందిస్తూనే ఉన్నామని అన్నారు. ప్రజల సమస్యల కోసం కలిసి పనిచేస్తున్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణం దాతలు, పోచారం సొసైటీ అధ్యక్షులు నర్వనేని పెద్ద అంజయ్య, నర్వనేని చిన్న అంజయ్య, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ సిపిఎం కార్యదర్శులు మాదాల వెంకటేశ్వరరావు, గాయం తిరుపతిరావు, అయినాల రామలింగేశ్వరరావు, తన్నీరు కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీ మేరమ్మ, తన్నీరు కృష్ణార్జునరావు, ముదిగొండ అంజయ్య, సిపిఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టా సత్యనారాయణ రెడ్డి మాతృమూర్తి మృతి

నవతెలంగాణ - బోనకల్



ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మమత హాస్పిటల్స్ యూడిసి చిట్టా సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి చిట్టా మంగమ్మ (95) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్య సమస్యలతో ఇబ్బందుపడుతుంది. పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి ఏడుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పిల్లలమర్రి వెంకట అప్పారావు, దొప్ప కొరివి వీరభద్రం, కందికొండ శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, ముష్టికుంట్ల మాజీ సర్పంచ్ కొమ్ము శంకర్‌రావు, ముష్టికుంట్ల మాజీ సర్పంచ్ కొంగర వెంకటనారాయణ, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ హస్సన్ సందర్శించి నివాళులర్పించారు.

వ్యవసాయ కార్యాలయానికి తాళం వేసిన రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ - బోనకల్



మండలంలో పంట పరిహారం పొందిన రైతుల వివరాలను వెల్లడించనందుకి నిరసనగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి సిపిఐ రైతు సంఘం నాయకులు, రైతులు సోమవారం తాళం వేశారు. నష్టపరిహరం పొందిన, సమగ్ర పంట నష్ట సర్వేలో నమోదు చేసిన రైతుల వివరాలను వెల్లడించాలని తాము అనేకసార్లు మండల వ్యవసాయ శాఖ అధికారులను కోరామని అయినా వారి నుంచి సరియైన సమాధానం రావడం లేదని రైతు సంఘం నాయకులు పారుపల్లి నరసింహారావు తెలిపారు. అయినా మండల వ్యవసాయ అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేదని, మండల వ్యవసాయ అధికారికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ పరిహారం పొందిన రైతుల వివరాలు తెలపకపోవడంతో నిరసనగా బోనకల్ మండల వ్యవసాయ కార్యాలయానికి తాళం వేశామన్నారు. ఇప్పటికైనా మండల వ్యవసాయ అధికారులు స్పందించి పరిహరం పొందిన, సమగ్ర పంట నష్ట సర్వేలో నమోదు చేసిన రైతుల వివరాలను వెల్లడించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు పారుపల్లి నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు సిపిఎం బోనకల్ గ్రామ శాఖ కార్యదర్శి ఉప్పర శ్రీను బిజెపి నాయకులు గంగుల నాగయ్య రైతులు కొంగర కష్టయ్య, గాలి కోటయ్య, ఏలూరి రమేష్, కొంగర వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆదేశాల మేరకు పంట నష్టంపై అధికారుల రీసర్వే

నవతెలంగాణ -బోనకల్

జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ శాఖ అధికారులు మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో పంట నష్టంపై సోమవారం రీ సర్వే నిర్వహించారు. రాపల్లిలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు మండల వ్యవసాయ శాఖ అధికారులు మండల వ్యాప్తంగా పంట నష్టంపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో అనేక అవకతవకలు జరిగినట్లు అనేక మంది రైతులు మండల వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఇటీవల పరిహారం చెల్లించింది. దీంతో అవినీతి అక్రమాలు వెలుగు చూశాయి. పంట నమోదు అక్రమాలపై రాపల్లి, ఆళ్లపాడు గ్రామాలకు చెందిన రైతులు రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. వెంటనే ఆ గ్రామాల్లో పంట నష్టంపై రీసర్వే నిర్వహించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్యకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు మండల వ్యవసాయ శాఖ అధికారి వడితియా నాగేశ్వరరావు, రాపల్లి క్లస్టర్ ఏఈఓ షేక్ హుస్సేన్ సాహెబ్‌తో కలిసి పంట నష్టం పై రీ సర్వే నిర్వహించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

బీజేపీ పాలనలో పేదల బతుకు భారం

- ధరల పెరుగుదలతో కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి
- గ్రామస్థాయిలో పోరాటాలు పెరిగితేనే బలోపేతం
- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు



నవతెలంగాణ- కల్లూరు

దేశంలో గత పది సంవత్సరాలుగా మతోన్మాద బిజెపి పార్టీ పరిపాలనలో ప్రజలకు న్యాయం జరగకపోగా బతుకు భారంగా మారి కుటుంబ వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో సిపిఎం 9వ మండల మహాసభ ప్రారంభ సందర్భంగా ఆ గ్రామ సీనియర్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీతారాం ఏచూరితో పాటు ఇటీవల మృతి చెందిన నాయకులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు అనంతరం బీరవెల్లి పుల్లయ్యనగర్‌లో సిపిఎం మండల మహాసభ ఆహ్లాదకర వాతావరణంలో ప్రారంభమైంది. ఐద్వా మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, సిఐటియు మండల కార్యదర్శి గంపల శ్రీనివాస్ అధ్యక్షతన మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాచర్ల భారతి మాట్లాడుతూ బీజేపీ మతోన్మాదంతో కులాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని ప్రజలకిచ్చిన బిజెపి హామీ పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. బిజెపి పాలనలో అదాని, అంబానీ వంటి బడా వ్యాపారవేత్తలకు అనుకూలంగా ఉంటూ వారి ఆస్తులు వేల కోట్లు పెంచడానికి దోహదపడుతుందన్నారు. పేదలకు భారాలు మోపుతూ బడా వ్యాపారస్తులకు రాయితీలు ఇస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు వేసి గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన వాగ్దానలు అమలు చేయట్లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేయకపోవడంతోనే ప్రజలు గద్దె దింపి గట్టి గుణపాఠం చెప్పారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే ధోరణిలో ఉందని ఆరోపించారు. సిపిఎం సిద్ధాంతపరంగా క్రమశిక్షణతో ఉంటూ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఓసారి క్షేత్రస్థాయి నుంచి కేంద్రం స్థాయి వరకు మహాసభలు నిర్వహించి గతంలో చేసిన లోటుపాట్లను చర్చించుకుంటూ భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవటం సిపిఎం సిద్ధాంతం అన్నారు. ప్రజల పక్షాన ఉండి ప్రజలు ఆపదలో ఉంటే ఆదుకోవడమే కమ్యూనిస్టులు లక్ష్యంగా పనిచేస్తున్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటే పేదల బాధలు సభ దృష్టికి తీసుకుపోవటానికి వీలుంటుందని మేధావులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిస్టులు పురోగతి పెరగాలంటే పోరాటాలు పెరిగితేనే సాధ్యపడుతుంది అన్నారు.



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిపిఎం బలోపేతం కావాలంటే గ్రామ శాఖలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. మండలంలో ఎనిమిది గ్రామ శాఖలు ఉన్నాయని, అవి మరింత వృద్ధి చెందాలంటే గ్రామాల్లో సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్, తన్నీరు కృష్ణార్జునరావ్, ప్రసంగించారు. పార్టీ మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు సభలో పార్టీ నివేదిక ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శిగా రెండోసారి మాదాల వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా తన్నీరు కృష్ణార్జునరావు, ముదిగొండ అంజయ్య, తన్నీరు కృష్ణవేణి, గంప శ్రీనివాసరావు, దోమతోటి పుల్లయ్య, తెగుళ్ళ బాబు, మనమంటి వెంకటి, సామినేని హనుమయ్య, రేసు నాగేశ్వరరావు, రామనాథం, బట్టు నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సభలో తల్లాడ, పెనుబల్లి సిపిఎం మండల కార్యదర్శిలు అయినాల రామలింగేశ్వరరావు, గాయం తిరుపతిరావు, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం పకీరమ్మ, తల్లాడ సిపిఎం మండల నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, బీరవల్లి పుల్లయ్య సతీమణి వెంకటమ్మ, వెంకట నారాయణ పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-వేంసూరు

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా గొల్లమూడి నాగలక్ష్మి ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆమె కుటుంబానికి అంత్యక్రియలు సహాయం ప్రభుత్వం నుండి వచ్చిన రూ.10వేలు సిడిపిఓ కనకదుర్గ, సూపర్వైజర్ కమల అందజేశారు. ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ అందేందుకు కృషి చేస్తామని కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శాంతకుమారి, సిఐటియు మండల కార్యదర్శి వల్లూరు చంద్రశేఖర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆరవపల్లి జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత కొండా రామారావు మృతి

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని వల్లభి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు కొండా రామారావు(55) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు బిచ్చాల బిక్షం, భూక్య ధర్మానాయక్, రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రామారావు మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడు రామారావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రాఘవ, కోయ చిన్నధనమూర్తి, మీగడ నాగేశ్వరరావు, సిమ్మసర్తి ఎల్లయ్య, ఏలూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజావాణి సమస్యపై అధికారుల స్పందన

నవతెలంగాణ-బోనకల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చేందుకు గ్రామాల నుండి ప్రజలు తరలివస్తున్నారు. స్థానిక రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమంలో మండల కేంద్రమైన బోనకల్ గ్రామానికి చెందిన రేగళ్ల శ్రీనివాసరావు ఖమ్మం రోడ్ లోని11వ వార్డులోని ఓపెన్ ప్లాట్లలో నిత్యం దుర్గంధభరితమైన వాసనతో పాటు మురికి నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రత ప్రాణాంతకంగా మారడంతో పారిశుద్ధ్య సమస్యపై సంబంధిత శాఖ అధికారులకు ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ బోనకల్ పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి క్షేత్రస్థాయి సిబ్బందితో దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతానికి వెళ్లారు. సమస్యను పరిశీలించి ఫిర్యాదుదారుడు రేగళ్ల శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సమస్యను గుర్తించిన ప్రజావాణి అధికారులు ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు చేరి దుర్గంధ భరితంగా ఉండటంతో ఆయా ప్లాట్ల యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి కోలా రాజ్యలక్ష్మిని తహసిల్దార్, ఎంపీఓ ఆదేశించారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నోటీసు అందిన వారం రోజులలో ఆయా ప్లాట్ల యజమానులు పారిశుద్ధ సమస్యపై స్పందించకపోతే పారిశుద్ధ్య యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ అనిశెట్టిపున్నం చందర్, ఎంపీఓ శాస్త్రిలు స్థానిక పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు అంతోటి రమేష్, మంద నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎస్‌జేకేఎం విద్యార్థి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నవంబర్ 3 న మహబూబాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు సర్దార్ జబలాపురం కేశవరావు మెమోరియల్ కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఎస్‌జెకెఎం కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థి నూనావత్ గోపీచంద్ ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపక బృందం, పలువురు అభి నందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'హార్వెస్ట్' విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఆదివారం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 బాల బాలికల ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఎంపికల్లో హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. బాస్కెట్ బాల్ సెలక్షన్‌లో అండర్ 19 బాలికల విభాగంలో షణ్ముఖ ప్రియ, తనూశ్రీ, జి.లిఖిత, ప్రవల్లిక జోసెఫ్, మెహజబిన్, బాలుర విభాగంలో దివాకర్, విష్ణు, ఎస్‌కె. జుబేర్, సాయి లోకేష్ అలాగే అండర్ 19 నెట్ బాల్ సెలక్షన్‌లో దివాకర్, లోకేష్, అండర్ 19 కబడ్డీలో విష్ణు కార్తీక్‌లు నవంబర్ నెల మహబూబ్ నగర్‌లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండం-19 షటిల్ బాడ్మింటన్లో బిఎమ్.సుశాంత్, జి.ముఖేష్, బి.డేవిడ్, వై.వివేక్‌లు హైదరాబాద్లో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ఆదివారం జరిగిన ఓపెన్ చెస్ టోర్నమెంట్లో మా విద్యార్థిని, విద్యార్థులు అండర్ 11 బాలుర విభాగంలో అనీష్ సూర్య ప్రథమ బహుమతి, అండర్ 14 బాలుర విభాగంలో సాత్విక్ సిద్ధు ప్రథమ బహుమతి, అండర్ 17 బాలుర విభాగంలో సత్య ప్రణవ్ ప్రథమ బహుమతి సాధించారని అన్నారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీలలో కూడా చక్కటి ప్రతిభతో రాణించాలని ఆకాంక్షించారు. అలాగే తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతీరోజు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి ఎక్కడ పోటీలు నిర్వహించిన విజేతలుగా తిరిగిరావడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన చెస్ కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులకు, అలాగే వారికి ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

వార్డెన్ అనుమానాస్పద మృతి

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని ఓ దాబా వద్ద వార్డెన్ రాజేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరు మండలం శ్రీరాం నగర్ తండాకు చెందిన భూక్యా రాజేష్(21) గత మూడు నెలలుగా ఓ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం వైరా వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న ఓ దాబా వద్ద రాజేష్ మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని చూసిన అజ్మీరా చంటి అనే వ్యక్తి ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అన్నంసేవా ఫౌండేషన్ చైర్మెన్ అన్నం శ్రీనివాసరావు సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్‌కి మృతదేహాన్ని తరలించారు. మృతుని తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు ఖానాపురం హావేలి పోలీస్ స్టేషన్ సీఐ భాను ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్ష నేత ఇండ్లపై తనిఖీల పేరుతో దౌర్జన్యం

నవతెలంగాణ-కారేపల్లి

పాలన చేతకాని కాంగ్రెస్ పెద్దలు ప్రజల దృష్టిని మరల్చటానికి ప్రతిపక్షనేత కేటీఆర్ కుటుంబికుల ఇండ్లపై తనిఖీల పేరుతో పోలీలను ఉసికొల్పి దౌర్జ్యానానికి పాల్పడుతున్నారని బీఆర్ఆర్ నాయకులు, మాజీ దిశకమిటీ సభ్యులు లాకావత్ లక్ష్మన్ ఆరోపించారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గృహప్రవేశం సందర్భంగా జరిగిన వేడుకను రేవ్ పార్టీ అంటూ లేని పోని ఆరోపణలతో రచ్చ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను కాంగ్రెస్ పాలనను గమనిస్తున్నారని ఇచ్చిన హామీలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రతిపక్ష నేత కేటీఆర్ ను టార్గెట్ చేయటం అవివేకమన్నారు. ఇప్పటికైన కక్షపూరిత చర్యలు మాని ప్రజాసంక్షేమానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్ష ఫీజుల పెంపు ఆలోచనలు వెనక్కి తీసుకోవాలి

- **ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్**

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ వార్షిక ఫీజులను 100 శాతం పెంచాలనే ఇంటర్ బోర్డు ఆలోచన వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విద్యా సంవత్సరం మార్చిలో నిర్వహించే పరీక్షలు కొరకు ఫీజును 100 శాతం పెంచాలని ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 500 రూపాయలు ఉన్న ఫీజును 1500 లేదా 1400 రూపాయలు వరకు పెంచాలనే ఆలోచనతో ఇంటర్ బోర్డు ప్రభుత్వాని ప్రతిపాదనలు పంపడాని పునారలోచన చేయాలని కోరారు. రాష్ట్రంలో ఈ పరీక్షలు రాస్తున్న 9లక్షల మంది విద్యార్థులకు ఇది భారంగా మారుతుందని, తక్షణమే ప్రభుత్వం ఏలాంటి ఫీజును పెంచకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- **ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి**

నవతెలంగాణ-పెనుబల్లి

మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం లంకాసాగర్ ప్రాజెక్ట్‌లో 6 లక్షలు చేప పిల్లలును ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ 100శాతం రాయితీపై లంకాసాగర్ ప్రాజెక్ట్‌లో 6 లక్షలు చేప పిల్లలను విడుదల చేసిందని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం మత్స్యకారుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మత్స్యకారుల సమస్యలును రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఖమ్మం జిల్లా మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా లంకాసాగర్ రైతు వేదిక నందు ఎమ్మెల్యే రాగమయి కేకులు కత్తిరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జనం మెచ్చిన నేత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్



పెనుబల్లి



కల్లూరు

గంట ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, కల్లూరు ఏఎంసి చైర్మెన్ భాగం నీరజ, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు శివ ప్రసాద్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు, ఏఎంసీ వైస్ చైర్మెన్ రాజబోయిన కోటేశ్వరరావు, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నీలాల గోపి కార్యకర్తలు, కొల్లి రాజా, శ్రీనివాసరావు, ప్రసాద్ గ్రామస్తులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

తల్లాడ : సీసీఐ కేంద్రాన్ని పత్తి రైతులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండల కేంద్రమైన తల్లాడలో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ పత్తిని సిసిఐ కౌంటర్‌లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు ఆరుకాలం కష్టించి పండించిన దిగుబడులను విక్రయించి మోసపోవద్దని హెచ్చరించారు. అనంతరం పొంగులేటి జన్మదిన పురస్కరించుకొని ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాలి

కల్లూరు : ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధరతో పాటు సన్న రకాలకు 500 బోనస్ ను కూడా పొందవచ్చునని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయనంద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పుల్లయ్య బంజర గ్రామపంచాయతీ శివాలయం మల్లిక గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఐకెపి డిఆర్డిఏ ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోకల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి, మండల స్పెషల్ ఆఫీసర్ మార్క్ఫెడ్ నరసింహారావు, తహసిల్దార్ పులి సాంబశివుడు, ఎండిఓ దాసరి చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి రూప, ఎంపీఓ సురేష్ బాబు, ఏపీఎం ఎం. వెంకట్రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- **సీపీఐ(ఎం) ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ హిమామ్**

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు షేక్ హిమామ్ అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) 30 డివిజన్ ముఖ్య కార్యకర్తలు సమావేశం పెద్దోజు ఉపేంద్ర చారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం కావస్తుంది కానీ ఇంత వరకు ప్రధానమైన వాగ్దానాలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే చేసిన వాగ్దానాలను అమలు చేయాలని, అలాగే 30 వ డివిజన్‌లో గత నెల మంచి కంటి రామ్ కిషన్‌రావు పార్కు ప్రక్కన నుండి దర్గా రోడ్డునకు గత నెల 24న మంత్రి తుమ్మల నాగేశ్వరావు సీసీ రోడ్డు వేయడానికి శంకుస్థాపన చేశారు. చాలా సంతోషం కానీ రోడ్డు వెడల్పు తగ్గించి పార్కుకు ప్రక్కన ఉన్న జాలిని తొలగించకుండా చిన్న రోడ్డుని వేస్తున్నారు. వెంటనే దర్గా నుంచి ఒక పావు కిలోమీటర్ దూరం జాలిని తీసివేసి రోడ్డు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలను కలుపుకొని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో 30 డివిజన్ శాఖ కార్యదర్శి యర్రా నగేష్, తాళ్లూరి రామకృష్ణ, షేక్ లాల్ బి, సిఐటియు హమాలీ జిల్లా నాయకులు మద్ది శ్రీను, సుగ్గల హనుమంతరావు, షేక్ మదార్, పొదిల రాఘవయ్య, అమరపల్లి బుచ్చయ్య, జంగం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- **మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య**

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ప్రజావాణికి వచ్చిన వచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించి బాధితులకు లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గాలి పాషా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసి బాణసంచా కాల్చి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మెన్ కోసూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాయల పుల్లయ్య, పొట్లపల్లి శేషగిరిరావు, తేజావత్ రామ్మూర్తి, బానోత్ బొజ్జనాయక్, సలీం, నాగేశ్వరరావు, నాగ సైదులు, రంజాన్, కృష్ణమూర్తి, రాంబాబు, ప్రవీణ్, హరినాథ్, శ్రీను, వేణుగోపాల్, పృథ్వీరాజ్, వెంకన్న, లాల్ సాయి, వీరేందర్ అన్వర్, సైదులు, హలీం, రాంబాబు, గాలిబ్ పాషా, బాసు, రవి, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

యాడ్ వార్త

ఐఎంఏ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బొల్లికొండ

- **పలువురు ప్రముఖుల అభినందనలు**

నవతెలంగాణ-ఖమ్మం



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఖమ్మంకు చెందిన డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్ కోటి సెంటర్‌లోని ఐఎంఏ హాల్‌లో ఐఎంఏ రాష్ట్ర కమిటీ సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూసుమంచి మండలం చేగమ్మ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు తన తండ్రి బొల్లికొండ నాగయ్య ప్రభుత్వ ఉద్యోగి అయినందున వారు ఖమ్మంలో నివాసం ఉన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ విద్యనభ్యసించి ఆ తర్వాత పీజీ పూర్తి చేశారు. 1999లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా బాధ్యతలు చేపట్టి. ఆర్థో స్పెషలిస్ట్‌గా వైద్య సేవలు అందించారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంఓగా నాలుగు సంవత్సరాలు విశేషమైన సేవలు అందించి ప్రభుత్వ జిల్లా ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా జిల్లా అధ్యక్షులుగా విశేషమైన సేవలు అందించారు. 2000 సంవత్సరంలో జిల్లా ఐఎంఏలో సభ్యుడిగా చేరి జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కమిటీలు మంచి పేరు సంపాదించారు. ఆ తర్వాత కాలంలో నాలుగు సంవత్సరాల పాటు ఐఎంఏ జిల్లా కార్యదర్శిగా పనిచేసి, ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు ఐఎస్ఏ జిల్లా అధ్యక్షులుగా సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వహించారు. తర్వాత వర్కింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు సేవలను గుర్తించిన ఐఎంఏ రాష్ట్ర కమిటీ ఆదివారం జరిగిన ఆ కమిటీ సమావేశంలో శ్రీనివాసరావును ఏకగ్రీవంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిగా పేద ప్రజలకు విశేషమైన సేవలు అందిస్తూ సామాజికపరంగా తన సేవలను లైన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్నారు. వైద్య పరంగా పేద ప్రజలకు సేవలు అందిస్తూ, ఐఎంఏ లో కీలక బాధ్యతలు నెరవేరుస్తూ ఖమ్మం లయన్స్ క్లబ్ సభ్యుడిగా చేరి పేద ప్రజలకు సామాజికపరంగా మరిన్ని సేవలు అందిస్తున్నారు. 2024లో ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ బొల్లికొండ బాధ్యతలు చేపట్టి ఇటీవల కాలంలో మున్నేరు వరద ముంపుకు గురైన ఖమ్మం ప్రజలను తమ అక్కున చేర్చుకున్నారు. ప్రాథమికంగా వారికి కావలసిన నిత్యావసర సరుకులను, దుస్తులను అందించి తన మానవీయతను చాటుకున్నారు. వైద్య పరంగా సామాజికపరంగా పేద ప్రజలకు అండగా నిలిచి అనేక రకాల సేవలు అందిస్తూ, విద్యాపరంగా రామకృష్ణ విద్యాలయం కమిటీ సభ్యుడిగా తన సేవలను అందిస్తున్నారు.

పలువురి ప్రముఖుల అభినందనలు

డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు ఐఎంఏ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా నియామకం పట్ల పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ రవీంద్ర రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ కే ప్రసాద్ రావు, ఖమ్మం ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ ఎలమంచిలి రవీంద్రనాథ్, డాక్టర్ గురునాథం, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ జగదీష్, కమిటీ సభ్యులు డాక్టర్ రెహానా బేగం ఖమ్మం కు చెందిన పలువురు ప్రముఖ వైద్యులు శ్రీనివాసరావును అభినందించారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వై ప్రభాకర్ రెడ్డి, ఎక్స్ లయన్ జిల్లా గవర్నర్ డాక్టర్ రాఘవరెడ్డి, రీజినల్ జోనల్ చైర్మన్ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఖమ్మం లయన్స్ క్లబ్ కార్యదర్శి గెల్లా శ్రీరామ్ తదితరులు డాక్టర్ బొల్లికొండను అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు 'శ్రీనిధి' విద్యార్థులు

నవతెలంగాణ-మధిర



కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 బాల బాలికల కబడ్డీ పోటీలలో మధిర శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ 9 వ తరగతి విద్యార్థులు 1.నాగ అఖిల్, 2.మౌనిక, 3.కార్తీక అత్యంత ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో స్కూల్ కరెస్పాండెంట్, ప్రిన్సిపల్ బి. అంజన బాబు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యతో పాటుగా క్రీడల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు సరైన శిక్షణ ఇచ్చి వారి ఉన్నతకి పాటుపడే ఏకైక స్కూల్ శ్రీనిధి అని ఎంపికైన విద్యార్థులను అభినందించారు. స్కూల్ డైరెక్టర్ చందు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

దాతలు ఆదుకొని పాప ప్రాణాలు కాపాడండి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని చెన్నూరు గ్రామానికి చెందిన వాడపల్లి రవి, అశ్విని దంపతులకు అక్టోబర్ 23న పాప జన్మించింది. అయితే ఊపిరితిత్తులలో ఏర్పడిన సమస్య వల్ల పాప శ్వాస పీల్చు కోవడంలో ఇబ్బంది పడుతుంది. ప్రస్తుతం విజయవాడలో ఆంధ్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పాప ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. చికిత్స నిమిత్తం ఐదు లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. పాప పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నిరుపేద కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చి పాప ప్రాణాలు కాపాడాలని సామాజిక కార్యకర్త ఎం.రాంప్రదీప్ కోరారు. పూర్తి వివరాలకు 7396538890ను సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

- **అడిషనల్ కలెక్టర్‌గా పి. శ్రీనివాసరెడ్డి**
- **డీఆర్వోగా భుజంగరావు**
- **ఖమ్మం ఆర్డీవోగా జి. నరసింహారావు**

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రెవెన్యూ శాఖలో సోమవారం పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 70 మందికి పైగా అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో ముగ్గురు ముఖ్య అధికారులను బదిలీ చేశారు. ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గా పనిచేస్తున్న మధుసూదన్ నాయక్ స్థానంలో సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గా పని చేస్తున్న పి. శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. మధుసూదన్ నాయక్ మహబూబ్‌నగర్ జిల్లా భీమా ప్రాజెక్ట్ భూ సేకరణ అధికారిగా బదిలీ అయ్యారు. ఇక చాలాకాలంగా ఖాళీగా ఉంటున్న జిల్లా రెవెన్యూ అధికారి పోస్టును భర్తీ చేశారు. నిర్మల్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా ఉన్న వి. భుజంగరావును ఖమ్మం డిఆర్ఓ గా నియమించారు. ప్రస్తుతం ఇన్ చార్జి డీఆర్ఓ గా ఉన్న రాజేశ్వరి స్థానంలో ఆయన బాధ్యతలు చేపడుతారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ ఆర్డీవో గా పనిచేస్తున్న జి. నరసింహారావును ఖమ్మం రెవిన్యూ డివిజనల్ అధికారి గా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న గణేష్ ను తొర్రూర్ కు బదిలీ చేశారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక సమస్యలతో పురుగుమందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డట్టు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రావినూతల గ్రామానికి చెందిన చింతపట్ల కృష్ణారావు (47) కూలీ చేసుకుంటూనే కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమార్తెకు ఇటీవలే వివాహం చేశాడు. దీంతో కొంత అప్పు పెరగటంతో పాటు వ్యవసాయంలో నష్టాలు వచ్చాయి. గత కొన్ని రోజులుగా తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి పడుకున్నాడు. ఆ తర్వాత తన కుమార్తెకు ఫోన్ చేసి తాను పురుగుమందు తాగానని చెప్పాడు. దీంతో ఆమె వెంటనే కృష్ణారావు ఇంటి పక్కనే గల బంధువులకు సమాచారం అందించింది. వెంటనే బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కృష్ణారావు ప్రాణాలతో ఉండటంతో 108 లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు.

నేడు సీపీఐ(ఎం) మండల మహాసభ

నవతెలంగాణ-చింతకాని

మండల పరిధిలో గల ప్రొద్దుటూరు గ్రామంలో మంగళవారం సీపీఐ(ఎం) మండల మహాసభ ఉదయం 10 గంటలకు జరుగుతుందని మండల కార్యదర్శి మడపల్లి గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ఈ మండల మహాసభకు వివిధ గ్రామాల నుండి శాఖ కార్యదర్శిలు శాఖ సభ్యులు వివిధ ప్రజా సంఘాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, వత్సవాయి జానకి రాములు తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

మహారాజశ్రీ ఏజెంట్ టు ది గవర్నమెంట్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం
ఓ.యస్. నెం. 213/2024
మధ్య:
గుంపెనపల్లి వీరస్వామి, తండ్రి: సుబ్బారావు, వయస్సు:33 సంవత్సరాలు, ఉద్యోగం: 33/11కెవి [illegible] (APDCL) [illegible]
స్థలం: కొత్తగూడెం
తేదీ: 29/10/2024

మహారాజశ్రీ ఏజెంట్ టు ది గవర్నమెంట్
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , కొత్తగూడెం
ఓ.యస్. నెం. 318/2023
మధ్య:
బానోత్ వీరన్న, తండ్రి: చందల్, కులం: లంబాడ (ఎస్.టి), వృత్తి: ప్రైవేట్ జాబ్, హౌస్ నెం. 9- [illegible]
స్థలం: కొత్తగూడెం
తేదీ: 29/10/2024

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

తెలంగాణలో కక్షపూరితమైన పరిపాలన

- ఆరు గ్యారెంటీలు వదిలేసి విదేశీ పర్యటనలో మంత్రులు
- పాత్రికేయుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



తెలంగాణలో కక్షపూరితమైన పరిపాలన సాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యాంరెంటీలు వదిలేసి విదేశీ పర్యటనలో మంత్రులు తిరుగుతున్నారని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు గాని హామీలతో ఆరు గ్యారెంటీలతో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కాలం వెలదీస్తునదే తప్ప హామీలు అమలు కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఏ వర్గం అయినా ప్రశాంతంగా ఉందా అని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ నాయకులు మానే రామకృష్ణ, చర్ల మండల పార్టీ అధ్యక్షులు సోయం రాజారావు, సీనియర్ నాయకులు శ్రీనివాసరాజు, ఆకోజు సునీల్ కుమార్, కణితిరాముడు, కోలరాజు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- నేటితో ముగియనున్న గడువు
- మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా


నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అందిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యూనివర్సిటీలో 1.స్కూల్ ఆఫ్ హెల్త్ కేర్, 2.స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్, 3.స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఇ-కామర్స్ వంటి విభాగాల్లో పలు కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కోర్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులు అని, కోర్సు వ్యవధి కాలం 3 నెలలు ఉంటుందని తెలిపారు. శిక్షణా కాలంలో అభ్యర్థులకు నెలకు రూ.17500లు స్టైఫండ్ అందిస్తుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ వివరాలను www.yisu.in వెబ్ సైట్ నందు ఆన్లైన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8520860785 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



గోళ్ల భూపతిరావుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ పురస్కారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



హైదరాబాద్ నగరంలోని కళా సంగీత నాట్య వేదిక త్యాగరాయ గానసభ చిక్కడపల్లి నందు స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు, భారత ప్రథమ హెూం మంత్రి, ఉప ప్రధాని భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింధు ఆర్ట్స్ అకాడమీ హెూప్ సేవా సంస్థ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ ప్రేమికులు, హరితోత్సవ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత లయన్ డాక్టరు గోళ్ల భూపతి రావుకు వారు చేసిన సేవలు గ్రీన్ భద్రాద్రి లయన్స్ క్లబ్, ఇతర సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని డా.గోళ్ల భూపతి రావుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం 2024ను ప్రముఖుల సమక్షంలో అధ్యక్షుడు ధైద వెంకన్న, సుజాత, డా.శాంతభాయి, డా.రేవతి, గౌరవ అధ్యక్షుడు ఖాన్‌ల ద్వారా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గోళ్ల భూపతి రావు మాట్లాడుతూ భవిష్యతులో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి అందరి సహకారం సలహాలు తీసుకుని ముందుకు వెళతామని, మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు తీర్పుని అమలుపరచాలి...!

- మాజీ ఎంపీ డా.మిడియం బాబూరావు
- ఓసీ 2 నిర్వాసితులకు న్యాయం చేయాలి : మచ్చా
- భూ నిర్వాసితుల పోరాటాన్ని ఉధృతం చేస్తాం : శ్రీనివాస్
- ఐటీడీఏ కార్యాలయం ఎదుట వ్యకాస ఆధ్వర్యంలో నిర్వాసితుల ప్రదర్శన, ధర్నా

భూమికి భూమి ఇచ్చి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

హైకోర్టు తీర్పు అమలు జరిపి కోయగూడెం ఓసీ 2 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, ఉద్యోగాలు ఇవ్వాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు ఐటీడీఏ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి ఐటీడీఏ పీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ చేపట్టిన కోయగూడెం ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిలో టేకులపల్లి మండలం లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండ, కొత్తతండ, జేత్యతండ గ్రామాలకు చెందిన గిరిజనుల సాగు భూములు 231.91 హెక్టార్లు కోల్పోయారని అన్నారు. పోడు సాగుచేస్తున్న గిరిజనులకు ఎటువంటి నష్టపరిహారం పునరావాసం చెల్లించకుండా పంటలను ధ్వంసం చేసి భూములు లాక్కున్నారని తెలిపారు.

అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యకాస ఆధ్వర్యంలో 2007 నుంచి గిరిజన నిర్వాసితులకు అండగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు న్యాయం చేయకపోవడం వల్ల గౌరవ హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. 2011లో గౌరవ హైకోర్టు భూములపై గిరిజన నిర్వాసితులకు హక్కు ఉందని వారికి న్యాయం చేయాలని తీర్పు ఇచ్చిందని అన్నారు. ఆనాటి తీర్పును కూడా పూర్తిగా అమలు చేయకుండా పునరావాసం జీవో నెంబర్ 68 ప్రకారం నామమాత్రంగా ఇచ్చారన్నారు. దీంతో 2016 లో సాగు భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు జీవో నెంబర్ 68, అటవీ హక్కుల చట్టం 2005 ప్రకారం భూమికి బదులు భూమి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో కేసు వేశారని 2024 సెప్టెంబర్ 27న నిర్వాసితులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు తీర్పు అమలు జరపాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు కోట్ల రూపాయల లాభాలు కోయగూడెం ఓసి వల్ల వచ్చాయి కానీ నిర్వాసితులకు మాత్రం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఐటీడీఏ పీవో నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, పూనెం స్వామి, దొడ్డ సంపత్ కుమార్, ఈసం చుక్కమ్మ, దొడ్డ గంగమ్మ, బోడ క్రిష్ణ, వస్రాం, బానోత్ లక్ష్మణ్, నాగేశ్వరరావు, కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ప్రజలు సంతోషంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లా ప్రజలు సురక్షిత, ఆనందమయ దీపావళి జరుపుకునే లాగా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లా అధికారులతో దీపావళి టపాసుల షాపులు ఏర్పాట్లు, చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న జరుపుకునే దీపావళి పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కొత్తగూడెం ప్రకాశం మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటుకు అనుమతుల మంజూరులో నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు. పండుగ రోజు స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చంద్రశేఖర్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కోల్పోతున్న గ్రామీణ ప్రజలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని

నవతెలంగాణ-సుజాతనగర్



మండలాన్ని కార్పొరేషన్ చేయడం వలన గ్రామీణ ప్రాంత ప్రజలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉన్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం స్థానిక చిత్తలపూడి సత్యం భవన్లో బచ్చలకూర శ్రీను అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్పొరేషన్ వలన కొద్దిమందికి మాత్రమే ప్రయోజనం ఉందని, మిగతా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని అన్నారు. సుజాతనగర్ ప్రాంతంలో ఎక్కువమంది వ్యవసాయ కూలీలు కార్మికులు ఉన్నారని అన్నారు. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేషన్ చెయ్యటం ఏమిటని ప్రశ్నించారు. మండలంలో 1000కి పైన కూలీలు ఉన్నారని, ఉపాధి హామీ వంటి పనులు లేకపోవడం వలన వీరి పరిస్థితి దారుణంగా ఉంటుందని అన్నారు. తక్షణమే కార్పొరేషన్ ప్రతిపాదనలను ఉపసంహరించుకోపోతే అఖిలపక్ష నాయకులను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు : ఏడీఏ

నవతెలంగాణ-బూర్గంపాడు

మునగ సాగు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఏడీఏ తాతారావు అన్నారు. సోమవారం మండలంలో మోరంపల్లి బంజర్, ఇరవెండి గ్రామలలో మునగ సాగు పద్ధతులకు సంబంధించిన అవగాహన సదస్సు, బ్రోచర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రధానంగా పంటల మార్పిడి పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమ లా రెడ్డి, ఏవో శంకర్, ఏపీవో విజయలక్ష్మి, ఏఈఓ వైష్ణవి, పంచాయతీ కార్యదర్శి భవాని, సొసైటీ డైరెక్టర్ బత్తుల కొండారెడ్డి, రైతులు తాళ్లూరి రాధాకృష్ణ, గాదె నర్సిరెడ్డి, కైపు సుబ్బరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆదిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టబద్ధ హక్కులు అమలు చేయాలి

- లేబర్ ఇన్స్పెక్టర్‌కి వినతి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ప్రాంతంలో వివిధ షాపింగ్ మాల్స్, వాణిజ్య వ్యాపారులు కార్ఖానాలలో పనిచేస్తున్న వర్కర్లకు పనివేళలో వారాంతపు సెలవు జీవో ప్రకారం కనీస వేతనం చట్టబద్ధ హక్కులు అమలు అమలు చేయాలని సామాజిక కార్యకర్త కరుణ బాబు తెలిపారు. సోమవారం మణుగూరు కార్మిక శాఖ అధికారి బి.నాగరాజుకి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- రక్తదానం చేసిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, భద్రాచలం సబ్ డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జాన్ మిల్టన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణదాతగా ఉండండి పిలుపునిచ్చారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో రక్త మందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బి.సుధాకర్ రావు, డాక్టర్ కిరణ్ కుమార్, సీఐ సంజీవరావు, ఎస్సై విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. కళాశాల నుంచి జూనియర్ అసిస్టెంట్ ఎల్ కిరణ్ కుమార్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు రవి ప్రసాద్ మొదలగువారు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా

- పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పశువులను అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆశ్వాపురం మండలానికి చెందిన మారాసు సాయి, అబ్దుల్ కలీమ్‌లు దుమ్ముగూడెం మండలంలో, చర్ల సంతలో, చత్తీస్గఢ్ సంతలో అమాయకపు రైతులు వద్ద తక్కువ ధరకు ఆవులు, ఎద్దులు, దూడలను కొనుగోలు చేసి, ఆ పశువులను అక్రమ రవాణా చేసేందుకు గోదావరి నది దాటించాలని గంగోలు గ్రామ శివారులో పశువులను ఉంచగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. అట్టి పశువులను స్వాధీన పరచుకుని, వ్యక్తులపై ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తికి గిట్టుబాటు ధర రూ.10 వేలు ప్రకటించాలి

- సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు చందర్ రావు

నవతెలంగాణ-జూలూరుపాడు

పత్తికి గిట్టుబాటు ధర రూ.10 వేలు ప్రకటించాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వల్లమల్ల చందర్ రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో పత్తి ప్రధాన పంటగా సాగు చేస్తున్నారని అన్నారు. కానీ ప్రతి యేటా గిట్టుబాటు ధర రాక రైతులు నష్ట పోతున్నారన్నారు. ఒక వైపు ప్రకృతి వైపరిత్యం, మరో వైపు ప్రభుత్వం నుండి మద్దతు ధర రాక మార్కెట్‌లో దళారుల చేతులో మోసపోవడంతో రైతులు నష్టపోతూ అప్పుల పాలు అవుతున్నారన్నారు. మార్కెట్‌లో పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు తేమ శాతం పేరుతో మార్కెట్ రేటుకు వెయ్యి నుండి పదిహేను వందల తేడాతో కొనుగోలు చేస్తూ రైతులను దండు కుంటున్నారని అన్నారు. రైతులకు ఏ విధంగా చూసినా గిట్టుబాటు కావడం లేదు కాబట్టే పత్తికి పది వేలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

ఐటీఐ విద్యార్థులు శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-మణుగూరు



ఐటీఐ విద్యార్థులు శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. సోమవారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐని సందర్శించిన ఆయన ఐటీఐలో శిక్షణకు సంబంధించిన కోర్సుల వివరాలు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన మెటీరియల్స్ గురించి తెలుసుకున్నారు. వివిధ ట్రేడ్లకు సంబంధించిన వివరాలను ఆయన ట్రేడ్ ఇన్స్ట్రక్టర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. అన్ని ప్రాక్టికల్స్ ల్యాబ్లను పర్యవేక్షించారు. ల్యాబ్‌లలో యంత్రాల పనితీరు గురించి, విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఇటీవల విద్యార్థులకు అందజేసిన బుక్స్ విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచిగా చదువుకొని ఒక మంచి టెక్నీషియన్‌గా ఎదగాలన్నారు. ఐటీఐల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామన్నారు. అనంతరం ఐటీఐ ప్రాంగణంలో ఉన్న గ్రంథాలయాన్ని, ఏటీసీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఏటీసీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జి.రవి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏటీవోలు ఎం.శీనివాసరావు, జీవీ కృష్ణారావు, ఏ.నరసయ్య, వేణుగోపాల్, సూపర్డెంట్ టీ ఎస్ జ్యోతిరాణి సిబ్బంది పాల్గొన్నారు.



బట్టా విజయ్ గాంధీ ఆధ్వర్యంలో పొంగులేటి జన్మదిన వేడుకలు

- మండల కేంద్రంలో 'మెగా రక్తదాన' శిబిరం

నవతెలంగాణ-బూర్గంపాడు



ఉమ్మడి ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ ప్రజానాయకుడు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలను పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూర్గంపాడు మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆసుపత్రి నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రి పొంగులేటి అభిమానులు రక్త దానాన్ని చేశారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అదేవిధంగా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కం టేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మందా నాగరాజు, బీసీ సంఘం నాయకులు దాసరి సాంబ, చిప్పా రాజు, భజన ప్రసాద్ కుమార్, మాజీ సర్పంచ్‌లు తాటి వీరాంజనేయులు, పాయం వెంకటేశ్వర్లు, తాటి సత్యానారాయణ, అరియం కృష్ణమూర్తి, బొర్రా శివయ్య శనగా కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులు మాస్టర్‌ని పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



అనారోగ్యంతో బాధపడుతున్న తొలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిప్పనసిద్దులు మాస్టర్‌ని సోమవారం సీపీఐ(ఎం) భద్రాచలం బృందం ఆయన నివాస గృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సుదీర్ఘ కాలం పాటు భద్రాచలం ఏజెన్సీలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన సిద్ధులు మాస్టారు ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని అన్నారు. సిద్ధులు మాస్టారు పదవీ విరమణ పొందిన అనంతరం కూడా ఓపక్క విద్యారంగానికి పరోక్షంగా సేవలు అందిస్తూనే ప్రజాసేవ కార్యక్రమాలలో పాల్గొంటున్నారని గుర్తు చేశారు. ప్రమాదవశాత్తు పడి విశ్రాంతి తీసుకుంటున్న సిద్ధులు మాస్టర్ వీలైన త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని సిద్ధులు మాస్టారు అనుభవాలు నేటితరం యువతకి, విద్యార్థులకు తెలియజేస్తూ వారిని సక్రమార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని మచ్చ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, ఎర్రం శెట్టి వెంకట రామారావు, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు భూపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.కృష్ణ

నవతెలంగాణ-మణుగూరు



వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ పరిధిలోని హై స్కూల్, ఆపై స్థాయిలో పనిచేస్తున్న టీచర్లు అందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం యూటీఎఫ్ మణుగూరు మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నమోదు చేసుకోవడానికి నవంబర్ ఆరవ తేదీ ఆఖరి తేదీ అని, గడువులోగానే అందరూ టీచర్స్ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాయ్స్ గురుకులంలో టీచర్లకు ఎమ్మెల్సీ నమోదు పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయనటీచర్లను కోరారు. పినపాక మండల ప్రధాన కార్యదర్శి బాలసాని రాంబాబు, పూర్వ ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, ఉపాధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, సభ్యులు బి.ఐలయ్య, పాఠశాల ప్రిన్సిపల్ టీచర్స్ వెంకన్న, భీముడు పాల్గొన్నారు.

వైద్యశాలలో రికార్డులను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని సులానగర్ ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో రికార్డులను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందికి తగు సూచనలు చేశారు. సరిపడా వ్యాక్సిన్ నిల్వలు ఉన్నాయా లేవా అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించి, వివిఎం తనిఖీ చేశారు. మండలంలో నమోదవుతున్న జ్వర పీడితుల వివరాలు అడిగి తెలుసుకొని, ఇబ్బంది ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని సిబ్బంది కొరతను డీఐఓ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించవలసిందిగా వైద్యాధికారి డాక్టర్ దినేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారిణి విజయ శ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్వైజర్లు గుజ్జ విజయ, కౌసల్య సింగ్, ధర్మపురి రవికుమార్, నాగలక్ష్మి, కిరణ్, కుమారి, హారిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పుట్టినరోజు వేడుకలు





- విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదినం వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంనకు ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ నందు విద్యార్థినీ, విద్యార్థులకు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ గంట్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ... విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని కోరారు. గత సంవత్సరంలో కూడా పొంగులేటి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు సమయంలో పెన్నులు, ప్యాడ్‌లు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగశ్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, సాయిన్ని వెంకటేశ్వర్లు, గుడిపూడి కోటేశ్వరరావు, కుడితిపూడి కోటేశ్వరరావు, జి.వి.గాండ్ సురేష్, త్రిమూర్తులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక కాంగ్రెస్ నాయకులు మండలంలోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మనాన్న వృద్ధాశ్రమంలోనూ, శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషన్ చారిటీట్రస్ట్ నందు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నాయకులు కరివేద వెంకటేశ్వరరావు, శంకర్ సాయి, రామారావు, ఎస్.కె బాజీ, మరి సత్యనారాయణ, పెంటాల శీను, ప్రశాంత్, ఆర్.కె.రాము, హైమద్, శ్రీనివాస్, సుబ్రాజు సూర సుధాకర్, వెంకట్, పెంట్యాల వెంకటేష్, లోకేష్, వెంకన్న, శీనన్న అభిమానులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని చిన్న గుబ్బలమంగి వాగు శివారులోని గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జాలర్లు గుర్తించారు. సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్ళిన సమయంలో గోదావరిలోని జిన్నే చెట్ల మధ్య చిక్కుకుపోయిన మృతదేహాన్ని వారు గుర్తించారు. విషయాన్ని జాలర్లు పరిసరాల ప్రాంతాల రైతులకు తెలిపారు. సుమారు 40 ఏండ్లు వయసు కలిగిన అట్టి వ్యక్తి రెడ్ షర్టు తో పాటు గ్రీన్ ట్రాక్ కలిగి ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. కాగా మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉంది.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

ఎస్ఐకి తమ్మల వార్నింగ్

నీ వ్యవహారం మొత్తం తెలుసు



సాయికిషోర్‌పై మంత్రి ఆగ్రహం

నవతెలంగాణ- దమ్మపేట

దమ్మపేట ఎస్ఐ బి.సాయికిషోర్‌రెడ్డి వ్యవహార శైలిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మలేషియా పర్యటన ముగించుకొని అక్కడ జరిగిన విషయాలను గండుగులపల్లి గ్రామంలో తన నివాస వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అనంతరం కొంతమంది భూ బాధితులు మంత్రి తుమ్మలను కలిశారు. తమ భూముల విషయంలో అన్యాయం చేసే విధంగా అక్రమ కేసులు పెట్టడమే, కాకుండా తమ భూమి తమకి చెందకుండా ఉండే విధంగా రెవెన్యూ శాఖ చేయాల్సినటువంటి పనులు శైతం ఒంటెద్దిపోకడంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తూ రైతులమనే కనీస మర్యాద ఇవ్వకుండా ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు తుమ్మల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న అశ్వారావుపేట సిఐ, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్ రెడ్డిలను పిలిపించి బాధితుల పక్షాన నిలబడాలని, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నీవు వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న పనులు, నిర్వహిస్తున్న కార్యకలాపాలు మొత్తం తనకు తెలుసనని అన్నారు. రైతుల విషయంలో అనవసరంగా జోక్యం చేసుకొని వారిని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, తాను ఒక్కసారి మాత్రమే హెచ్చరిస్తానని మరొక్కమారు ఇటువంటి చర్యలు పునరావృతం అయితే నీకు శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని తెలిపారు. దుందుడుకు స్వభావం మార్చుకొని ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలని గతంలో దమ్మపేట మండలంలో ఎన్నడూ లేని కొత్త సాంప్రదాయాలను పరిచయం చేయొద్దని ఘాటుగా హెచ్చరించారు. దీంతో సీఐ మాట్లాడుతూ తాను దమ్మపేట మండలంపై ఇకనుండి ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్ఐ తెలిసి తెలియక ఏమైనా పొరపాట్లు చేస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి తప్పులను సరిచేస్తానని తుమ్మలకు తెలియజేయడంతో మంత్రి తుమ్మల శాంతించారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి



- యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.కృష్ణ

నవతెలంగాణ-మణుగూరు

వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ పరిధిలోని హైస్కూల్ ఆపై స్థాయిలో పనిచేస్తున్న టీచర్స్ అందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నమోదు చేసుకోవడానికి నవంబర్ 6వ తేదీ ఆఖరి తేదీ అని, గడువులోగానే అందరూ టీచర్స్ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాయ్స్ గురుకులంలో టీచర్లకు ఎమ్మెల్సీ నమోదు పత్రాలను పంపిణీ చేశారు. టీచర్ల సమస్యల మీద నిరంతరం పోరాడుతున్న ప్రజా గొంతుక ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన టీచర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల ప్రధాన కార్యదర్శి బాలసాని రాంబాబు, పూర్వ ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, మన ఊరు మనలో ఉపాధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, సభ్యులు బి ఐలయ్య, పాఠశాల ప్రిన్సిపల్ టీచర్స్ వెంకన్న, భీముడు పాల్గొన్నారు.

రైతుకు స్థిరమైన ఆదాయం కల్పించడమే ధ్యేయం

పామాయిల్ సాగుపై మరింత అధ్యయనం

- మలేసియాలో సాగును పరిశీలన
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ- దమ్మపేట

రైతుకు స్థిరమైన ఆదాయం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గండుగులపల్లిలో తుమ్మల విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజుల మలేషియా పర్యటన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ పంటకు టన్నుకు రూ.20వేల గరిష్ట ధర కల్పనే లక్ష్యంగా కృషిచేస్తానని, ఈ విషయంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్నాటక, కేరళలో పామాయిల్ అధికంగా సాగు అవుతుందని, ఆయా రాష్ట్రాల ప్రతినిధులను కలుపుకొని కేంద్రాన్ని మినిమం గ్యారెంటీ ప్రైజ్ (ఎంజీపీ) కోసం కోరతామన్నారు. రైతుకు స్థిరమైన ఆదాయ కల్పనే లక్ష్యమని అన్నారు. ఇందుకోసం పామాయిల్ సాగుపై మరింత అధ్యయనం చేసేందుకు గాను మలేషియా వెళ్లడం జరిగిందని తెలిపారు. మలేషియాలో పామాయిల్ సాగు సాంకేతిక పద్ధతులు, ప్రాసెసింగ్ ప్లాంట్స్, రిఫైనరీ ప్లాంట్స్ పరిశీలించామని ఈ విషయాలపై మలేషియా పామాయిల్, వ్యవసాయ శాఖ మంత్రులను కలిసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో తెలంగాణ–మలేషియా మధ్య వ్యాపార వాణిజ్య అవకాశాలపై చర్చించామని పలు అంశాలపై వారు సుముఖత వ్యక్తం చేశారని అన్నారు. మలేషియా ప్రతినిధులు రాష్ట్రంలో సీడ్ గార్డెన్‌లు, ఆయిల్ రిఫైనరీ ఇక్కడ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశామని అన్నారు. ముఖ్యంగా పామాయిల్‌లో వస్తున్న తెగుళ్ళ నివారణ, తక్కువ ఎత్తు కురచ ఆకు ఉండి ఎక్కువ దిగుమతి ఇచ్చే పామాయిల్ మొక్కల కోసం మలేషియాలో వెతికామని, గెలలు కోసే విధానాలపై పరిశీలించినట్లు తెలిపారు. అయితే అక్కడ కూడా మొక్కలు దాదాపుగా ఇట్లానే ఉన్నాయని అన్నారు. గెలలు కోసే పరికరం ఇక్కడ మనం అల్యూమినియంతో చేసిన వాటిని



వాడుతున్నామని అవి బరువుగా ఉండటంతో పాటు ఎత్తులో కోసే టప్పుడు విద్యుత్ ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా అక్కడ ఫైబర్ కటింగ్ మిషన్‌లు వాడుతున్నారని, కరెంట్ వైర్‌కు తగిలిన ప్రమాదం జరగదని వాటిని మన రాష్ట్రానికి తీసుకురానున్నట్లు తెలిపారు. మలేషియాకు మనకు తేడా అక్కడ ప్రతీ రోజు సాయంత్రం వర్షం పడుతుందని అక్కడ సాగు అవుతున్న పామాయిల్ మొత్తం కొండలపై గుంటలపై ఎత్తు పల్లాల మధ్య ఉందని అన్నారు. మనకు నీటి కోసం వ్యవసాయ బోర్లు ఇక్కడ వినియోగించాలని అన్నారు. మొక్కజొన్న పత్తి, వేరుశనగ, మిర్చి పంటలకే కాకుండా ముఖ్యంగా మునగ వేసుకోవచ్చునని, దీని వల్ల కూడా నేడు రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు కల్పిస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మట్టా దయానంద్, పామాయిల్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్, డైరెక్టర్ కొయ్యల అచ్యుతరావు, రావు గంగాధర్‌రావు, కెవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, ఎర్ర వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై

ఉక్కుపాదం మోపాలి

- బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

నవతెలంగాణ-బూర్గంపాడు

గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు బూర్గంపాడు పోలీస్ స్టేషన్ ను సోమవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. వర్టికల్స్ వారీగా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆయన ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు నిత్యం పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిం చాలని ఆయన పేర్కొ న్నారు. విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురా వాలని ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. పెండింగ్లో ఉన్న కేసుల్లో సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసుకు న్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్, సీఐ వినయ్ కుమార్, ఎస్సైలు రాజేష్, నాగభిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనులకు

కనీస సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసఫ్

నవతెలంగాణ-ములకలపల్లి

మండలంలోని పాత శివాలయం శివారు కొమరంభీమ్ గ్రామంలో సుమారు 50 కుటుంబాల ఆదివాసీల గిరిజనులు గత 20 సంవత్సరాలు నుండి అక్కడే నివాసాలు ఏర్పరచుకొని ఉంటున్నారు. వారికి కనీస అవసరాలు అయినా విద్యుత్, ఇంటి నెంబరు, మంచినీటి సౌకర్యం లేక వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఒక గిరిజన మహిళ విషసర్పం కరిచి చనిపోయింది. మంచినీరు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకుంటున్నారు. వీరికి ఈ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడి అన్నీ ఉన్నాయి. ఎన్నికల్లో వీరి ఓట్లను వినియోగంటున్న నాయకులు కనీస సౌకర్యాల గురించి పట్టించుకోవడం చాలా బాధాకరమని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసఫ్ ఆధ్వర్యంలో ఈ వినతి పత్రం జాయింట్ కలెక్టర్‌కి ఇచ్చారు.

హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-దమ్మపేట

సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం కార్యదర్శి పందూరి వీరబాబు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి రాము, నాగరాజు, అనిల్ కుమార్, నాగమణి, ముక్తేశ్వరి పాల్గొన్నారు.



వెదురు సాగుతో అనేక ప్రయోజనాలు

- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట

వెదురు, మునగ సాగుతో రైతులకు ఆదాయ పరంగానే గాక సామాజిక, వాతావరణ ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం వ్యవసాయ శాఖ నారాయణపురం క్లస్టర్ పరిధిలో గ్రామాల రైతులకు స్థానిక రైతు వేదికలో మునగ, వెదురు సాగు, ప్రభుత్వ రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మునగ సాగుతో స్వల్పకాలంలో పంట దిగుబడి, అంతర పంటగా సాగు, మునగ కూరలతో ఆరోగ్యం ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వెదురు సాగుతో పర్యావరణం సమతుల్యత, వెదురుతో గృహ అలంకరణలు, గృహ సామగ్రి, వ్యాపారం పరంగా అదనపు ఆదాయం లభ్యం అవుతుందని తెలిపారు. వీటికి అయ్యే సాగు వ్యయం మొత్తం ప్రభుత్వ రాయితీగా ఉపాధి పథకం ద్వారా పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రామచంద్రయ్య, వ్యవసాయాధికారి శివప్రసాద్, ఏఈవో షాకీరా భానులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-పినపాక

హెచ్ఐవి పైన ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ గవర్నమెంట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ది గాడ్ తెరిసా మహిళా మండలి సంస్థ ఆధ్వర్యంలో పినపాక మండలం గోవిందపురం గ్రామంలో హెచ్ఐవి మీద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి వచ్చే మార్గాలు, నివారణ మార్గాలను వివరించారు. హెచ్ఐవి అనేది నాలుగు మార్గాల ద్వారా వస్తుందని, హెచ్ఐవి సోకిన వాళ్ళతో కండోమ్ లేకుండా సెక్స్ చేయటం, హెచ్ఐవి తో ఉన్న వ్యక్తి వాడిన సూదులు వాడడం ద్వారా, హెచ్ఐవి ఉన్న తల్లి నుంచి బిడ్డకి, హెచ్ఐవి వచ్చిన వాళ్ళ రక్తం ఎక్కించుకోవడం ద్వారా వస్తుందని వివరించారు. హెచ్ఐవీ ఉన్న వాళ్ల మీద వివక్ష చూపించకూడదని, అలా చూపిస్తే 2017 యాక్ట్ ప్రకారం చట్టరీత్యాలు తీసుకుంటారన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1097 కి ఫోన్ చేసి సలహాలు సూచనలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక హెల్త్ వర్కర్ కల్పన, కుమారి, ప్రభావతి ఆశా వర్కర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.



అద్భుత జ్ఞానాన్ని అందిస్తున్న ప్రాథమిక పాఠశాల అంబేద్కర్ కాలనీ

- కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్ బెక్కంటి శ్రీనివాసరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రాథమిక స్థాయిలో పిల్లల్లోని అంతర్గత సామర్థ్యాలను వెలికి తీసి అద్భుత జ్ఞానాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంబేద్కర్ కాలనీ ఉపాధ్యాయుల అందిస్తున్నారని వారి కృషిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్, నోడల్ ఆఫీసర్ బెక్కంటి శ్రీనివాసరావు అభినందించారు. పాఠశాల సందర్శనలో భాగంగా సోమవారం కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌తో కలిసి ఆకస్మికంగా పాఠశాల సందర్శించారు. ఈ సందర్భంగా 2వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితం అద్భుతంగా వారి అభ్యసనా స్థాయికి అనుగుణంగా మాట్లాడటం, రాయటం, చదవడం తనకెంతో సంతృప్తి ఇచ్చిందని నిరంతరం కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ జి దుర్గారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే చిట్టిబాబు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు పంటలకు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ములకలపల్లి

రైతు పంటలకు మద్దతు ధర నిర్ణయించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రగశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ అన్నారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల కమిటీ సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆఫీసులో కారం వెంకటేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ పంటల అన్నింటికి స్వామి నాథన్ కమీషనర్ సిఫార్సు ప్రకారం కనీస మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని, వ్యవసాయ మార్కెట్లలో దళారుల అక్రమ దోపిడీ అరికట్టాలని తేమ పేరుతో పంట ధరలు తగ్గించ రాదని అన్నారు. నవంబర్ 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి వేలాదిగా రైతులు కదిలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం పాల్వంచ డివిజన్ కార్యదర్శి నకిరేకంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

11 నెలల పాలనలో ఒక్క హామీ అమలు చేయలేదు

- ప్రజల గొంతుకై ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై కావాలనే కక్షసాధింపు చర్యలు
- నీచ రాజకీయాలు మానుకోండి
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే గుర్తుంచుకోవాలి
- కోట్లాడి సాధించుకున్న తెలంగాణలో అరాచకపాలన చూస్తుంటే బాధగా ఉంది
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-దమ్మపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి 11నెలలు అవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ప్రజల గొంతుకై ప్రశ్నిస్తున్న కెటిఆర్‌పై కావాలనే కక్షసాధిపుచర్యలకు పాల్పడుతున్నారని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇచార్జి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం దమ్మపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో మెచ్చా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో డైవర్ట్ చెయ్యడానికి మొన్నటి దాకా మూసీ సుందరీకరణ అంటూ అక్కడ కొని సంవత్సరాలుగా నివసిస్తున్న వారిని నిద్ర లేకుండా చేస్తూ గడిపారని అన్నారు. నేడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కావాలనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తూ కార్యకర్తలను కాలితో తన్నుతున్నారని వాపోయారు. ఈ నీచ రాజకీయాలు మానుకోకపోతే వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అప్పుడు వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుందని అన్నారు. ఎన్ని చేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరుపున ఉంటుందని, తెలంగాణ ప్రజలకు అండ బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొట్లాడి సాధించిన రాష్ట్రం నేడు ఇలాంటి దుస్థితిలో చూస్తుంటే చాలా బాధగా ఉందని గడచిన 11నెలల్లో విద్యార్థుల నుంచి పోలీసుల దాకా అందరూ రొడ్డెక్కారని ఏ ఒక్కరూ ప్రశాంతంగా లేరని విచిత్రం, ఏంటంటే పోలీసులే పోలీసులను అరెస్టు చేసే దుస్థితికి రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు తెచ్చారని అన్నారు. పోలీసు వారికి ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చమని అడిగితే 39 మంది బెటాలియన్ వారి సస్పెండ్ చేసిందే కాక 10 మందిని ఉద్యోగం నుంచి తొలగించారని వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున డిమండ్ చేశారు. ఇదే పాలన రాష్ట్రంలో కొనసాగితే మళ్ళీ నక్సలైట్లు పుట్టుకొస్తారనీ అసలు రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రా? లేక కాంగ్రెస్ పార్టీ వారికి మాత్రమే ముఖ్యమంత్రా?అర్థం కావడం లేదని మండిపడ్డారు. రిబ్బన్ కట్టింగ్ అంటే ఎగేసుకొని వచ్చే వారు ప్రజలకు ఇబ్బంది ఉంది అంటే పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. మొన్న ములకలపల్లి మండలం తాళ్ళపాయి పంచాయతీ వారికి 6నెలల నుంచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందినీ మంత్రికి చెప్పినా



పట్టించుకోలేదు... స్థానిక ఎమ్మెల్యేకి చెప్పిన పట్టించుకోవట్లేదని రోడ్డుపై నిరసన తెలిపితే అధికారంలో ఉన్న వారు వారి బాధను అర్థం చేసుకొని సమస్యను పరిష్కరించాల్సింది పోయి ఆదివాసీలు అని సైతం చూడకుండా ప్రశ్నించారని వారిపై కేసులు పెట్టడం దిక్కుమాలిన పనని ఈ తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే హక్కు లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే భయపడే పరిస్థితి రాష్ట్రం మొత్తం కనిపిస్తుందని.బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటిని పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమండ్ చేసారు. ఇకనైనా వంకర బుద్ధి మానుకొని ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీను, మండల ఉపాధ్యక్షులు గాజూబోయిన ఏసు బాబు, కౌలూరి నాగయ్య, పసుమర్తి విశ్వేరరావు, రూపా రాంబాబు, రాజు తదితరులు ఉన్నారు.

ఆశ్రమ విద్యార్థులకు శుభ్రమైన నీరు అందించాలి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకులం ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు తాగే మంచినీటి పరంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేనిచో పచ్చ కామెర్లు, డెంగూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత హెచ్ఎంలు వార్డెన్లు ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుండి వచ్చిన ఐటీడీఏ యూనిట్ అధికారుల సమక్షంలో ఆయన అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఏవో రాంబాబు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఎస్.ఓ భాస్కరన్, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, డీటీఆర్ఓఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ పవర్ ఏఈ మునీర్ పాష, హెచ్ఈఓ లింగ నాయక్, పివిటిజి అధికారి మనిధర్, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాసరావు, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ అనసూయ, సిబ్బంది ముదిరాజ్, భద్రమ్మ, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సోమవారం వేపలగడ్డ, సుజాతనగర్‌లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్‌లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహర మెనూను పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని హాస్టల్ వార్డెన్‌కు తెలిపారు. సౌచాలయాలు శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పినపాక నియోజకవర్గం బి– బ్లాక్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బర్ల నాగమణి ఆధ్వర్యంలో సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, కాంగ్రెస్ నాయకులు ఇంగువ రమేష్, కైపు శ్రీనివాసరెడ్డి పోలుకొండ ప్రభాకర్, చిప్పారాజు, యువజన కాంగ్రెస్ నాయకులు రహీంఖాన్, రాపాక నరేంద్ర, కేసుపాక మహేష్, బర్ల సాయి, కారం హనుమంతు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో పొంగులేటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకను ఓ అభిమాని నెల్లూరు బీచ్‌లో చేసుకోవడం ఎంతో ఆశ్చర్యకరంగా మారింది. మండల యువజన నాయకులు వేముల నరేష్ బాబు నెల్లూరు సొంత పనులు నిమ్మిత్తం వెళ్ళగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీద అభిమానంతో నెల్లూరు బీచ్ లో కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేముల నారాయణ, పొంగిలేటి అభిమానులు పాల్గొన్నారు.

పినపాక : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సీతంపేట, చింతల బయ్యారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ లో పొంగులేటి 59వ జన్మదినం సందర్భంగా 59 కిలోల భారీ కేకును కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

భద్రాచలంలో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. అనంతరం సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బాలల అనాథాశ్రమంలో మిఠాయిలు పంచి చిన్నారులకు పండ్లు పాలు అందించారు. శ్రీనివాస్ రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యేలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన జన్మదిన సందర్భంగా భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు, పార్లమెంటు సభ్యులు పోరిక బలరామ నాయక్ నేతృత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ప్రసాదం అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భోగాల శ్రీనివాస్ రెడ్డి, భీమవరపు వెంకటరెడ్డి, ఎండి నవాబ్, దొడ్డిపట్ల కోటేష్, సరళ నరేష్, కొనిశెట్టి కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- దమ్మపేట

దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సి ఆధ్వర్యంలో మందలపల్లి ప్రసాద్ గణపతి ఫెర్టిలేజర్ షాప్ వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అశ్వారావుపేట టౌన్‌లో ఉన్న అమ్మ అనాథ శరణాలయంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని వారి సొంత ఖర్చులతో నిర్వహించారు.

నవతెలంగాణ
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
9
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

బీజేపీ మతోన్మాదాన్ని అడ్డుకునేది కమ్యూనిస్టులే

- తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం : తమ్మినేని వీరభద్రం
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా చెరుకుమల్లి కుటుంబరావు ఎన్నిక

నవతెలంగాణ-కొణిజర్ల

మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆగడాలను అడ్డుకునేది కమ్యూనిస్టులు మాత్రమే అని, అలాంటి కమ్యూనిస్టు పార్టీలు లేకపోతే ఈ దేశానికి భవిష్యత్ ఉండదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నమునగాలలో ఇల్లందుల వెంకటేశ్వర్లునగర్, ప్రతాపనేని లక్ష్మయ్య, లింగాల భూషణం ప్రాంగణంలో పార్టీ మండల మహాసభ మండల కమిటీ సభ్యులు దొడ్డపనేని క్రిష్టార్జున్‌రావు, చింతపల్లి ప్రసాద్, తాతా పద్మ, బోయినపల్లి శ్రీనివాస్‌రావుల అధ్యక్షతన సోమవారం జరిగింది. తొలుత గ్రామంలో ఎర్రజెండాలతో నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో వివిధ సెంటర్‌లలో ఉన్న పార్టీ అమరుల స్థూపాల వద్ద నివాళ్లర్పించారు. మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకుడు కొప్పుల క్రిష్ణయ్య ఎగరవేశారు. అనంతరం జరిగిన సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతే కారణమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కొన్ని మంచి పథకాలు అమలు చేసినప్పటికీ అహంకారంతోనే అధికారం కోల్పోయిందనారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కి పట్టిన గతే పడుతుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. హైడ్రా, మూసినది ప్రక్షాళన, దామగుండం లాంటి రాడార్ స్టేషన్ నిర్మాణాలపై అఖిల పక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చిన్నచిన్నగా ప్రజావ్యతిరేకత మొదలైందని, ప్రజలంతా ఎర్రజెండాలవైపు చూసే రోజులు దెగ్గరలోనే ఉన్నాయని, ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించి సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చెరుకుమల్లి కుటుంబరావును ఎన్నుకున్నారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, మెరుగు సత్యనారాయణ, కొండెబోయిన నాగేశ్వరరావు, చింతల రమేష్, నరేందర్, దొంతెబోయిన నాగేశ్వరరావు, యాసా నరేష్, హరిచంద్, కట్టా రాంబాబు, దారాగాని రాములు, మాధవరెడ్డి, రోషన్ బేగ్, అఫ్జల్, గుడ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


చెరుకుమల్లి కుటుంబరావు

టేబుల్ టెన్నిస్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- ఖమ్మం



ఈనెల 24, 25, 26న హైదరాబాద్‌లోని డిఆర్ఎస్ పాఠశాలలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఖమ్మం జిల్లా తరపున సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయకేతనాన్ని ఎగరవేశారని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి. నాగేంద్ర కుమార్ తెలిపారు. ఇంతటి ప్రతిభను కనపరిచిన క్రీడాకారులు తమ సర్వజ్ఞ విద్యార్థులు అవ్వడం ఎంతో గర్వకారణమని అన్నారు. అండర్ 14 డబుల్స్‌లో ఆర్.చార్విక్, ఎస్కే. ఫజ్జిల్ పసిడి పతకం సాధించారని, అదే విధంగా సింగిల్స్ అండర్ 14లో ఎస్కే ఫజ్జిల్ కాంస్య పతకంను కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు, కాంస్య పతకం సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా చదువుతో పాటు విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ వాళ్ల మనో ధైర్యముతో పాటు ఏకాగ్రతకు, క్రమశిక్షణకు ఆటలు ఎంతో ముఖ్యమని అన్నారు. పాఠశాల డైరెక్టర్ కే.నీలిమ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు సర్వజ్ఞ ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు.



కమ్యూనిస్టులు విద్యార్థిలా ఉండాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్
- నవతెలంగాణ శాఖ కార్యదర్శిగా లింగా వీరారెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కమ్యూనిస్టులు సమాజంలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, నిత్య విద్యార్థిలా ఉండాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు.మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద గల నవ తెలంగాణ ఎడిషన్ కార్యాలయంలో మంగళవారం ఏచూరి ప్రాంగణంలో నవతెలంగాణ శాఖ ఐదవ మహాసభ భూక్య కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన యర్రా శ్రీకాంత్ మాట్లాడారు.బాధ్యత గల వృత్తిలో ఉన్నవారు నిరంతరం అధ్యయనం చేస్తూ,ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు.సమాజాన్ని చైతన్యం చేయడంలో పత్రిక ది ప్రధాన పాత్ర అన్నారు. నవ తెలంగాణ పత్రిక ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని తెలిపారు.అనంతరం శాఖ కార్యదర్శిగా లింగా వీరారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రీజినల్ మేనేజర్ ఎస్‌డి.జావిద్ సభ్యులు కోటి శివారెడ్డి, సిహెచ్ నారాయణ, కనకం సైదులు, ఇరుగు వెంకటేశ్వర్లు, గుమ్మడి నరసయ్య ప్రసాద్, సోమయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేసి అండగా నిలబడదాం

- ఎస్పీ రోహిత్ రాజు


నవతెలంగాణ-కొత్తగూడెం



రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడదామని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. స్థానిక ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడానికి పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరం ద్వారా 130 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే రక్తదానం చేసిన పోలీసు అధికారులు సిబ్బంది, స్థానికులకు పండ్లను, బిస్కెట్ ప్యాకెట్లను పంచారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం 3టౌన్ సీఐ శివప్రసాద్, జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు, ఏఎస్ఐలు, రెడ్‌క్రాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సోషియో ఎకనామిక్ సర్వేకి సిద్ధం

నవతెలంగాణ-అశ్వారావుపేట



నవంబర్ 4 నుండి ప్రారంభం అయ్యే సోషియో ఎకనామిక్ సర్వేకి సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఎన్యూమరేటర్‌లు నియమితులు అయ్యే కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సోషియో ఎకనామిక్ సర్వే సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. 150 గృహాలు ఒక బ్లాక్‌గా నిర్ణయించి ఒక్కో ఎన్యూమరేటర్ ఒక్క రోజు పది గృహాలు చొప్పున 15 రోజులు సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. 2011 జనాభా గణన నమూనా ప్రకారం సర్వే నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. తాహశీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఈఓ, డీటీలు సూపర్వైజర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సోయం ప్రసాద్, అశ్వారావుపేట కార్యదర్శి కోటమర్తి శ్రీరామమూర్తిలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి జన్మదినం...రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు మేరెడ్డి జనార్ధన్ రెడ్డి, ముప్పాని సోమిరెడ్డి, అధ్యక్షులు వజ్రాల జమలారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నెం జవహర్ రెడ్డి, ఎన్.వెంకట్ సుబ్బారెడ్డి, సంఘం అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కాసాని శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, కటుకూరి గుణాకర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రామిరెడ్డి నరేందర్ రెడ్డి, సంఘం కార్యవర్గ సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన, మాతా శిశు ఆసుపత్రుల్లో పడకేసిన వైద్యం

ముగ్గురు మంత్రులు ఉన్నా హాస్పిటల్ అభివృద్ధి శూన్యం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె.రమేష్
- హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం


మాట్లాడుతున్న ఏ.జే.రమేష్


దీక్షను విరమింప చేస్తున్న అసుపత్రి సూపరింటెండెంట్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన హాస్పిటల్, రామవరంలో ఉన్న మాతా శిశు హాస్పిటల్స్ సమస్యలతో సతమతమవుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె.రమేష్ అన్నారు. కొత్తగూడెం రామవరంలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ సమస్యలు పరిష్కరించాలని పార్టీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. దీక్షను ప్రారంభిస్తూ ఏజె.రమేష్ మాట్లాడుతూ వైద్యోనారాయణ అంటూ పేద ప్రజలు ప్రభుత్వాసుపత్రికి వస్తే సౌకర్యాలు, డాక్టర్లు లేక వెనుతిరిగి పొమ్మంటూ వెక్కిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత వలన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేక పేదలకు వైద్యం అందని ద్రాక్షల తయారైందని ఇటీవల కాలంలో పార్టీ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో సర్వే నిర్వహించగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కి సీపీఐ(ఎం) బృందం వినతి పత్రం అందజేశామని, అయినప్పటికీ స్పందించకపోవడంతో హాస్పిటల్ ఎదుట ధర్నా కూడా చేసాం, అయినా ప్రభుత్వ స్పందన శూన్యం అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కి రోజుకి 600 మంది వివిధ అనారోగ్య కారణాలతో హాస్పిటల్‌కి వైద్యం కోసం వస్తున్నారన్నారు. వారికి కనీసం బీపీ, షుగర్ టాబ్లెట్లు నెలకు సరిపడా సప్లై చేయడానికి కూడా మందులు అందుబాటులో లేవనీ, హాస్పిటల్ మొత్తానికి మూడు స్ట్రక్చర్లు మాత్రమే ఉన్నాయనీ, అన్ని రకాల మందులు ప్రభుత్వం నుండి సప్లై లేక ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుక్కోమని డాక్టర్లు సలహాలిస్తున్నారని మండి పడ్డారు. వెంటిలేటర్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదని. ప్రధానంగా హాస్పిటల్‌లో డాక్టర్లు కొరత తీవ్రంగా వేధిస్తుందని డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వలన ట్యాంక్ నిండిపోయి మురికి నీరు బయటకు వచ్చి హాస్పటల్ మూసీ నదిని తలపించేలా తయారైందని ఎద్దేవచేశారు. దీనివలన వైద్యం కోసం హాస్పిటల్‌కి వస్తే కొత్త రోగాలతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. స్కానింగ్ సెంటర్లో డాక్టర్ లేకపోవడం వలన రోగులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఆశ్రయించి వేల రూపాయలు దారబోస్తున్నారన్నారు. మాతా శిశు హాస్పిటల్ గత ప్రభుత్వం హంగు ఆర్భాటాలతో కార్పొరేట్ స్థాయిలో బిల్డింగ్ నిర్మించిందని. " మేడిపండు చూడు మేలిమై ఉండు... పొట్ట విప్పి చూడు పురుగులుండు" అన్న చందంగా ఈ హాస్పిటల్ పరిస్థితి ఉందనీ విమర్శించారు. రంగు రంగుల భవనం తప్ప హాస్పిటల్‌లో కనీస సౌకర్యాలు లేవనీ దుయ్యబట్టారు. హాస్పిటల్ ప్రారంభంలో నెలకు 400 వందలు డెలివరీలు అయ్యాయి. ప్రస్తుతం డాక్టర్ల కొరత వలన 100 డెలివరీలు మాత్రమే అవుతున్నాయని, డెలివరీ కోసం ప్రసవ వేదనతో హాస్పిటల్‌కి వచ్చిన గర్భిణీలను నిర్దాక్షిణ్యంగా ఖమ్మం, వరంగల్ హాస్పిటల్‌కి వెళ్ళమని బలవంతంగా వెళ్లగొడుతున్నారని ఆరోపించారు. హాస్పిటల్ మొత్తానికి ఒకే బీపీ మిషన్ ఉందనీ అది కూడా పనిచేయట్లేదని కరెంటు పోతే ఆపరేషన్ నిలిపివేస్తున్న పరిస్థితి ఇది మాతా శిశు హాస్పిటల్ దుస్థితి అని అన్నారు.



ట్రాన్స్‌ఫర్ పేరుతో ఇక్కడ నుండి డాక్టర్లు వేరే ప్రాంతానికి వెళ్లారు కానీ, వారి స్థానంలో తిరిగి డాక్టర్లను నియమించక పోవడం వలన డాక్టర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, దీని వలన సరైన వైద్యం పేదలకు అందట్లేదని మండపడ్డారు. ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తే తప్ప ఈ హాస్పిటల్స్ బాగుపడే పరిస్థితి లేదనీ ఈ నేపథ్యంలో జిల్లా మంత్రులు జోక్యం చేసుకొని హాస్పిటల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తాగేందుకు నీరుకరువు : లిక్కిబాలరాజు

ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం రోగులు తాగేందుకు మంచినీరు కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉందని సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు. ఆసుపత్రిలో ఉన్న రోగులు, వారితో వచ్చిన వారికి తాగడానికి మంచినీళ్లు కూడా లేని దుస్థితి దాపురించిందన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ జిల్లా అయిన మన జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించడం కోసం సర్వజన హాస్పిటల్ మాతా శిశు హాస్పిటల్ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

సమస్యలు ప్రభుత్వ దృష్టికి : ఆసుపత్రి సూపరింటెండెంట్

సీపీఐ(ఎం) ఆ్వర్యంలో గుర్తించిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెలతామని కొత్తగూడెం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధామోహన్ తెలిపారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుర్తించిన ఆసుపత్రి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి వెంటనే పరిష్కరించాలి. జిల్లా మంత్రులు స్పందించి హాస్పిటల్ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి.వీరన్న, నందిపాటి రమేష్, బి.వీరభద్రం, అభిమన్యు, ఎంఎస్.ప్రకాష్, ఎస్ఎస్.రాజు, గడల నరసింహారావు, రమేష్ బాబు, పద్మ, నాగకృష్ణ, రాం చరణ్, ప్రశాంత్, రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.




రాష్ట్ర మహిళా కన్వీనింగ్ కమిటీకి ఎన్నికైన గూడెం మహిళా న్యాయవాదులు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వినింగ్ కమిటీకి సభ్యులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మహిళా న్యాయవాదులు జి.కె.అన్నపూర్ణ, జి.సునంద ఎన్నికయ్యారు. ఖమ్మంలో రెండు రోజుల పాటు జరిగిన మహిళా న్యాయవాదుల రాష్ట్ర కన్వెన్షన్ ముగింపులో కమిటిని ఎన్నుకున్నారు. చందాల శైలజ కన్వీనర్‌గా, మోత్కూరి వనజ, ఎల్లావుల మంజులత, కె.రామ లక్ష్మీ కో-కన్వీనర్లుగా ఎన్నికయ్యారు. ఈ సభల్లో హైకోర్టు న్యాయమూర్తి పి.శ్రీసుధ, సీనియర్ జర్నలిస్టు సి.వనజ, ఏ.ఐ.ఎల్.యు. రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసిన జిల్లా ప్రజానీకానికి విప్లవ జేజేలు

- మహాసభల్లో చర్చించిన అంశాలపై పోరాటాలు
- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహించిన ఐద్వా రాష్ట్ర 4వ మహాసభల విజయవంతంకు సహాయ, సహకారాలు అందించిన జిల్లా ప్రజలకు జేజేలు అని, మహాసభల్లో చర్చించిన అంశాలపై పోరాటాలు చేస్తామని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐద్వా కార్యాలయంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు డి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించడం జరిగిందని, మహాసభల్లో జిల్లా ప్రస్తుత నిర్మాణము భవిష్యత్తులో ఇంకా పెంపొందించుకుంటామని చర్చించుకోవడం జరిగిందన్నారు. మహాసభల్లో అనేక రకాల కర్తవ్యాలు తీసుకున్నామని తెలిపారు. విద్యా, వైద్యం పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా హక్కు చట్టాలు పగడ్బందిగా అమలు చేయాలని, డ్వాక్రా రుణాలు వడ్డీ లేకుండా ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసు కుంటున్నారని, యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవడానికి భవిష్యత్ కార్యాచరణ చేపడతామని ఈ మహాసభల్లో చర్చించుకోవడం జరిగిందన్నారు. ఈ మహాసభలకు కొత్తగూడెం జిల్లాలో ఉన్న వాణిజ్య, వ్యాపార, రాజకీయ వర్గాలు మేధావులు, అనేక వర్గాల ప్రజలు మహాసభలు విజయవంతరానికి పెద్దఎత్తున సహకరించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు సందకూరి లక్ష్మి, నాదెండ్ల లీలావతి, అమల, జయ, గంగ, సంధ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా...పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలు

- బైక్ ర్యాలీలతో హోరెత్తిన అభిమానులు
- రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు

నవతెలంగాణ- ఖమ్మం



వర్ధిల్లు వెయ్యేళ్లు.... జీవించు నూరేళ్లు.... తరించే నీవాళ్లు... స్మరిస్తూ అయినోళ్లు... నేలతల్లి గొంతుఎత్తి పల్లెలన్నీ పళవించి తెలిపినాయి నీకూ ఈ క్షణం జన్మదిన శుభాకాంక్షలే అంటూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. పొంగులేటి అభిమానులు బైక్ ర్యాలీలతో ఉమ్మడి ఖమ్మంజిల్లాను హెరెత్తించారు. పురవీధులన్నీ శీనన్న కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్‌లతో నిండిపోయాయి. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొంగులేటి శీనన్న పిలుపు మేరకు ఆయన అభిమానులు, కాంగ్రెస్ నేతలంతా సమాజ, సామాజిక కార్యక్రమాల్లోనే నిమగ్నమయ్యారు.

ఖమ్మం క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మద్దినేని బేబి స్వర్ణకుమారి, బాణోతు విజయబాయి, గుమ్మా రోశయ్య, హరినాథబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం పీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జెండా ఊపి దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో దుంపల రవికుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేటలో బండి మనోజ్ ఆధ్వర్యంలో బొమ్మస్వామి గుడి వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దానవాయిగూడెంలో చల్లా కృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఖమ్మం కైకొండాయిగూడెంలో నాగటి ఉపేందర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరాలను చేపట్టారు. ఖమ్మంలోని జీవన సంధ్యా వద్ధాశ్రమం, అన్నం ఫౌండేషన్‌లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరినాథబాబు, మద్ది వీరారెడ్డి, భుజంగరెడ్డి, సోమ వెంకటరెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, కళ్లెం శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో పార్టీ టూ టౌన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. మతాలు మధ్య చిచ్చు పెట్టి దేశంలో మతోన్మాదం పెరిగేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరు గ్యారెంటీల ఊసే లేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్

నవ తెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్ అన్నారు. పార్టీ 32వ డివిజన్ శాఖ మహాసభ గుమస్తాల సంఘ భవనంలో సోమవారం నిర్వహించారు. ముందుగా జెండా ఎగరవేసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో లాటరీ పద్ధతి ద్వారా డబుల్ బెడ్ రూం ఇండ్లు కొంతమందికి ఇచ్చారని అన్నారు. నగరంలో వేలాది మంది పేద ప్రజలు కిరాయి ఇండ్లలో జీవితాలు వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి పార్టీ త్రీ టౌన్ కమిటీ సభ్యులు ఎస్కే బాబు అధ్యక్షత వహించగా పార్టీ 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాస్, వజనపల్లి శ్రీనివాసరావు, పట్నాల బాబు, వజనపల్లి కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 32 డివిజన్ నూతన శాఖ కార్యదర్శిగా పుట్నాల బాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చీకటి ధర్మయ్యకు నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణానికి చెందిన చీకటి ధర్మయ్య ఇటీవల కాలం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక శ్రీబాలాజీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన దివంగత ధర్మయ్య దశదిన కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ధర్మయ్య చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, దొడ్డా శ్రీనివాసరావు, నున్నా రామకృష్ణ, గాదె చెన్నకేశవరావు, నున్నా రత్నారావు, రావి నాగేశ్వరరావు, దొడ్డాకుల గోపాలరావు, నాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల పరిధిలోని పెద్దగోపవరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల పంట పొలాలలో ఎర్రుపాలెం సెక్షన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రైతులు పంట పొలాలకు వినియోగించే విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, విద్యుత్ వినియోగించే ట్రాన్స్ ఫారములు తరచూ అంతరాయాలకు గురికాకుండా నాణ్యమైన విద్యుత్తు పొందవచ్చునని ఎర్రుపాలెం సెక్షన్ ఏఈ అనూష రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పొలాలలో కిందకు కరెంటు తీగలు వేలాడుపడినా సర్వీస్ వైర్లు తెగిపడి ఉన్నా రైతులు వాటిని ముట్టుకోకుండా సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

పొంగులేటి పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రం ఎర్రుపాలెంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మండల కమిటీ ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకరరెడ్డి కేకును కట్ చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, పిసిసి సభ్యులు సేలం ప్రతాపరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, సేలం నర్సిరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, కడియం శ్రీనివాసరావు, బొగ్గుల గోవర్ధనరెడ్డి, తల్లపరెడ్డి నాగిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, పూర్ణచంద్ర రెడ్డి, మల్లెల లక్ష్మణరావు, సేలం వెంకటరామిరెడ్డి, అంకశాల శ్రీనివాసరావు, నన్నపనేని రామారావు, మొగిలి అప్పారావు, సూరంశెట్టి భాస్కరరావు, దేవరకొండ శ్రీనివాసరావు, బాబురావు, రాజేష్, కొండ, అనిల్ కుమార్, దేవరకొండ శిరీష, వేమిరెడ్డి త్రివేణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలి

- ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలి
- గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలి : టీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీలో యూనియన్లపై ఉన్న ఆంక్షలు ఎత్తేసి ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించా లనీ, ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఆర్టీసీ కార్మికుల కోసం పొందుపర్చిన హామీలను నెరవేర్చాలని కోరింది. హైదరాబాద్‌లో ఆ యూనియన్ సమావేశం జరిగింది. అందులో పలు తీర్మానాలను ఆమోదించింది. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ పాల్గొని రాజకీయ చైతన్య క్లాసును బోధించారు. సమావేశానికి సంబంధించిన వివరాలను ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్.రావు మీడియాకు వివరించారు. గత ప్రభుత్వం నియమించిన ఎంప్లాయి వెల్ఫేర్‌బోర్డులను కొత్తవారితో నింపాలని ఆర్టీసీని ఆదేశించి పాత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నామనే సంకేతాన్ని రాష్ట్ర సర్కారు పంపడం సరిగాదన్నారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లు రాజ్యాంగానికి లోబడి రిజిస్టర్ అయినవే ఉన్నాయనీ, వాటిపై ఆంక్షలు విధించడం సరిగాదని చెప్పారు. దీనివల్ల వాక్స్వాతంత్ర్యం, భావ ప్రకటనాస్వేచ్ఛ, సమిష్టి బేరసారాల హక్కు, లివింగ్ వేజెస్‌ను పొందే హక్కు, యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం అయ్యే హక్కులను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. 2017 వేతన పెంపుదలను అప్పటి ప్రభుత్వం ఏకపక్షంగా చేసిందని విమర్శించారు. వేతనాలు పెంచినట్టే పెంచి, ఏడేండ్ల అరియర్స్ రిటైర్మెంటు అయ్యేటప్పుడు చెల్లిస్తామని చెప్పి తీరని అన్యాయం చేసిందని వాపోయారు. విలీనం కంటే ముందే 11 సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని నొక్కి చెప్పారు. హక్కుల పునరుద్ధరణకు జరిగే ఆందోళనలో కార్మికులు ఐక్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కార్మికులను చైతన్యపర్చటం కోసం డిపోల్లో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు పర్యటించాలనీ, కార్మికుల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి 2025 మార్చిలో జరిగే "చలో పార్లమెంట్" కు పెద్ద సంఖ్యలో తరలొచ్చేందుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంతాప తీర్మానాన్ని ఆ యూనియన్ ప్రచార కార్యదర్శి పి. రవీందర్‌రెడ్డి ప్రతిపాదించగా..సమావేశం సంతాపం తెలిపింది. సమావేశాల్లో రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు, ఆయా డిపోల నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్స్ వర్సిటీ

- సువిశాల ప్రాంగణంలో అధునాతనంగా భవనాల నిర్మాణం
- 6 వేల మందికి శిక్షణ ఇచ్చేలా మౌలిక సదుపాయాల కల్పన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం డిజైన్లు తయారు చేయించింది. కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో దాదాపు 57 ఎకరాల విస్తీర్ణంలోని వర్సిటీ స్థలంలో పరిపాలన భవనంతోపాటు అకడమిక్ బ్లాక్, వర్క్‌షాపులు, అమ్మాయిలు, అబ్బాయిల హాస్టల్ భవనాలు, భోజనశాల, సిబ్బంది నివాస గృహాల నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటితోపాటు ఆడిటోరియం, గ్రంథాలయం, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లను రూపొందించింది. ఎక్కువ ఖాళీ స్థలం ఉండేలా, పచ్చదనం ఉండేలా భవన నమూనాలు తయారు చేయించింది. ఆరు వేల మంది విద్యార్థుల నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా ప్రాంగణంలో నిర్మాణాలను చేపట్టనుంది. అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చనున్నారు. వాటితోపాటు విద్యుత్తు వినియోగం తగ్గించేలా ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో గాలి, వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లలో వర్క్‌షాపులు, అకడమిక్ భవనాలను నిర్మిస్తారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలుండేలా వర్సిటీ ప్రాంగణం దేశం దృష్టిని ఆకర్షించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్కిటెక్ట్ ఇంజినీర్లకు, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మెఘా సంస్థ ప్రతినిధులకు సూచించారు. వచ్చేనెల ఆరో తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఎనిమిది నుంచి పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. స్కిల్స్ వర్సిటీ నిర్మాణానికి మెఘా సంస్థ రూ.200 కోట్లు, అదానీ సంస్థ రూ.వంద కోట్లు విరాళం అందించిన విషయం తెలిసిందే. వాటితోపాటు వివిధ కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం, విరాళాల ద్వారా సమీకరించిన నిధులన్నీ కార్పస్ ఫండ్ కింద జమ చేస్తోంది. వాటితో వర్సిటీ నిర్వహణకు భవిష్యత్తులో ఆర్థికపరమైన ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తున్నది.

ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్‌లో 10,436 మందికి సీట్ల కేటాయింపు

- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 30

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ అభ్యర్థులకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్‌లో 82,163 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. వారిలో 16,500 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. 16,145 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10,854 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో 10,436 (96.1 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 418 (3.9 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 127 కాలేజీల్లో 8,845 బీ ఫార్మసీ సీట్లుండగా, 8,453 (95.6 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇంకా 392 (4.4 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. తొమ్మిది విశ్వవిద్యాలయ, ఒక ప్రభుత్వ, 44 ప్రయివేటు కాలేజీలు కలిపి 54 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులకు సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈనెల 30 వరకు ఉందని తెలిపారు. తుదివిడత కౌన్సెలింగ్ తర్వాత వచ్చేనెల 11, 12 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజావాణిలో యువకుని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వివరాల్లోకెళ్తే.. తగరం అనిల్ కుమార్ సోమవారం ప్రజావాణికి వచ్చాడు. తన ఇంటి నిర్మాణం విషయంలో కుటుంబ సభ్యుల కలహాల వల్ల అధికారులు నిర్లక్ష్యం వహించి ఆరోపణలు చేస్తున్నారని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన పోలీసులు, విజిలెన్స్ అధికారులు వెంటనే అడ్డుకున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు లంచం ఇచ్చినా పట్టించుకోలేదని బాధితుడు ఆరోపించాడు. ముషీరాబాద్ ఏసీపీ, డీసీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. ప్రస్తుతం అనిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మండల కేంద్రానికి ప్రతి ఊరితోనూ అనుసంధానం ఉండేలా రోడ్లను వేయిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ త్వరలో పట్టాలెక్కనున్నది. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న రోడ్లన్నింటినీ అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాలు కవరయ్యేలా ఏటా నాలుగు నుంచి ఐదు వేల కిలోమీటర్ల లక్ష్యం చొప్పున నాలుగేండ్లలో 17,300 కిలోమీటర్ల రోడ్ల వార్షిక ప్రణాళికను రూపొందించింది. అందుకుగానూ రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలను సిద్ధం చేసింది. మండల కేంద్రం నుంచి మారుమూల పల్లెలకు రోడ్డు సౌకర్యం కల్పించడంపై ప్రాధాన్యం కల్పించింది. పల్లెలకు మధ్య అనుసంధానంగా ఉండే లింకురోడ్లను కూడా నిర్మాణం చేపట్టనున్నది. దీంతో పదేండ్ల కాలంలో కనీసం చిన్నచిన్న మరమ్మత్తులకు కూడా నోచుకోని రోడ్లకు ఈసారి మహర్దశ పట్టనున్నది. ఎమ్మెల్యేలు, ఎంపీల వినతులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం గుర్తించిన రోడ్లను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్లాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది.

అందులో భాగంగానే గ్రామీణ నేపథ్యమున్న 92 నియోజకవర్గాలకు ప్రాధాన్యం కల్పించింది. అందులోనూ ప్రజల ప్రయాణాలకు అత్యంత అవసరమున్న కొత్త రోడ్లను వేయడంపై దృష్టిసారించింది.

రాష్ట్రంలో ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో మొత్తం 68, 539.27 కిలోమీటర్ల రోడ్ నెట్వర్క్ ఉంది. ఇందులో 26146.83 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు, 7752.10 కిలోమీటర్ల మేర డబ్ల్యూబీఎం రహదారులు, 4146.63 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, మిగతా 30493.72 కిమీ మట్టిరోడ్లున్నాయి. ఇప్పుడున్న పంచాయతీ రాజ్ రోడ్లు కేవలం 10 మెట్రిక్ టన్నుల వాహన సామర్థ్యంతో నిర్వహిస్తున్నారు. కానీ, కొంతకాలంగా 25 నుండి 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న వాహనాల రద్దీ పెరిగింది. దీంతో పంచాయతీ రాజ్ రోడ్లు తొందరగా దెబ్బతింటున్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

కొన్నేండ్లుగా ప్రభుత్వం పంచాయతీ రాజ్ రోడ్ల నిర్వహణకు, పునరుద్ధరణకు తగినన్ని నిధులను కేటాయించలేదు. మరోవైపు నిరంతరం కురిసిన భారీ వర్షాలతో చాలాచోట్ల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పీఆర్ రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబర్ మధ్య పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. ఇటీవల వరదల అనంతరం అంచనా వేసిన నష్టాలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా ముందుగా17,300 కిమీ రోడ్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మించాలని లక్ష్యంగా ఎంచుకుంది. మట్టి, మెటల్‌రోడ్లు లేకుండా గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పుడున్న రోడ్ల సామర్థ్యాన్ని 10 మెట్రిక్ టన్నుల నుండి 30 మెట్రిక్ టన్నులకు పెంచనుంది. రాబోయే నాలుగేండ్లలో ఈ రోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ పనులకు రూ. 12,000 కోట్ల అంచనా వ్యయం అవుతుందని పంచాయతీరాజ్ విభాగం ఇటీవలే ప్రతిపాదనలు తయారు చేసింది. 2024-25 లో 5000 కిలోమీటర్లు, వచ్చే ఏడాది 2025-26లో 4 వేల కిలోమీటర్లు, 2026-27లో 5 వేల కిలోమీటర్లు, 2027-28లో 3300 కిలోమీటర్ల రోడ్లను.. మొత్తం 17300 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేసేలా ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ రోడ్ల పనులను పీపీపీ మోడల్లో చేపట్టాలనీ, పదేండ్ల పాటు ఈ రోడ్ల నిర్వహణను కూడా అదే సంస్థకు అప్పగించాలని రాష్ట్ర సర్కారు యోచిస్తున్నది.

నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలు

- ఉపాధి హామీకి ఆధార్ అనుసంధానాన్ని వ్యతిరేకిస్తున్నాం : ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నట్టు ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ ఏపీ భవన్‌లో బి.వెంకట్ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్త ఆందోళనలో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఆందోళన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీకి ఆధార్‌ను అనుసంధానం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గత కొన్ని నెలల్లోనే ఉపాధి హామీ పథకంలో ఆరు కోట్ల మంది ప్రజలు తొలగించారని తెలిపారు. చాలా మంది ఉపాధి హామీ కార్డులను అర్హత లేదని రద్దు చేశారన్నారు. సుప్రీంకోర్టులో ఆధార్ గురించి కేంద్రం చెప్పిన సమాధానం ప్రకారం.. ఆధార్ సమాచారం కోసం మాత్రమే ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. ఆధార్ ఆధారంగా ఉపాధి హామీ వేతనాలు ఇస్తామని నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంగించడమేనని పేర్కొన్నారు. దేశంలో 25 కోట్ల మందికిపైగా ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌కు దూరంగా ఉన్నారని లెక్కలు చెబుతున్నాయని, ఇంకా స్మార్ట్ ఫోన్లకు వృద్ధులు, మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదవాళ్లు దూరంగా ఉన్నారని అన్నారు. ఉపాధి హామీని బలహీనపరచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, అందుకే ఉపాధి హామీ పథకంలో పని దినాలు తగ్గించారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో మరింత అన్యాయంగా ఉపాధి హామీ పరిస్థితులు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో 30 లక్షల మందికి ఉపాధి హామీ రద్దు చేశారని, ఏపీలో దళితులకు 15.5 శాతం పని దినాలు తగ్గాయి. అంటే ఎంత దుర్మార్గంగా బీజేపీ వ్యవహరిస్తుందో అర్థం అవుతుందని అన్నారు. పేదరికం తగ్గాలన్నా, నిరుద్యోగ తగ్గాలన్నా ఉపాధి హామీ ముఖ్యమైన వనరుగా భావించాలని అన్నారు. ఉపాధి హామీ విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఉపాధి కల్పన, పేదరికం, భూమి, ఇండ్లు వంటి వాటిపై పోరాటం చేస్తామన్నారు.

పత్తి మార్కెట్‌లో దోపిడీని అరికట్టాలి

తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టి, కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా క్వింటాలుకు రూ.475 బోనస్ ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని మార్కెట్లలో పత్తి ధరలను క్వింటాలుకు రూ.6000-7000కు తగ్గించి మధ్య దళారులు విపరీతంగా లాభాలు సంపాదిస్తున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని గుర్తు చేశారు.

ప్రస్తుతం కనీస మద్దతు ధర రూ.7,521 ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి అమ్మకాలు జరగాలని తెలిపారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర కొనసాగుతుందని పేర్కొన్నారు. అయినా రాష్ట్రంలోని వ్యాపారులు మిలాఖత్ అయ్యి పత్తి ధరను రూ.6000- 7000కు తగ్గించారని తెలిపారు. నాణ్యత ప్రమాణాల పేరుతో రైతులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 43 లక్షల ఎకరాల్లో పత్తి పంట వేశారని పేర్కొన్నారు. అధిక వర్షాల వల్ల ఐదు లక్షల ఎకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. రెండుసార్లు వేసిన పంట మరింత దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఎకరాకు 3-5 క్వింటాళ్ల లోపు మాత్రమే పత్తి దిగుబడి వస్తున్నదని తెలిపారు. ఎకరానికి రూ 70 వేల పెట్టుబడి పెట్టినా..రూ. 40 వేలకు మించి ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు బోనస్ కలిపి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు చేస్తే అంతర్జాతీయ మార్కెట్ ధరలను చూస్తే ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. ధరలు తగ్గిస్తే అప్పులపాలై ఆత్మహత్యలు మరింత పెరుగుతాయని గుర్తు చేశారు. ఇప్పటికే ఏటా దేశంలో 12వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, ఇందులో పత్తి, కౌలు రైతులే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు. ఇలాంటి స్థితిలో పత్తి రైతులకు మద్దతు ధర అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే రైతాంగాన్ని కదిలించి ఆందోళన, పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అనుమతి లేని విదేశీ మద్యం లభ్యం

- పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్టు వెల్లడి
- నార్కోటిక్ డ్రగ్ కేసుగా నమోదు : మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేటీఆర్ బావమరిది మిడ్ నైట్ పార్టీలో అనుమతి లేని విదేశీ మద్యం లభ్యమైందని రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అనంతరం జరిపిన పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్టు వెల్లడి కావడంతో నార్కోటిక్ డ్రగ్స్ కేసుగా నమోదు చేశారని చెప్పారు. చట్టంలో ఉన్న విధంగా ఫంక్షన్లు, కార్యక్రమాలు ఎవరైనా చేసుకోవచ్చనీ, అయితే ఎక్సైజ్ నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సదరు ఫామ్‌హౌస్‌పై ఫిర్యాదు మేరకే పోలీసులు దాడి చేశారే తప్ప రాజకీయంగా ఎవరిపైనా కేసు పెట్టలేదని స్పష్టం చేశారు. వీఐపీ బావమరిది కావడంతోనే మీడియా అట్రాక్ట్ అయిందని తెలిపారు. తాము స్పందిస్తలేమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పోలీసుల మనోధైర్యం దెబ్బతినేలా మాట్లాడుతున్నారని విమర్శిం చారు. ఎలాంటి వివక్ష లేకుండా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు చేయడం లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ వైఫల్యాలు బయటపడుతుండటంతో వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులతో తమకు అధికారం ఇస్తే, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతం ఇస్తున్నట్టు తెలిపారు. 2022 నుంచి ఒక్క డీఏ ఇవ్వకుండా తాము డీఏ ప్రకటించిన విషయం గుర్తుచేశారు. గురుకులాల అద్దెభవనాలకు కిరాయిలు, ఆస్పత్రులకు బకాయిలతో పాటు రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు.

వచ్చే నెల 6 నుంచి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే...

(మొదటిపేజీ తరువాయి)

ప్రొఫెసర్లు, పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ అనే సంస్థ ప్రతినిధులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకోవటం ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది.

సర్వే సందర్భంగా రాష్ట్రంలో ఏ కులం జనాభా ఎంత? ఎవరెవరికి సంక్షేమ పథకాలు ఎంత మేరకు అందాయి? అవి అందని వారి సంఖ్య ఎంత? తదితరాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు వచ్చే నెల నుంచి సర్వే చేపట్టాలని ప్రణాళికా శాఖను ఆదేశించింది. సంబంధిత ప్రణాళికలు కూడా ఖరారయ్యాయి. సర్వే కోసం మొత్తం మూడు వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. వారికి శిక్షణను కూడా ఇవ్వనున్నారు. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. సర్వే నేపథ్యంలో అధికారులు, సిబ్బంది 15 రోజులపాటు క్షేత్రస్థాయిలోనే ఉండాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలకు సంబంధించిన అన్ని వివరాలను వారు సేకరించనున్నారు. ఆ రకంగా రాష్ట్రంలోని 1.10 కోట్ల కుటుంబాలపై సర్వే చేపట్టనున్నారు. ఈ క్రమంలో మొత్తం 54 ప్రశ్నలను ఫార్మాట్‌లో చేర్చగా, ఇందులో సగం వ్యక్తులు, కుటుంబాలకు సంబంధించినవి కాగా, మిగతావి వ్యక్తిగత వివరాలకు సంబంధించినవి ఉన్నాయి.

సర్వేలో భాగంగా మొదటి దశలో అధికారులు... కుటుంబ సభ్యుల సంఖ్యను సేకరిస్తారు. ఆ తర్వాత కుటుంబ యజమాని, సభ్యులు, యజమానితో సంబంధం, జెండర్, మతం, కులం/సామాజిక వర్గం, ఉప కులం, కులానికి సంబంధించిన ఇతర పేర్లు, వయస్సు, మాతృభాష, ఆధార్ నంబర్లను సేకరించనున్నారు. రెండో దశలో ఓటర్ ఐడీ కార్డు, వికలాంగులైతే సంబంధిత పూర్తి వివరాలు, వివాహమైందా? కాలేదా? పెండ్లి నాటికి వయస్సు, ఆరేండ్ల వయసులోపు పిల్లలను పాఠశాలలో చేర్చారా? లేదా? ఒకవేళ చేర్పితే వారి చదువు వివరాలు, మధ్యలో బడి మానేస్తే అందుకుగల కారణాలు మొదలగు అంశాలను సేకరిస్తారు. మూడో దశలో కుటుంబ సభ్యులు చేస్తున్న వృత్తి, ఉపాధి, ఉద్యోగం, రోజువారీ వేతనాలు, జీతభత్యాలు తదితర వివరాలను నమోదు చేసుకుంటారు. వీటితోపాటు కుటుంబ సభ్యులకున్న జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులు, వార్షికాదాయం, పన్ను చెల్లింపులు, బ్యాంకు ఖాతాలు తదితరాంశాలను సేకరిస్తారు. నాలుగో దశలో రిజర్వేషన్లకు సంబంధించిన విషయాలు, ఐదో దశలో భూమి, ధరణి పాస్‌బుక్కులు, భూమిపై తీసుకున్న రుణాల వివరాలను నమోదు చేసుకుంటారు. ఆరో దశలో ఒక్కో కుటుంబానికున్న పశుసంపద, గొర్రెలు, మేకలు, కోళ్లు, బాతులు, ఇతర పెంపుడు జంతువులు, పక్షుల గురించి నమోదు చేసుకుంటారు. ఇక చివరిదైన ఏడో దశలో కుటుంబ సభ్యుల స్థిరచరాస్తులు, ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలు, నివాస గృహాలు, మరుగుదొడ్లు, ఇంటికి విద్యుత్ సదుపాయం లాంటి అంశాలపై వివరాలను సేకరిస్తారు.

ప్రతీ 150 కుటుంబాలకు ఒక అధికారి...

ప్రస్తుతం రాష్ట్ర జనాభా 3.80 కోట్లకు పైగా ఉంది. మొత్తం కుటుంబాల సంఖ్య 1.10 కోట్లు దాటిందనేది అధికారిక వర్గాల అంచనా. దీనికి తగ్గట్టుగానే సిబ్బంది నియామకానికి ప్రణాళికా శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. ఆ ప్రకారంగా ప్రతీ 150 కుటుంబాలకు ఓ సర్వే గణకుడిని నియమిస్తారు. ఈ లెక్కన సర్వే కోసం మొత్తం 75 వేల మంది అవసరమవుతారు. పర్యవేక్షకులుగా మరో 15 వేల మంది అవసరం. వీళ్లందరినీ నియమించేందుకు అన్ని శాఖల నుంచి సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఉపాధ్యాయులను ఇలాంటి సర్వేలకు పంపించొద్దంటూ కోర్టులు గతంలో తీర్పులు వెలువరించాయి. ఈ నేపథ్యంలో టీచర్లు కాకుండా 15 వేల మంది ఇతర ఉద్యోగులను ఈ సర్వే కోసం నియమించనున్నారు. జిల్లాల్లో కుటుంబాల సంఖ్య ఆధారంగా అన్ని శాఖల నుంచి కనీసం 2,500 నుంచి 3 వేల మంది ఉద్యోగులను ఈ సర్వే కోసం వినియోగించనున్నారు. వీళ్లందరూ 15 రోజులపాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు. ఒకసారి సర్వే పూర్తయ్యాక వివరాలు పక్కాగా సేకరించారా? లేదా? అనే దానిపై తనిఖీ చేయాలని అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు ఈ నెలాఖరులోగా సర్వేను ప్రారంభించేందుకు సర్కారు యోచిస్తోంది. ఆ నివేదికను మొత్తం 60 రోజుల్లోగా అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.



మెప్మా ఆర్‌పీల పెండింగ్ వేతనాలివ్వాలి : ఎస్వీ రమ

సీఐటీయూలో చేరిన ఆర్‌పీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్‌పీల పెండింగ్ వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్వీ.రమ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో బడంగ్‌పేట, జల్‌పల్లి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్న మెప్మా ఆర్‌పీలు ఆమె సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఆర్‌పీలు అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నారనీ, వారికి కనీస భద్రత, గుర్తింపు లేదని చెప్పారు. మున్సిపల్ పట్టణాల్లో మహిళలు ఆర్థికంగా ఎదిగేలా సూచనలు చేస్తూ, ప్రభుత్వం నుంచి లోన్లు ఇప్పిస్తూ కృషి చేస్తున్న ఆర్‌పీల జీవితాలు మాత్రం బాగుపడటం లేదని వాపోయారు. వారి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇచ్చే అరకొర వేతనాలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడమేంటని ప్రశ్నించారు. వారి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలనీ, జాబ్‌చార్టును విడుదల చేయాలని కోరారు. అట్లాగే, వారికి హెల్త్, గుర్తింపు కార్డులివ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మంజుల, ఎస్.మమత, సరోజ, సరిత, కల్పన, సుగుణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అధ్యాపకుని అసభ్య ప్రవర్తన

- లెక్చరర్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థుల ధర్నా
- ఉద్రిక్తంగా మారిన కాలేజీ వాతావరణం
- విద్యార్థిని ఫిర్యాదుతో నిందితుడిపై కేసు
- లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు : ఎస్ఐ గిరి




నవతెలంగాణ-పెద్దేముల్

పాఠాలు చెప్పాల్సిన ఓ అధ్యాపకుడు కాలేజీ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేస్తున్న జమీల్.. రెండు రోజుల క్రితం కాలేజీలో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, దాంతో ఆ విద్యార్థిని కాలేజీకి రావడం లేదని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్, ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము రజిత వేరువేరుగా కళాశాలను సందర్శించారు. అదే సమయంలో.. అసభ్యంగా ప్రవర్తించిన హిందీ లెక్చరర్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ కాలేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గిరి సిబ్బందితో కలిసి కాలేజీకి చేరుకున్నారు. ఉద్రిక్తతల మధ్య లెక్చరర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధిత విద్యార్థిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు విద్యార్థినికి న్యాయం జరిగేలా చూడాలని నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్ జమీల్‌పై పోక్స్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గిరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుల గణనపై నేడు కలెక్టర్లతో కాన్ఫరెన్స్

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నలు వేస్తే బాగుంటుందనే అంశంపై వారిని అడిగి తెలుసుకున్నారు. మరికొద్ది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, అభ్యుదయవాదులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించటం ద్వారా కుల గణనపై వారి నుంచి సలహాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆ భేటీకి కుల, యువజన సంఘాలను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి, వారి అభిప్రాయాను కూడా సేకరిస్తామని వివరించారు. సర్వేకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నాపత్రం బాగుందంటూ సామాజికవేత్త యోగేంద్ర యాదవ్ సైతం ప్రశంసించారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కుల గణన చేపడతామంటూ కామారెడ్డిలో ఎన్నికలకు ముందు నిర్వహించిన బీసీ డిక్లరేషన్ బహిరంగ సభలో ప్రకటించామని గుర్తు చేశారు. ఎలక్షన్ మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపరిచామని చెప్పారు. ఆ ప్రకారంగా ఇప్పుడు కుల గణనను చేపట్టబోతున్నామని వివరించారు. సర్వే సందర్భంగా న్యాయ పరమైన చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ మురళి మనోహర్ సూచించారు. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 15 ఇండ్లను సర్వే చేయడం కష్టమవుతుందనీ, అందువల్ల ఆ సంఖ్యను పదికి కుదించాలని విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్ సింహాద్రి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విజయం ఒకరి సొత్తు కాదు. సాధించాలనే తపన, ప్రోత్సహించే కుటుంబం ఉండాలే గానీ ఎంతటి సాహసాలు చేసైనా ప్రపంచం ముందు మనమేంటో నిరూపించుకోవచ్చు. ఆ కోవకే చెందుతారు ఆడ్రియానా బ్రౌన్లీ. అభిరుచి, అంకితభావం, పట్టుదల ఒక దగ్గర చేరితే ఏమవుతుంది? అపూరూప విజయం అవుతుంది. కానీ ఆమె సాధించినది చారిత్రక విజయం. చిన్నతనం నుండే పెద్ద పెద్ద పర్వతాలు ఎక్కి చరిత్ర సృష్టించాలని కలలు కన్నది. తన కలలను నిజం చేసుకునేందుకు తన బాల్యాన్నే త్యాగం చేసింది. 23 ఏండ్లకే ప్రపంచంలోని 14 ఎత్తైన పర్వతాలను అధిరోహించిన, అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

ప్రతి సవాలు విలువైనదే...



లండన్‌లో పుట్టి పెరిగిన బ్రౌన్లీకి చిన్నప్పటి నుంచి ఎత్తైన పర్వతాలను అధిరోహించిన వారి గురించి తెలుసుకోవడం అంటే ఎంతో ఇష్టం. తన తండ్రి పర్వతారోహకుడు. పర్వతారోహణకు సంబంధించి అనేక విషయాలు ఆయన కూతురితో పంచుకునే వాడు. అలా తండ్రి చెప్పే ఒళ్లు గగుర్పొడిచే విషయాలను వినడమంటే ఆమెకు అమితమైన ఆసక్తి. ఎనిమిదేండ్ల వయసులో పర్వతారోహకుడైన తండ్రి నుంచి ప్రేరణ పొందింది బ్రౌన్లీ.

ఆక్సిజన్ లేకుండా...

పెద్ద పర్వతాలు అధిరోహించి పెద్ద పేరు తెచ్చుకోవాలని చిన్నతనం నుండే కలలు కనేది. అప్పటి నుండే శిక్షణ మొదలుపెట్టింది. ఇరవై ఏండ్ల వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడంతో ఆ కల సాకారం అయింది. ఆక్సిజన్ లేకుండా గాషెర్బ్రమ్ 1కు చేరుకున్న అతిపిన్న వయస్కురాలిగా, కే2 శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది. చైనాలోని 8,000 మీటర్ల ఎత్తులో ఉన్న పిషాపాంగ్మా పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 14 శిఖరాల అధిరోహణను పూర్తి చేసింది. నిర్మలమైన ఆకాశం సాక్షిగా, సూర్యోదయం వెలుగులో పిషాపాంగ్మా పర్వతం దగ్గరకు చేరుకోగానే బ్రౌన్లీ భావోద్వేగానికి గురైంది. 'శిఖరానికి చేరుకోకముందే నా లక్ష్యం నెరవేరబోతుంది అనే ఆనందంలో ఏడ్వడం మొదలు పెట్టాను' అంటూ ఆ క్షణాలను గుర్తు చేసుకుంది.

త్యాగాల సమాహారం

బ్రౌన్లీ సాధించిన చారిత్రక విజయం కేవలం సంఖ్యకు సంబంధించినది కాదు. అంకిత భావాన్ని, నిబద్ధతను ప్రతిఫలించే అపురూప విజయం అది. పర్వతారోహణ అనేది అభిరుచి మాత్రమే కాదు, త్యాగాల సమాహారం. పర్వతారోహణపై దృష్టి పెట్టిన బ్రౌన్లీ టీనేజ్ సంతోషాలకు దూరమైంది. తన కలను సాకారం చేసుకోవడానికి యూనివర్సిటీకి దూరమైంది. వ్యక్తిగత విజయాలపై మాత్రమే బ్రౌన్లీ దృష్టి పెట్టలేదు. పర్వతారోహణ విషయంలో యువతను ప్రోత్సహించడానికి, వారు తమ కలలను సాకారం చేసుకునే విషయంలో సహకరించడానికి నడుం కట్టింది.

శిక్షణ కూడా చాలా ముఖ్యం

'సాహసం మంచిదేగానీ దుస్సాహసం తగదు' అంటున్న బ్రౌన్లీ ఎంతో మంది పర్వతారోహకులను దగ్గర నుంచి చూసింది. వారి గురించి పూర్తిగా అధ్యయనం చేసింది. వారిలో ఉత్సాహమే కనిపిస్తుంది. శిక్షణ లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 'సాహసాల పేరుతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం నాకు తెలుసు. పర్వతారోహణ పేరుతో సాహసాలకు దిగే కొద్ది మందికి ప్రాథమిక విషయాల్లో కూడా అవగాహన లేదని తెలుసుకున్నాను. ఉత్సాహమే కాదు శిక్షణ కూడా చాలా ముఖ్యం. అనుభవం లేని పర్వతారోహకులను ఎత్తైన శిఖరాలను అధిరోహించడానికి అనుమతించరాదు. వారు తమ ప్రాణాలతో పాటు ఇతరులకు ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. ఎత్తైన శిఖరాలను అధిరోహించడానికి ప్రయత్నించే పర్వతారోహకులు ముందుగా చిన్న పర్వతాలను అధిరోహించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి' అంటుంది బ్రౌన్లీ. 'ఎప్పుడూ పర్వతాల గోలేనా' అని బ్రౌన్లీని స్నేహితులు వెక్కిరించేవారు. అయితే ఆమె అలాంటి వెక్కిరింపులను ఎప్పుడూ పట్టించుకోలేదు.

'జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడానికి నచ్చిన మార్గాన్ని ఎంచుకోవచ్చు. ఆ లక్ష్యం మీకు ప్రత్యేకమైనది కావచ్చు. ఇతరులకు వింతగా అనిపించవచ్చు' అంటుంది బ్రౌన్లీ. ఒక పర్వతానికి మరో పర్వతానికి సంబంధం ఉండదు. ప్రతి పర్వతం తనదైన సవాళ్లు విసురుతుంటుంది. 'ప్రతి సవాలు విలువైనదే' అంటున్న ఆడ్రియానా బ్రౌన్లీ భవిష్యత్‌లో మరిన్ని సాహసాలు చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుంటుంది. ■



ఎన్ని షాంపూలు వాడినా...

తలపై దురద, చుండ్రు అనే రెండు సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధించేవే. చుండ్రుకు ప్రధాన కారణం జుట్టులో ఉండే మురికి. ఇది కాకుండా, జుట్టు రంగు, ఒత్తిడి, ఫంగల్ ఇన్ఫెక్షన్, ఆందోళన లేదా పేలు కూడా చుండ్రుకు కారణం కావచ్చు. అదే సమయంలో, తల దురద వ్యాధిని సెబోరోహెయిక్ డెర్మటైటిస్ అని పిలుస్తారు, ఇది అధిక చుండ్రు వల్ల వస్తుంది.

వింటర్ సీజన్‌లో స్కాల్ప్‌లో డ్రైనెస్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని నివారించుకోవాలంటే తలకు నూనె రాయండి లేదా తలపై బాగా మసాజ్ చేయండి. ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా దురద వస్తుంది. మీరు తల దురద సమస్యతో ఇబ్బంది పడుతుంటే కొన్ని ఇంటి చిట్కాలతో ఈ సమస్యను వదిలించుకోవచ్చు.

నిమ్మరసం

నిమ్మరసంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. దీన్ని కాటన్ బాల్‌తో తలకు పట్టించి 10-15 నిమిషాలు అలాగే ఉంచి తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకటి లేదా రెండు సార్లు చేస్తే తల దురద నుంచి ఉపశమనం కలుగుతుంది.

కొబ్బరి నూనె

కొన్నిసార్లు దురదకు చర్మం పొడిగా ఉండటం కూడా ఒక కారణం. కొబ్బరి నూనె తలకు అద్భుతమైన మాయిశ్చరైజర్. దీన్ని వేడి చేసి తలపై మసాజ్ చేయాలి. వీలైనంత సేపు అలాగే ఉంచి తర్వాత షాంపూతో కడగాలి. అలాగే కొబ్బరినూనెలో కొద్దిగా కర్పూరం మిక్స్ చేసి తలకు మర్దన చేయాలి. కర్పూర ప్రభావంవల్ల చల్లగా ఉంటుంది, దీని వల్ల దురదలు తగ్గి, ఎలాంటి ఇన్ఫెక్షన్ వున్నా నయమవుతుంది.

వంట సోడా

2-3 చెంచాల బేకింగ్ సోడా తీసుకుని నీటితో పేస్ట్ చేయాలి. దీన్ని తలకు పట్టించి 10-15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. బేకింగ్ సోడా ఒక యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ ఏజెంట్, ఇది స్కాల్ప్‌ను శుభ్రం చేస్తుంది. దురద తగ్గిస్తుంది.

ఉల్లిపాయ రసం

ఒక ఉల్లిపాయను తీసుకుని దాని రసాన్ని తీయండి. దీన్ని కాటన్‌తో తలకు పట్టించి కనీసం 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఇది స్కాల్ప్ ఇన్ఫెక్షన్ నుండి కాపాడుతుంది, చికాకును తగ్గిస్తుంది.

పెరుగు

పెరుగుతో తలకు మసాజ్ చేయడం వల్ల కూడా కూడా తగ్గుతుంది. దీంతో జుట్టుకు మెరుపు వస్తుంది. మురికి దురదకు కారణమవుతుంది కాబట్టి స్కాల్ప్‌ను శుభ్రంగా ఉంచుకోవడం కూడా ముఖ్యం. ■

కులగణనలేకుండానే..

(మొదటిపేజీ తరువాయి)

సేకరణను ప్రారంభించేందుకు ఇప్పటికే సన్నాహాలు జరుగుతున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే జనగణనలో కులగణనను చేర్చరు. బీహార్, మరికొన్ని రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున వాటికి ముందు జనగణనపై ప్రతిపక్షాలు గళం విప్పకుండా చేసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చిందని తెలిసింది. వాస్తవానికి 2021లోనే జనగణన ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కోవిడ్ కారణంగా అది వాయిదా పడింది. దేశంలో చివరిసారిగా 2011లో జనాభా లెక్కల సేకరణ జరిగింది. ఆ తర్వాత ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం జనగణన చేయలేదు. మరోవైపు కులగణనపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం మోడీ ప్రభుత్వంపై విమర్శలు సంధిస్తోంది. అయితే ప్రభుత్వానికి కులగణన జరిపే ఆలోచన ఏదీ లేదని, దానికి బదులు జనగణన జరుపుతుందని తెలుస్తోంది.

1881 నుండి భారత్‌లో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరుగుతోంది. 2011లో చివరిసారిగా జరిగిన జనాభా లెక్కల సేకరణ ప్రకారం మన దేశ జనాభా 121.1 కోట్లు. గత సంవత్సరం ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం భారత్ జనాభా 142 కోట్లకు చేరింది. తద్వారా చైనాను అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించింది. కాగా లోక్‌సభకు తదుపరి ఎన్నికలు 2029లో జరగాల్సి ఉంది. దానికి ముందే నియోజకవర్గాల పునర్విభజన పూర్తవుతుందని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. అందుకోసం ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇప్పటి వరకూ దేశంలో 1952, 1963, 1973, 2002 సంవత్సరాలలో పునర్విభజన కమిషన్లు ఏర్పడ్డాయి.

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

జగదాంబిక పాల్ అధ్యక్షతన సోమవారం పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం జరిగింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డు సమర్పించిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఎంపీలు ఆ సమావేశాన్ని వాకౌట్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ అనుమతి లేకుండానే.. ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ మీటింగ్‌లో ప్రజెంటేషన్ ఇచ్చారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, డీఎంకే ఎంపీ మహమ్మద్ అబ్దుల్లా, కాంగ్రెస్ ఎంపీలు నసీర్ హుస్సేన్, మహమ్మద్ జావెద్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సమావేశం నుంచి వాకౌట్ చేసి తమ నిరసన తెలిపారు. అనంతరం కొంత సమయం తరువాత ఎంపీలు తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అనుమతి లేకుండానే వక్ఫ్ బోర్డు ప్రాథమిక నివేదికను పూర్తిగా మార్చేశారని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కమిషన్, ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ అశ్విని కుమార్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ సమావేశానికి టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ గైర్హాజరుతో గందరగోళం నెలకొంది. మరోవైపు వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదించిన సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి సోమవారం జేపీసీకి లేఖ రాశారు. ఈ బిల్లుపై జేపీసీ ఢిల్లీ ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అతిశి ఈ బిల్లును 'అనవసరం, వ్యర్థం' అని పేర్కొన్నారు.గత మంగళవారం జరిగిన జేపీసీ సమావేశంలో టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ అన్‌పార్లమెంటరీ ప్రవర్తన ఆరోపణలపై ఒక్క రోజు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అద్దాలు పగిలి కళ్యాణ్ బెనర్జీ చేతికి గాయమైంది. కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆగస్టు 8న లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లును తీవ్ర వ్యతిరేకత, గందరగోళం మధ్య ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింల మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని పేర్కొంటూ ప్రతిపక్షం ఏకకాలంలో బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సుదీర్ఘ చర్చ అనంతరం ఏకాభిప్రాయం కోసం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపాలని కేంద్రం నిర్ణయించింది.

టారిఫ్ పెంపు లేదు..ఫిక్సెడ్ చార్జీల బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

పెంపు జరగలేదు. ప్రభుత్వ సబ్సిడీ గత ఏడాదికంటే ఈసారి రూ.2,374,7 కోట్లు అదనంగా చెల్లించిందని టీజీఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య సోమవారం విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రభుత్వ శాఖల నుంచి డిస్కంలకు రూ.25వేల కోట్ల బకాయిలు రావల్సి ఉందనీ, వాటిని వసూలు చేసుకోవాలని ఈఆర్సీ సూచించింది.

స్వతంత్ర మీడియాపై అక్కసు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించింది. మీడియా గొంతుకను అణచివేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక నేరాల పేరుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడింది. ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. 'మీడియాను అణచివేసేందుకు, బెదిరించేందుకు, దానిపై దాడి చేసేందుకు ఆర్థిక నేరాల అభియోగాలను దుర్వినియోగం చేయడం : సమీక్ష' పేరిట ఈ నివేదికను రూపొందించారు. మన దేశంలో న్యూస్‌క్లిక్ పోర్టల్ సహా స్వతంత్ర జర్నలిజంలో ఉన్న మీడియా సంస్థలపై జరిగిన ఎనిమిది వేర్వేరు దాడులను ఈ నివేదిక విశ్లేషించింది.

ఏం జరుగుతోంది?

స్వతంత్ర మీడియా, పాత్రికేయులు గళం విప్పకుండా చేసేందుకు వారిపై మనీ లాండరింగ్, పన్ను ఎగవేత, బ్లాక్‌మెయిల్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, మోసం, అక్రమంగా విదేశీ నిధులు పొందడం వంటి ఆర్థికపరమైన అభియోగాలు మోపి వాటిని పాలకులు దుర్వినియోగం చేస్తున్నారు. ఆర్థిక నేరాల అభియోగాల ప్రభావాన్ని నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. ఆర్థిక నేరాలు మోపి జైలుకు పంపే అవకాశం ఉంది. క్రిమినల్ చట్టానికి సంబంధించిన ఆర్థిక నేరాల విచారణ సుదీర్ఘ కాలం సాగుతుంది. విచారణ సమయంలో జైలు జీవితం గడపాల్సి వస్తుంది. భారీగా జరిమానాలు విధిస్తారు. ఈ పరిణామాలతో స్వతంత్ర మీడియా సంస్థ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. చివరికి మూతపడే పరిస్థితి వస్తుంది. ఈ విధంగా పాలక పక్షాలు మీడియా సంస్థలను అణచివేసేందుకు అందివచ్చిన అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటాయి. ఇక్కడ మరో ధోరణి కూడా కన్పిస్తోంది. విచారణ సమయంలో మీడియా సంస్థలు, పాత్రికేయుల బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేస్తారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్థిక నేరాలకు సంబంధించిన అభియోగాలను న్యాయస్థానాలలో సవాలు చేయడానికి చాలా ఖర్చు అవుతుంది. ఎందుకంటే ట్యాక్స్, క్రిమినల్ న్యాయవాదులను నియమించుకోవాలి. అకౌంటింగ్ నిపుణులు, న్యాయ కోవిదులను సంప్రదించాలి. అయితే అదంత తేలికైన విషయం కాదు. పైగా ఈ కేసులు వాదించే న్యాయవాదులపై కూడా దాడులు జరుపుతారు. పాత్రికేయులను నేరస్థులుగా చిత్రీకరించి వారికి ప్రజల మద్దతు లేకుండా చేయడానికి ప్రభుత్వాలు విశ్వప్రయత్నం చేస్తాయి. పాత్రికేయులు, మీడియా సంస్థల పేరు ప్రతిష్ఠలను దెబ్బతీయాలని చూస్తాయి. న్యూస్‌క్లిక్ ఉదంతంలో జరిగింది అదే.

నివేదికలో ఏముంది?

విమర్శకులుగా ఉంటున్న స్వతంత్ర మీడియా సంస్థల అణచివేతకు ఉగ్రవాద నిరోధక చట్టాలను ప్రయోగించడంపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. న్యూస్‌క్లిక్ ఉదంతమే దీనికి ఉదాహరణ అని తెలిపింది. మన దేశంలో ప్రధాన మీడియా సంస్థలు అధికార బీజేపీకి కొమ్ము కాస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్వతంత్ర మీడియానే ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటోంది. కాగా అజర్‌బైజాన్‌లోని అబ్జాస్ మీడియా, ఎల్ సాల్వెడార్‌లోని ఎల్ ఫరో, టాంజానియాలోని ఎరిక్ కబెండెరా, హాంగ్‌కాంగ్‌కు చెందిన జిమ్మీ లై, గ్వాటెమాలాలోని జోస్ రుబేన్ జమోరా, ఫిలిప్పీన్స్‌లోని మరియా రెస్సా, రాప్లర్, జార్జియాలోని నికా గ్వరామియా మీడియా సంస్థలను కూడా అక్కడి ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నాయని డబ్ల్యూఎఎస్-ఐఎఫ్ఆర్ఏ నివేదిక వివరించింది.

రేవంత్‌వి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్(ప్రజల దృష్టిని మరల్చే రాజకీయాలు)కు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సీఎం మెదడులో విషం తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన విజన్ లేదని ఆయన ఎద్దేవా చేశారు. పాలనపై అవగాహన లేక రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ...రేవంత్‌ది ప్రజా పాలన కాదనీ, అది ప్రజా పీడనని దుయ్యబట్టారు. ఇటీవల ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలనుబట్టి సీఎం వికృత రూపం బయటపడుతోందని విమర్శించారు. గత పదకొండు నెలల పాలనలో కాంగ్రెస్ సర్కారు ఏ ఒక్క వర్గానికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని అన్నారు. జిల్లాలన్నీ ధర్నాలతో అట్టుడికిపోతున్నాయని గుర్తు చేశారు. ఈ క్రమంలో ప్రజా సమస్యల గురించి అడిగితే ముఖ్యమంత్రి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రణాళికలోని అంశాలను అమలు చేయని రేవంత్ సర్కార్... రాష్ట్రంలోని నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులను దారుణంగా మోసం చేసిందని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేస్తాం, పీఆర్సీ ఇస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఒక్క డీఏ ఇచ్చి దీపావళి చేసుకోమనటం విడ్డూరంగా ఉందన్నారు.

మూసీ ప్రక్షాళన పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎండగడుతున్నందుకే తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై, సీఎం రేవంత్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని హరీశ్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకుని సీఎం రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఫ్యామిలీ ఫంక్షన్‌ను తప్పుగా ప్రచారం చేస్తూ, రేవ్ పార్టీ జరక్కముందే జరిగినట్టు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా కేటీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి పూనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌లో సోదాలు చేసిన అధికారులే అక్కడేమీ లేదంటూ చెబుతున్నా సీఎం ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. అయినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామనీ, రేవంత్ చర్యలకు భయపడేదే లేదని హెచ్చరించారు.

పేదల జోలికెళ్లం..

(మొదటిపేజీ తరువాయి)



పత్రిక అని కొనియాడారు. ఈ సందర్భంగా నవతెలంగాణ సిబ్బంది, విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. హైడ్రా ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై అవగాహన కల్పించారు. 'నవతెలంగాణ' హైదరాబాద్ జనరల్ మేనేజర్ లింగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాపులో సీజీఎం ప్రభాకర్, మఫిషిల్ ఇన్‌చార్జి వేణుమాధవరావు, హెచ్‌ఆర్ జీఎం నరేందర్, డెస్క్ ఇన్‌చార్జి శివ, మేనేజర్లు, సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కీలక ఆధారాలు దొరికినట్టేనా ?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యానికి రకరకాల కారణాలు ఉన్నాయనీ, అందులో బ్లాకులు కుంగడానికి, సీపేజీలు రావడానికి పిల్లర్ల కింద ఇసుక కదిలిపోవడమే కారణమని జస్టిస్ ఘోష్ కమిషన్‌కు అధికారులు చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు, మాజీ ఈఎన్సీ మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్సీ నాగేంద్ర రావు కమిషన్‌తోపాటు పలువురు అధికారులు, సిబ్బంది స్టేట్‌మెంట్లు ఇచ్చిన విషయం విదితమే. అధికారుల స్థాయిలో క్రాస్ ఎగ్జామినేషన్ కూడా జరుగుతున్న నేపథ్యంలో తదుపరి విచారణకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులను పిలిచే అవకాశం ఉంది. అధికారుల వాంగ్మూలాలు అన్ని మాజీ సీఎం కేసీఆర్, మాజీ సాగునీటి శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వైపు వేలెత్తి చూపిస్తున్నాయి.

ప్రాజెక్టు వైఫల్యానికి కారకులను తేల్చే క్రమంలో ఎవరినైనా పిలుస్తామనీ, విచారణకు రాకపోతే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని గతంలో కమిషన్ చైర్మెన్ జస్టిస్ ఘోష్ అంతర్గత సమావేశాలో చెప్పినట్టు తెలిసింది. ఇప్పటికే విచారణకు ఎన్డీఎస్ఏ, పోలీస్ విజిలెన్స్ నివేదికల ఆధారంగా కమిషన్ విచారణ చేస్తామని చైర్మెన్ గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా ఎస్.హరీశ్

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్‌గా టి.కె.శ్రీదేవి నియమితులయ్యారు. వీరితో కలిపి రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి.

ఐఏఎస్ అధికారులు నారాయణరెడ్డి-రంగారెడ్డి కలెక్టర్‌గా, త్రిపాఠి-నల్లగొండ కలెక్టర్ , మంద మకరందు- సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్.కె. హనుమంతులు-పర్యాటకశాఖ డైరెక్టర్, దేవాదాయశాఖ సంచాలకులుగా అదనపు బాధ్యతలు, శశాంక- రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్ , హరీశ్ - విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, వినయ్ కృష్ణారెడ్డి-ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్, ఆయేషా మస్రత్ - వైద్యారోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కె. చంద్రశేఖర్‌రెడ్డి-డెయిరీ కార్పొరేషన్ ఎండీ, ఎస్.దిలీప్‌కుమార్-నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, సోని బాలదేవి- క్రీడాశాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు), కొర్రా లక్ష్మి-రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా కొర్రా లక్ష్మికి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.

ఐఎఫ్ఎస్‌ల బదిలీలు

రాష్ట్రంలో ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఎస్.క్షితిజ - ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ, సుభద్రా దేవి - జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్, జి.జ్ఞానేశ్వర్ - వికారాబాద్ డీఎఫ్ఓగా నియమితులయ్యారు.

రాష్ట్రంలో డిప్యూటీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు ఉన్నారు. ఈ ఉత్తర్వులతో 47 మంది డిప్యూటీ, 23 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ బదిలీల్లో రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, 4 జిల్లాల డీఆర్వోలు ఉన్నారు.

ఇరు దేశాల మైత్రికి కొత్త శక్తి

గాంధీనగర్ : భారత పర్యటనలో భాగంగా స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచేజ్ గుజరాత్‌లోని వడోదరకు చేరుకున్నారు. అనంతరం ఆయన భారత ప్రధాని మోడీతో కలిసి వడోదరలోని విమానాశ్రయం నుంచి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు దేశాల ప్రధానులు ఓపెన్ జీప్‌లో ప్రయాణించారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఫెసిలిటీని ప్రారంభించటం కోసం విమానాశ్రయం నుంచి టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకు 2.5 కిలోమీటర్లు రోడ్ షో నిర్వహించారు. పలువురు కళాకారులు తమ ప్రదర్శనలతో మోడీ, సాంచేజ్‌లకు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఇరు ప్రధానులు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఇది భారత 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్'కు గణనీయమైన శక్తినందిస్తుందని నొక్కి చెప్పారు. పెడ్రో సాంచేజ్ పర్యటన.. భారత్-స్పెయిన్‌ల మధ్య బంధానికి కొత్త శక్తినిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌ను ఇండస్ట్రియల్ పవర్ హౌజ్‌గా మార్చటంలో మోడీ విజన్‌ను స్పెయిన్ ప్రధాని కొనియాడారు. ఆ తర్వాత మోడీ అమ్రేలీలోని భారత్ మాతా సరోవర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన లాంచ్ చేశారు. భారత్‌లో స్పెయిన్ ప్రధాని పర్యటించటం ఇదే తొలిసారి.

ఆగని మారణకాండ

వరుస వైమానిక, క్షిపణి దాడులతో దద్దరిల్లిన 'టైర్'

- ఇజ్రాయిల్ దాడిలో ఏడుగురు మృతి, 17మందికి గాయాలు
- నగరాన్ని కమ్మేసిన పొగ, దుమ్ము ధూళి
- గాజాలో 22మంది మృతి, వందలాదిమంది అరెస్టు
- రెండు రోజుల కాల్పుల విరమణకు ఈజిప్ట్ ప్రతిపాదన



గాజా, బీరుట్ : లెబనాన్ పోర్ట్ సిటీ టైర్‌పై ఇజ్రాయిల్ బలగాలు వరుస వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. బాంబుల హోరు, నల్లని దట్టమైన పొగ, లేచిన దుమ్ము ధూళి నగరమంతా కమ్మేసింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, 17మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. నగరం నట్టనడిబొడ్డును లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు క్షిపణుల వర్షం కురిపించాయి. చారిత్రక నగరాన్ని నేలమట్టం చేయాలన్నదే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. నగరంలో నివాస ప్రాంతాల్లో ఐదారుసార్లు వైమానిక దాడులు జరిగాయి. మొదటి రెండు దాడుల్లో నివాస భవనాలు పేకమేడల్లా కూలిపోవడం కనిపించిందని స్థానిక మీడియా తెలిపింది. టైర్ నగరంలో పరిస్థితులు ఊహించనలవిగాని రీతిలో వున్నాయని, గత కొద్ది గంటల్లో నగరంలోని కార్నిచ్ ఏరియా చుట్టుపక్కల వరుస దాడులతో హోరెత్తిపోయింది. ఈ నేపథ్యంలో లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని యురోపియన్ యూనియన్ పిలుపిచ్చింది.

గాజాలో 600మంది అదుపులోకి

సోమవారం ఉదయం నుండి గాజాలో జరిగిన దాడుల్లో 22మంది మరణించారు. వారిలో 13మంది ఉత్తర గాజా దాడుల్లో చనిపోయారని వైద్య వర్గాలు తెలిపాయి. గత 48గంటల్లో 96మంది మరణించారని పేర్కొన్నాయి. ఉత్తర గాజాలోని ప్రాంతాల నుండి, జాబాలియా శరణార్థ శిబిరం నుండి దాదాపు 600మంది పాలస్తీనియన్లను అరెస్టు చేసినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ రేడియో తెలిపింది. గాజా నగరంలోని సాబ్రా ఏరియాలో ఇద్దరు మరణించగా, రఫా నగరంలో రెండు మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ గాజాలోని బురెజి శరణార్థ శిబిరంపై వరుసగా క్షిపణులతో, డ్రోన్‌లతో దాడులు కొనసాగుతున్నాయి. తూర్పు ప్రాంతంలోని తమ ఇళ్ళకు తిరిగివస్తున్న ఒక బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. అంతకుముందు సోమవారం తెల్లవారు జామున షుజయె ప్రాంతంలో నివాస భవనాన్ని లక్ష్యంగా చేసుకుని కూడా ఇదే రీతిలో మిలటరీ దాడులు జరిపింది.

ముగ్గురు మరణించారు. వారి మృతదేహాలను కొద్ది గంటలు గడిచిన తర్వాత గుర్రపు బండిపై వేసుకుని ఆస్పత్రికి ఒక వలంటీర్ తీసుకెళ్ళడం కనిపించిందని మీడియా పేర్కొంది. ఇప్పటివరకు గాజాలో మరణించిన వారి సంఖ్య 43,020కి చేరుకోగా, గాయపడిన వారి సంఖ్య 1,01,110కి చేరుకుంది.ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రిలో దాదాపు వందమందిని సైన్యం అదుపులోకి తీసుకుంది. వారందరూ ఆస్పత్రి సిబ్బందేనని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

ఈజిప్ట్ ప్రతిపాదన

గాజాలో రెండు రోజుల పాటు కాల్పుల విరమణ జరగాలని, ఈ సమయంలో నలుగురు బందీలను విడుదల చేయాలని ప్రతిపాదించినట్లు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్ శిశి తెలిపారు. దీనిపై ఇరు పక్షాలనుండి వెంటనే ఎలాంటి స్పందన తెలియరాలేదు. అలాగే పాలస్తీనా ఖైదీలను కూడా కొంతమందిని విడుదల చేయాలని, గాజాకు మానవతా సాయాన్ని పంపాలని కూడా ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. శాశ్వత కాల్పుల విరమణ కోసం చర్చలు కొనసాగాలని, అందుకోసం పరిస్థితులను కాస్తంత ముందుకు తీసుకెళ్ళాలంటే ఈ ప్రతిపాదనలు అమలు చేయాలని ఆయన సూచించారు.

ఖమేని ఖాతా సస్పెన్షన్

ఇరాన్ సుప్రీం నేత అయిన ఆయతుల్లా అలీ ఖమేని కొత్త సోషల్ మీడియా ఖాతాను ఎక్స్ సస్పెండ్ చేసింది. ఆ ఖాతాలో హీబ్రూలో పోస్టులు పెడుతూ వుంటారు. ఎక్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ ఖాతాను నిలుపుచేసినట్లు ఎక్స్ పేర్కొంది. అయితే ఆ ఉల్లంఘన ఏమిటన్నది వెంటనే తెలియరాలేదు.

ఇరాన్ సైనిక స్థావరాలపై దాడి దృశ్యాలు విడుదల

ఇరాన్ రాజధాని టెహరాన్‌కు ఆగ్నేయంగా గల ఒక రహస్య సైనిక స్థావరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడికి సంబంధించిన శాటిలైట్ దృశ్యాలు విడుదలయ్యాయి. ఈ దాడుల్లో ఆ స్థావరంలోని పలు భవనాలు ధ్వంసమైనట్లు కనిపిస్తోంది. సమీపంలోని ఖోజీర్ సైనిక స్థావరంలో కూడా కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతంలో భూగర్భ సొరంగ వ్యవస్థ, క్షిపణి తయారీ ప్రదేశాలు వున్నాయని, వాటిని బయటి ప్రపంచానికి తెలియకుండా ఇరాన్ దాచిపెట్టిందని ఇజ్రాయిల్ ఆరోపించింది. సైనిక స్థావరాలపై దాడి జరిగిందన్న విషయాన్ని ఇరాన్ ధ్రువీకరించలేదు. ఇజ్రాయిల్ దాడిలో వైమానిక రక్షణ వ్యవస్థలో పనిచేస్తున్న నలుగురు ఇరాన్ సైనికులతో పాటు ఓ పౌరుడు మరణించినట్లు ప్రకటించింది. మృతుల వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ రాజధాని టెహరాన్‌కు నైరుతి, పశ్చిమప్రాంతాల్లోని వైమానిక, సైనిక స్థావరాలపై శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే.

తిరిగి అధికారంలోకి వస్తే వాటర్ బిల్లు మాఫీ : ఆప్



న్యూఢిల్లీ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే పెరిగిన వాటర్ బిల్లుని మాఫీ చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఆదివారం వాజీపూర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తనను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే గతంలోని వాటర్ బిల్లులను మాఫీ చేస్తానని ఢిల్లీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎవరైతే తమ నీటి బిల్లు అధికమని భావిస్తారో వారు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు.ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు కాగా, మార్చిలో అందని వాటర్ బిల్లులను మాఫీ చేస్తామని అన్నారు. బిజెపికి ఓటు వేస్తే.. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యంగా విద్యుత్, వాటర్‌కి సంబంధించిన సంక్షేమ పథకాలను నిలిపివేస్తుందని హెచ్చరించారు.



ఫాలోఆన్‌లో ప్రతిఘటన!

పుదుచ్చేరి రెండో ఇన్నింగ్స్ 171/2

నవతెలంగాణ-హైదరాబాద్: ఈ ఏడాది రంజీ ట్రోఫీలో తొలి విజయంపై కన్నేసిన హైదరాబాద్‌కు పుదుచ్చేరి సవాల్ విసురుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులకే కుప్పకూలిన పుదుచ్చేరి ఫాలోఆన్‌లో అనూహ్యంగా ప్రతిఘటన చూపిస్తుంది. ఓపెనర్లు శ్రీధర్ రాజు (61 నాటౌట్), అజయ్ రోహెర (69) అర్థ సెంచరీలతో తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించిన పుదుచ్చేరి.. హైదరాబాద్ బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచింది. ఎనిమిది బౌలర్లు ప్రయత్నించినా.. 47 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే పడ్డాయి. లెఫ్టార్మ్ స్పిన్నర్ అనికెత్ రెడ్డి (5/11) ఐదు వికెట్ల ప్రదర్శనతో పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్‌లో 42 ఓవర్లలోనే చేతులెత్తేసింది. హైదరాబాద్ 383 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. ప్రస్తుతం పుదుచ్చేరి మరో 212 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలో కొనసాగుతుంది. నేడు ఆఖరు రోజు ఆటలో గెలుపే లక్ష్యంగా హైదరాబాద్ సిద్ధమవుతుంది.

గ్యారీ కిర్‌స్టన్ నిష్క్రమణ

పాకిస్థాన్ వైట్‌బాల్ కోచ్‌గా రాజీనామా



కరాచీ : పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)తో దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం గ్యారీ కిర్‌స్టన్ తెగతెంపులు చేసుకున్నాడు. పాకిస్థాన్ జట్టుకు టీ20, వన్డే కోచ్‌గా ఈ ఏడాది ఏప్రిల్‌లో గ్యారీ కిర్‌స్టన్ నిమిమతులయ్యారు. ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌తో పాకిస్థాన్ కోచ్‌గా కిర్‌స్టన్ ప్రయాణం మొదలైంది. ఆ టోర్నీలో పాకిస్థాన్ గ్రూప్ దశ నుంచే నిష్క్రమించింది. పదేపదే కెప్టెన్సీ మార్పు, ఆటగాళ్లను తరచుగా మార్చటంపై పీసీబీతో కిర్‌స్టన్‌కు విభేదాలు వచ్చినట్టు సమాచారం. 50 ఓవర్ల ఫార్మాట్‌లో విశేషంగా విజయవంతమైన కిర్‌స్టన్.. పాకిస్థాన్ వైట్‌బాల్ కోచ్‌గా ఒక్క వన్డే మ్యాచ్‌కు సైతం బాధ్యతలు నిర్వర్తించకుండానే పదవి నుంచి తప్పుకున్నాడు. కిర్‌స్టన్ రాజీనామాతో రానున్న ఆస్ట్రేలియా పర్యటనకు టెస్టు జట్టు కోచ్ జేసన్ గిలెస్పీకి కోచ్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పీసీబీ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. గ్యారీ కిర్‌స్టన్ కోచ్‌గా భారత్ 2011 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సాధించిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు సైతం కిర్‌స్టన్ కోచ్‌గా పని చేశారు.

సలీమకు కెప్టెన్సీ పగ్గాలు

భారత మహిళల హాకీ జట్టు ఎంపిక



న్యూఢిల్లీ : భారత స్టార్ మిడ్‌ఫీల్డర్ సలీమ టెటె మహిళల హాకీ జట్టుకు సారథ్యం వహించనుంది. 2024 ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ నవంబర్ 11-20 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరుగనుంది. భారత్ సహా చైనా, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, థాయ్‌లాండ్ జట్లు ఈ టోర్నీలో పోటీపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు సలీమ కెప్టెన్‌గా ఎంపిక కాగా.. నవనీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ మేరకు భారత హాకీ సమాఖ్య సోమవారం మహిళల జట్టును ప్రకటించింది. 2016 తర్వాత 2023 ఫైనల్లో జపాన్‌ను ఓడించి రెండోసారి విజేతగా నిలిచిన టీమ్ ఇండియా.. మూడో టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగనుంది. తొలి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనున్న భారత్.. వరుసగా దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, చైనా, జపాన్‌లను ఢీకొట్టనుంది.

భారత మహిళల హాకీ జట్టు : సవిత, బిచూ దేవి (గోల్ కీపర్లు). ఉదిత, జ్యోతి, వైష్ణవి, సుశీల చాను, ఇశిక చౌదరి (డిఫెండర్లు). నేహా, సలీమ (కెప్టెన్), షర్మిలా దేవి, మనీశ చౌహాన్,సునెలిట, లాల్‌రెమిసియామి (మిడ్ ఫీల్డర్లు). నవనీత్ కౌర్ (వైస్ కెప్టెన్), ప్రీతి దూబె, సంగీత కుమారి, దీపిక, బ్యూటీ (ఫార్వర్డ్స్).

చిరాగ్ పసిడి పట్టు

అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ పోటీలు



న్యూఢిల్లీ : ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ (అండర్ 23)లో యువ రెజ్లర్ చిరాగ్ పసిడి పతకం సాధించాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో పోటీపడిన చిరాగ్ ప్రతిష్టాత్మక పోటీల్లో బంగారు పతకం సాధించిన మూడో భారత మల్లయోధుడిగా నిలిచాడు. ఒలింపిక్ మెడలిస్ట్ పవన్ సెహ్రావత్, రితీక హుడా మాత్రమే ఇప్పటి వరకు అండర్23 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణాలు సాధించారు. సోమవారం జరిగిన పసిడి పోరులో కిర్గిస్థాన్ రెజ్లర్ కరచోవ్‌పై 4-3తో ఆఖరు క్షణాల్లో ఆధిపత్యం సాధించిన చిరాగ్ పసిడి నెగ్గి చాంపియన్‌గా నిలిచాడు. అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఓ స్వర్ణం, సిల్వర్ సహా తొమ్మిది పతకాలు సాధించింది.

టైటాన్స్‌కు రెండో విక్టరీ

ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



నవతెలంగాణ-హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు రెండో విజయం సాధించింది. వరుసగా మూడు మ్యాచుల్లో ఓటమి నుంచి పుంజుకున్న తెలుగు టైటాన్స్.. సోమవారం హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ దశ మ్యాచ్‌లో మూడు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై 28-26 తో మెరుపు విజయం సాధించింది. ప్రథమార్థంలో వెనుకంజ వేసిన టైటాన్స్.. ద్వితీయార్థంలో దుమ్మురేపే ప్రదర్శన చేసింది. 2 పాయింట్ల తేడాతో సీజన్లలో రెండో విజయం సాధించి.. వరుస పరాజయాలకు చెక్ పెట్టింది. తెలుగు టైటాన్స్ రెయిడర్లు ఆశీష్ నర్వాల్ (9 పాయింట్లు), పవన్ సెహ్రావత్(5 పాయింట్లు), డిఫెండర్ అంకిత్ (4 పాయింట్లు) రాణించారు. పట్నా పైరేట్స్ తరఫున రెయిడర్లు దేవాంక్(7 పాయింట్లు), అయాన్ (6 పాయింట్లు) రాణించారు. పట్నా పైరేట్స్‌కు మూడు మ్యాచుల్లో ఇది రెండో ఓటమి కాగా.. తెలుగు టైటాన్స్‌కు ఐదు మ్యాచుల్లో ఇది రెండో విజయం కావటం విశేషం.

నవచిత్రం

ఆ.. 3 పాయింట్లు చాలా కీలకం




కిరణ్ అబ్బవరం

"'క' మూవీ క్లైమాక్స్‌ను కొత్తగా చెప్పడానికి ప్రయత్నించాం. ఇలాంటి క్లైమాక్స్‌తో ఇంత వరకు ఏ సినిమా రాలేదు. అందుకే కొత్తదనం మీరు ఫీల్ కాకపోతే నేను సినిమాలు చేయను అనే బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చాను' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించిన చిత్రం 'క'. దర్శక ద్వయం సుజీత్, సందీప్ రూపొందించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 31న తెలుగులో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు. సినిమా విడుదల సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మీడియాలో సంభాషించారు.

- 'క' అంటే ఏంటి?, ఈ మూవీ కథ ఏంటి అనేది మీకు క్లైమాక్స్‌లో రివీల్ అవుతుంది. దర్శకులు సందీప్, సుజీత్ ఈ కథ చెప్పినప్పుడు నెక్ట్స్ ఏం జరుగుతుంది అనేది ఊహించలేకపోయాను. అలాగే దర్శకులు చెప్పిన షాట్ మేకింగ్ కూడా కొత్తగా అనిపించింది.
- చాలా మంది 'కాంతార, విరూపాక్ష' సినిమాలతో పోలుస్తున్నారు. కానీ అలా ఏమాత్రం ఉండదు. ఇది సైకలాజికల్‌గా వెళ్ళే సినిమా. ఇందులో ఎలాంటి డివోషనల్ పాయింట్స్ ఉండవు. ఎవరు?, ఏంటి?, ఎక్కడ అనే సస్పెన్స్‌తో మూవీ సాగుతుంది. ప్రతీసారి ఈ మూడు పాయింట్స్ ప్రేక్షకుల్ని ట్రిగ్గర్ చేస్తుంటాయి. 1977లో కృష్ణగిరి అనే ఊరిలో ఉండే అభినయ వాసుదేవ్ అనే పోస్ట్ మ్యాన్ క్యారెక్టర్‌లో నటించాను.ఈ పాత్ర కోసం చాలా హోం వర్క్ చేశాను.
- రాధ పాత్రలో తన్వీరామ్ చేసింది. ఈ పాత్ర ద్వారా మా క్యారెక్టర్స్ రివీల్ అవుతుంటాయి. సత్యభామ క్యారెక్టర్‌లో నయన్ సారిక కనిపిస్తుంది. తను అభినయ వాసుదేవ్ లవ్ ఇంట్రెస్ట్‌గా నటించింది. వీరిద్దరివీ కీలక పాత్రలే. నాగ చైతన్య మా మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు గెస్ట్‌గా వస్తున్నారు. నా ఫిల్మోగ్రఫీలో ఒక మంచి మూవీగా ఇది నిలుస్తుంది.

10 భిన్న ప్రేమకథలు



వీరశంకర్, మనోహర్ చిమ్మని

యూత్‌ఫుల్ లవ్‌ఎంటర్‌టైనర్స్‌కు ఎప్పుడూ ప్రేక్షకుల ఆదరణ ఉంటుంది. అలాంటి కథా కథనాలతో 'YO! 10 ప్రేమకథలు' సినిమా రాబోతోంది. ఈ చిత్రాన్ని పీసీ క్రియేషన్స్ సమర్పణలో మనూ టైమ్ మూవీ మిషన్ సంస్థ నిర్మిస్తోంది.

ఈ చిత్రానికి మనోహర్ చిమ్మని దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది.

ఈ వేడుకకు దర్శకులు వీరశంకర్, చంద్రమహేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మూవీ పోస్టర్ పై దర్శకుడు వీరశంకర్ క్లాప్ కొట్టారు.

దర్శకుడు మనోహర్ చిమ్మని మాట్లాడుతూ, 'యో... అనే మాట యువతకు ప్రతీక. ఈతరం యువతీయువకుల ఆలోచనలు, జీవనశైలి చుట్టూ అల్లిన 10 ప్రేమ కథల సమాహారం ఈ సినిమా. ఒక్కో ప్రేమకథ ఒక్కో జోనర్లో ఉంటుంది. అయితే ఈ ప్రేమకథలన్నింటికీ లక్ష్యం ఒక్కటే ఉంటుంది. ఆ లక్ష్యమే ఈ సినిమాను యువతరం ప్రేక్షకులకు కనెక్ట్ చేస్తుంది. ఈ సినిమాలో పది మంది పాపులర్ హీరో, హీరోయిన్లు నటిస్తున్నారు. సపోర్టింగ్ రోల్స్‌లో కూడా పాపులర్ సహనటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ నటిస్తున్నారు. నవంబర్ చివరివారం నుంచి వైజాగ్, గోవా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అద్భుతమైన లొకేషన్స్‌లో షూట్ చెయ్యబోతున్నాం. ఈ ప్రారంభ వేడుకలో ప్రదర్శించిన ఇంట్రో వీడియో, ఈ చిత్ర పోస్టర్ డిజైనింగ్‌ను ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో చేశాం. ఈ సినిమాలోని ఇంకా చాలా అంశాల్లో ఏఐని ఉపయోగిస్తున్నాం' అని తెలిపారు.

డబ్బు కోసం తీసిన సినిమా కాదు



సూర్య

హీరో సూర్య నటిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రం 'కంగువ'. శివ దర్శకుడు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రధారులు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

ఈ సినిమాను నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయబోతున్నారు.

నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది.

ఈ నేపథ్యంలో వైజాగ్‌లో నిర్వహించిన 'కంగువ' మెగా ఈవెంట్‌లో నిర్మాత జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ, 'ఇలాంటి అత్యంత ప్రతిష్టాత్మ మూవీ చేయటానికి మీ అభిమానం ఓ కారణమైతే, మరో కారణం రాజమౌళి ఇచ్చిన స్ఫూర్తి' అని అన్నారు.

'ప్రతి దర్శకుడికి ఒక ఎపిక్ మూవీ చేయాలని ఉంటుంది. నాకూ అలాంటి అవకాశం ఈ సినిమాతో దొరికింది. బ్యూటీఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది' అని డైరెక్టర్ శివ చెప్పారు.

హీరో సూర్య మాట్లాడుతూ,'వైజాగ్‌తో మాకు ఎంతో అనుబంధం ఉంది. నేను ఇలాంటి భారీ సినిమా చేసేందుకు నా భార్య జ్యోతిక సపోర్ట్ ఎంతో ఉంది. ఈ సినిమా డబ్బు కోసం చేసింది కాదు, మీ అందరికీ ఒక గొప్ప సినిమా ఇవ్వాలని చేసిన ప్రయత్నం' అని తెలిపారు.

ఒగ్గు కళాకారుల జీవన చిత్రం



మమత ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్ పై బన్నీ రాజు హీరోగా ఒగ్గు కళాకారుల జీవన నేపథ్యంలో నిర్మించిన చిత్రం 'బ్రహ్మాండ'. సోమవారం ఈ చిత్ర టీజర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఆధ్యాత్మిక, గ్రామీణ కళాకారుల జీవితాల నేపథ్యంలో అరుదుగా సినిమాలు వస్తుంటాయి. తెలంగాణ సాంస్కృతిక నేపథ్యం, జానపదాలపై సినిమాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పటికి, ఇప్పటికీ ఒగ్గు కళ గ్రామీణ ప్రజలను అలరిస్తోంది. గ్రామీణ కళారూపాలు అంతరించిపోతున్నాయని ఆందోళన పడుతున్న ఇలాంటి తరుణంలో ఒగ్గు కళాకారుల కథాంశంగా 'బ్రహ్మాండ' సినిమాని తీయడం గొప్ప విషయం. ఈ సినిమా మంచి విజయం సాధించాలి. గ్రామీణ కళల్ని ఈ తరానికి తెలియజేయాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నా. ఇప్పుడు మంచి కథ ఉన్న ప్రతి సినిమా పెద్ద సినిమానే. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది' అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిర్మాత దాసరి సురేష్, దర్శకుడు రాంబాబు, హీరో బన్నీ రాజుతో పాటు ఇతర తారాగణం పాల్గొన్నారు.

ఈ అవార్డు నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చింది

- ఏఎన్నార్ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో చిరంజీవి



చిరంజీవి తన నట జీవితంలో మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

ఏఎన్నార్ జాతీయ అవార్డును బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఆయనకు ప్రదానం చేశారు. సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన అక్కినేని జాతీయ పురస్కార ప్రదానోత్సవ వేడుకకి ముఖ్య అతిథిగా అమితాబ్ బచ్చన్ హాజరయ్యారు.

తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన తనయుడు నాగార్జున ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, 'నాకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, గిన్నీస్‌బుక్‌లో స్థానం..ఇలాంటివి ఎన్ని వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నా వాళ్ళు నన్ను గుర్తించి అవార్డు ఇవ్వడం గొప్ప విషయంగా అనిపించింది. అందుకే నాగార్జునకి ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన అవార్డు అని చెప్పా. ఈ అవార్డు నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చింది. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, హేమామాలిని, కె.బాలచందర్ వంటి గొప్పవాళ్ళకు ఇచ్చిన పురస్కారం నాకు దక్కడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. జీవితాంతం ఈ అనుభూతిని మనసులో పెట్టుకుంటాను' అని అన్నారు. 'తెలుగు సినిమాలోనే కాకుండా మొత్తం సినీ ఇండస్ట్రీలో ఏఎన్నార్ సత్తా చాటారు. ఎంతో మందికి వినోదాన్ని పంచారు' అని అమితాబ్ బచ్చన్ చెప్పారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం చిరంజీవిది అని, ఆయనతో తనకి ఉన్న అనుబంధాన్ని నాగార్జున ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

కుటుంబ భావోద్వేగాల సమాహారం



మీనాక్షి చౌదరి

'నేను మొదటిసారి తల్లి పాత్ర పోషించాను. ఇది నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. నా చిన్నప్పుడు మా అమ్మ ఎలా ఉండేదో తెలుసుకొని, అందుకు తగ్గట్టుగా పాత్రలో ఒదిగిపోయాను. ఇందులో నేను పోషించిన సుమతి పాత్ర ప్రేక్షకులకు మరింత చేరువవుతుందనే నమ్మకం ఉంది' అని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ 'లక్కీ భాస్కర్' అనే మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమైంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. దీపావళి కానుకగా ఈనెల 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కథానాయిక మీనాక్షి చౌదరి చిత్ర విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు.

- 'గుంటూరు కారం' తర్వాత సితార బ్యానర్‌లో ఇది నా రెండో సినిమా. దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరితో కలిసి పని చేయటం మంచి అనుభూతినిచ్చింది. బ్యాంకింగ్ నేపథ్యంలో కొన్ని సిరీస్‌లు వచ్చాయి. కానీ కుటుంబ భావోద్వేగాలను ముడిపెడుతూ వెంకీ అట్లూరి ఈ కథ రాసిన విధానం నాకు బాగా నచ్చింది. ఎమోషన్స్‌తో కూడిన ఒక బ్యూటీఫుల్ జర్నీ ఈ మూవీ. అలాగే నా పాత్ర కూడా బాగా నచ్చింది.
- డబ్బు కారణంగా మధ్యతరగతి మనిషి జీవితంలో, అతని కుటుంబంలో ఎలాంటి మార్పులు వచ్చాయనే దాని చుట్టూ ఈ కథ తిరుగుతుంది. భాస్కర్ దగ్గర ఏమీ లేనప్పుడు తనని తనగా ఇష్టపడుతుంది సుమతి. ప్రేమను పంచే కుటుంబం, బతకడానికి అవసరమైనంత డబ్బు ఉంటే చాలు అనుకునే స్వభావం తనది. అయితే దురాశ, డబ్బు కారణంగా భాస్కర్-సుమతి మధ్య ఏం జరిగింది అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాతో నాకు నటిగా మంచి గుర్తింపు వస్తుందని, మరిన్ని మంచి కథలు వస్తాయని భావిస్తున్నాను.
- ఇందులో ఎమోషన్స్ బాగుంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉంటాయి. చూసిన ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. ఇదొక కామన్ మ్యాన్ కథ. అందరికీ నచ్చుతుంది. నేను నటించిన 'మట్కా, మెకానిక్ రాకీ' విడుదలకు సిద్ధమవుతున్నాయి. వెంకటేష్, అనిల్ రావిపూడి సినిమాలో నటిస్తున్నాను. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886